ప్రకటనల కోసం
సంప్రదించండి
9848328698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 12.06.2024 | సంపుటి : 10 సంచిక : 333 | పేజీలు : 12 వెల: రూ. 4/-
Follow :
RNI NO.APTEL / 2013 /50370
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనం గోసల గొంతుక
జనంసాక్షి
ఇది ప్రజల చానల్
JANAMSAKSHI TV



## విద్యుత్‌శాఖ కుంభకోణంలో
# కేసీఆర్‌తో సహా 25 మందికి నోటీసులు



### విచారణకు హాజరుకండి

**చత్తీస్‌గఢ్‌తో ఒప్పందం రాష్ట్ర ఖజానాకు భారమే**

**విద్యుత్‌ కొనుగోళ్ల కోసం అత్యధికంగా చెల్లింపులు**

**ఈ ఒప్పంద సమయంలో అసలు ఆ విద్యుత్‌ సంస్థ నిర్మాణమే జరగలేదు**

**దీంతో పాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్‌ కేంద్రాలకూ టెండర్లు లేకుండానే నేరుగా అనుమతులు : జస్టిస్‌ ఎల్‌.నరసింహారెడ్డి**

**హైదరాబాద్‌(జనంసాక్షి):** తెలంగాణలో విద్యుత్‌ కొనుగోళ్ల అంశంలో దర్యాప్తు వేగంగా సాగుతోంది.తెలంగాణలో విద్యుత్‌ కొనుగోళ్ల అంశంలో బీఆర్‌ఎస్‌ అధినేత, మాజీ సీఎం కేసీఆ ర్‌కు నోటీసులు ఇచ్చినట్లు జస్టిస్‌ ఎల్‌.నరసింహారెడ్డి తెలిపారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్కేంద్రం నిర్మాణం, ఛత్తీస్‌గఢ్‌ విద్యుత్‌ కొనుగోళ్ల ఒప్పంద విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానంపై విచారణకు ఏర్పాటైన జస్టిస్‌ నరసింహారెడ్డి జ్యుడిషియల్‌ కమిషన్‌ విచారణ కొనసాగుతోంది.ఈ అంశంలో కేసీఆర్‌, మాజీ ఇంధన కార్యదర్శులు, ప్రిన్సిపల్‌ సెక్రటరీలుగా పనిచేసిన అర్వింద్‌ కుమార్‌, ఎస్కే జోషి, సురేశ్‌ చందా, అజయ్‌ మిశ్రా సహా 25 మందికి నోటీసులు ఇచ్చినట్లు జస్టిస్‌ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంపై వివరణ ఇచ్చేందుకు కేసీఆర్‌ జులై 30వ తేదీ వరకు సమయం కోరగా జూన్‌ 15వరకు వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు. నోటీసులకు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకుంటే కమిషన్‌ ముందు విచారణకు రావాల్సిందేనని స్పష్టం చేశారు. ''ఒకటి ఛత్తీస్‌గఢ్‌ నుంచి పవర్‌ కొనుగోలు ఒప్పందం, రెండోది భద్రాద్రి థర్మల్‌ పవర్‌ స్టేషన్‌, మూడోది యాదాద్రి థర్మల్‌ విద్యుత్‌ కేంద్రం. ఈ మూడు కూడా టెండర్‌ ప్రక్రియ లేకుండా డైరెక్ట్‌గా అనుమతులు ఇచ్చినవే. ఈ ప్రక్రియలో దాదాపు 25 మంది ఉన్నట్లు గుర్తించాం. ఇందులో నిర్ణయాలు తీసుకున్న అధికారులు, అనధికారులు అందరికీ నోటీసులు జారీ చేశాం. అలానే వారు సమాధానం ఇచ్చారు. వారిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ మాత్రమే జులై చివరి వరకు సమయం అడిగగా, మేము అందుకు జూన్‌ 15 వరకు టైం ఇచ్చాం. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్‌ సంస్థల నిర్మాణం టెండరు ప్రక్రియలో కాకుండా నామినేషన్‌ ప్రక్రియలో వెళ్లడం వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడినట్లు జస్టిస్‌ ఎల్‌.నరసింహారెడ్డి కమిషన్‌ వెల్లడించింది. ఛత్తీస్‌గఢ్‌ విద్యుత్‌ కొనుగోళ్లతో ప్రభుత్వానికి మిగతా 2లో..

# కాళేశ్వరం ప్రాజెక్టు లెక్కతప్పింది

**జూన్‌ 25లోపు నివేదిక సమర్పించాలని ఇంజినీర్లకు చెప్పాం**

**విచారణకు హాజరైన వారంతా అఫిడవిట్లు ఇవ్వాలి**

**కాళేశ్వరం కమిషన్‌ చీఫ్‌ పీసీ ఘోష్‌ వెల్లడి**

**హైదరాబాద్‌(జనంసాక్షి):** మేడిగడ్డ సహా కాళేశ్వరం ప్రాజెక్టు ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై ఇంజనీర్లు అందరూ ఈ నెల 25వ తేదీలోగా అఫిడవిట్లు దాఖలు చేయాలని విచారణ కమిషన్‌ చైర్‌పర్సన్‌ జస్టిస్‌ పినాకీ చంద్ర ఘోష్‌ తెలిపారు. విచారణ ప్రక్రియలో భాగంగా కమిషన్‌ ముందు ఇవాళ నీటిపారుదల శాఖకు చెందిన 20 మందికి పైగా ఇంజినీర్లు హాజరయ్యారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణం, నాణ్యతా నిర్వహణ, డ్యాం సేఫ్టీ ఇంజినీర్లు ఇందులో ఉన్నారు. డిజైన్లు, అధ్యయనాలు, గమనించిన అంశాలు, తీసుకున్న చర్యలు, తదితరాల గురించి ఇంజినీర్లను విచారణ చేశారు. కమిషన్‌ ముందు చెప్పిన అంశాలను అఫిడవిట్ల రూపంలో దాఖలు చేయాలని కమిషన్‌ ఇంజినీర్లను ఆదేశించింది. మూడు ఆనకట్టల బాధ్యతలు చూసిన ఇంజినీర్ల విచారణ జరుగుతోందన్న జస్టిస్‌ పీసీ ఘోష్‌, ఇంజినీర్లు అందరినీ ఈ నెల 25వ తేదీలోపు అఫిడవిట్‌ దాఖలు చేయాలని చెప్పారు.అఫిడవిట్‌ ద్వారా అయితే అన్ని అంశాలు రికార్డు అవుతాయని అన్నారు. బ్యారేజీల విషయంలో లెక్కలు ఎక్కడో తప్పినట్లు కనిపిస్తోందన్న జస్టిస్‌, సమస్యలు రాకపోయి ఉంటే ప్రజలకు చాలా ఉపయోగపడేవని పేర్కొన్నారు. లోపం ఎక్కడుంది, ఏం జరిగిందన్న విషయమై తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఎవరి ప్రమేయం అయినా ఉందా అని కూడా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు జస్టిస్‌ ఘోష్‌ తెలిపారు. నిర్మాణ సంస్థల ప్రతినిధులను కూడా విచారణకు పిలుస్తామని అన్నారు.ఈ విచారణలో భాగంగా డ్యాం సేఫ్టీ చట్టానికి లోబడి తీసుకున్న చర్యలు, సూచనలను మిగతా 2లో..








# ఏపీ సీఎంగా చంద్రబాబు

**నేడు ప్రమాణస్వీకారం • హాజరుకానున్న ప్రధాని మోదీ**

**పలువు ఎన్‌డీయే పాలిత రాష్ట్రాల సీఎంల రాక**

**విజయవాడ(జనంసాక్షి):** ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయడానికి రంగం సిద్ధం అయ్యింది. దీనికి సంబంధించిన ప్రక్రియ కూడా పూర్తయింది. ఆంధ్రప్రదేశ్‌ గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్‌తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మంగళవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నారా చంద్రబాబు నాయుడును గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్‌ ఆహ్వానించారు. ఆ క్రమంలో తనకు మద్దతు ఇచ్చిన 163 మంది ఎమ్మెల్యేల జాబితాను ఈ సందర్భంగా గవర్నర్‌కు చంద్రబాబు అందజేశారు. భేటీ అనంతరం రాజ్‌భవన్‌ నుంచి ఉండవల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు. అంతకుముందు మిగతా 2లో..

## అమ్మ ఆదర్శ పాఠశాలలతో
# ఉత్తమ విద్య

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

**నేటినుంచి స్కూళ్ల ప్రారంభం**



**భద్రాద్రి కొత్తగూడెం(జనంసాక్షి):** పేద పిల్లలకు మంచి విద్య అందించే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలలు పనిచేస్తాయని సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి తెలిపారు. జూన్‌ 12న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు ఆయన పాఠశాలల పునఃప్రారంభం సహా పలు అంశాలపై కొత్తగూడెం ఐడీఓసీ కాన్ఫరెన్స్‌ హాల్లో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌ రెడ్డి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం విద్యతోపాటు ఇంగ్లీష్‌ మీడియం కూడా అందిస్తున్నాం. కళాశాల విద్యకూ పెద్దపీట వేస్తున్నాం. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పాఠశాలకు మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైంది. రూ.39వేల కోట్లతో మిషన్‌ భగీరథ పథకం ప్రారంభించినా.. జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు నీటి సరఫరా అధ్వానంగా ఉంది. కాంగ్రెస్‌ ప్రభుత్వంలో మిషన్‌ భగీరథ పథకాన్ని పునరుద్ధరించి గిరిజన ప్రాంతాలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. ధరణిపై కమిటీ నివేదిక త్వరలో రానుంది, అందులోని ఇబ్బందికర అంశాలను తొలగించి, పెండింగ్‌లో ఉన్న 2.55లక్షల దరఖాస్తులు పరిష్కరిస్తాం. విత్తనాలు అందుబాటులో లేవని మిగతా 10లో..

# ఫోన్‌ట్యాపింగ్‌ కేసులో అభియోగపత్రం దాఖలు

**ఛార్జిషీట్‌లో నిందితులుగా ఆరుగురు**

**హైదరాబాద్‌(జనంసాక్షి):** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్‌ ట్యాపింగ్‌ కేసులో పోలీసులు ఛార్జిషీట్‌ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి మార్చి 10న ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేసిన పోలీసులు.. ఇప్పటి వరకు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును అరెస్టు చేశారు. ఛార్జిషీట్‌లో ఆరుగురిని నిందితులుగా పేర్కొన్నారు. మరో వైపు అడిషనల్‌ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న నాంపల్లి కోర్టులో బెయిల్‌ పిటిషన్‌ దాఖలు చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని, కేసులో సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్‌ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. ఛార్జిషీట్‌ దాఖలు చేసినప్పటికీ ఇంకా విచారించాల్సి ఉన్నందున నిందితులకు బెయిల్‌ మంజూరు చేయొద్దని పబ్లిక్‌ మిగతా 2లో..



# నేడు టెట్‌ ఫలితాలు

**హైదరాబాద్‌(జనంసాక్షి):** తెలంగాణలో టీచర్‌ ఎలిజిబిలిటీ టెస్ట్‌ ఫలితాలు జూన్‌ 12న బుధవారం విడుదల కానున్నాయి. టీచర్‌ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు టెట్‌ ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టెట్‌ రాసిన అభ్యర్థులు ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చు. రాష్ట్రంలో మే 20 నుంచి జూన 2 వరకు టెట్‌ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మొదటి సారిసగా ఆన్‌లైన్‌ విధానంలో పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 జిల్లా కేంద్రాల్లో టెట్‌ పరీక్షలు నిర్వహించారు. టెట్‌ పరీక్షకు సంబంధించిన మిగతా 2లో..

## బడ్జెట్‌పై తెలంగాణ ప్రభుత్వం
# ముమ్మర కసరత్తు




- **ఈసారి పూర్తిస్థాయిలో పద్దు**
- **ఈ దిశగా ఇప్పటికే అధికారులతో ఉపముఖ్యమంత్రి భట్టి సమీక్షలు**

**హైదరాబాద్‌(జనంసాక్షి):** లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గతంలో ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పూర్తి స్థాయిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. నాలుగు నెలల కాలానికి ఓటాన్‌ అకౌంట్‌కు అనుమతి తీసుకున్నందున జులై నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్‌కు ఉభయసభలు ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. మరో 45 రోజులు మాత్రమే గడువు ఉన్న తరుణంలో పూర్తి స్థాయి బడ్జెట్‌ రూపకల్పన చేసేలా కసరత్తును ఆర్థికశాఖ ప్రారంభించింది.ఆదాయ ఆర్జిత శాఖల మంత్రులు, అధికారులతో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఇప్పటికే సమావేశమై లక్ష్యాలు, పురోగతి, సమస్యలను సమీక్షించారు. అటు పూర్తి స్థాయి బడ్జెట్‌ రూపకల్పన ప్రక్రియలో భాగంగా ఆర్థికశాఖ అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలను కోరింది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి సంబంధించి ఆయా శాఖల పనితీరు సూచికల ఆధారంగా నిర్ధేశించిన లక్ష్యాల పూర్తి వివరాలను ఇవ్వాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది.2024-25 ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌లో ఆయా శాఖల పరిధిలోని పథకాల వ్యయ ప్రతిపాదనలను క్షుణ్ణంగా సమీక్షించాలని ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆయా పథకాల కొనసాగింపు అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని ఆర్థికశాఖ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య పథకాలకు బడ్జెట్‌ ప్రతిపాదనల్లో తగిన కేటాయింపులు చేయాలని తెలిపింది. ఇటీవల ప్రభుత్వ పరంగా చేసిన ముఖ్యమైన ప్రకటనలపై దృష్టి సారించాలని మిగతా 10లో..

# నీట్‌ పరీక్ష రద్దు కుదరదు



- దానికున్న ప్రతిష్టను దెబ్బతీయడమే అవుతుంది
- అక్రమాలపై పిటిషన్‌ను విచారించిన సుప్రీం
- విచారణను జూలై 8కి వాయిదా వేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్‌ యూజీ - 2024 పరీక్షలో అవతవకలు జరిగినట్లు గత కొన్ని రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్న క్రమంలోనే నీట్‌ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టు లో పిటిషన్‌ దాఖలైంది. దీనిపై జస్టిన్‌ విక్రమ్‌ నాథ్‌, జస్టిస్‌ అమనుల్లాతో కూడిన వెకేషన్‌ బెంచ్‌ మంగళవారం విచారణ జరిపింది. పరీక్షను రద్దు చేయడం అంత సులువు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇది మీరు అనుకున్నంత సులభం కాదు. అలా చేస్తే పరీక్షకు ఉన్న గౌరవం, పవిత్రత దెబ్బతింటాయి. అందువల్ల ఈ ఆరోపణలపై మాకు సమాధానాలు కావాలని ధర్మాసనం పేర్కొంది. దీనిపై స్పందన తెలియజేయాలని నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీకి నోటీసులు జారీ మిగతా 2లో..

# చైనాకు ధీటుగా భారత్‌..

**టిబెట్‌లో 30 ప్రాంతాలకు పేర్లు మార్చే యోచన ?**

**అరుణాచల్‌ పేర్ల మార్పుపై సీరియస్‌**


2లో

# ఎడ్‌సెట్‌ ఫలితాలు విడుదల

**96.90 శాతం మంది అర్హత**

**హైదరాబాద్‌(జనంసాక్షి):** తెలంగాణ ఎడ్‌సెట్‌ ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం ఫలితాలను ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ లింబాద్రి, మిగతా 2లో..



## గొర్రెల కుంభకోణంలో
**పశుసంవర్ధక ఎండీ రాంచందర్‌ నాయక్‌పై**
# ఏసీబీ వేటు

**కొనసాగుతున్న విచారణ • పరారీలో కాంట్రాక్టర్‌ మొహియొద్దీన్‌**

**హైదరాబాద్‌(జనంసాక్షి):** తెలంగాణలో గొర్రెల స్కామ్‌ దర్యాప్తులో ఏసీబీ అధికారులు దూకుడుపెంచారు. నిందితులను ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. రెండవరోజు మంగళవారం మాజీ పశు సంవర్ధక శాఖ ఎండీ రాంచందర్‌ నాయక్‌, ఓఎస్డీ కళ్యాణ్‌ లను విచారించారు..మొదటిరోజు సోమవారం కస్టడీ విచారణలో రామచందర్‌.. నోరు మెదపలేదు. అలాగే ఓఎస్డీ కళ్యాణ్‌ కూడా విచారణకు సహకరించలేదు. గొర్రెల స్కీము యూనిట్‌ కాస్ట్‌ పెంపు, దళారుల ప్రమేయంపై ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నారు. ఎవరి ప్రమేయంతో దళారి, భోగస్‌ కంపెనీతో గొర్రెలను రైతులకు కొనుగోలు చేసి ఇవ్వాలని ఆదేశించారన్న కోణంలో విచారణ కొనసాగుతోంది. రామచందర్‌, కళ్యాణ్‌లను ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారిస్తున్నారు. ఈరోజు కస్టడీ విచారణలో రాజకీయ నాయకుల పాత్ర, ఓఎస్డీ కళ్యాణ్‌ ఫైల్స్‌ తరలింపు, కాల్చివేత వీటన్నింటిపై ఏసీబీ ఆరా తీస్తోంది. కాగా జ్యుడిషియల్‌ రిమాండ్‌లో ఉన్న పశు సంవర్ధక శాఖ మాజీ ఎండీ మిగతా 2లో..

# చైనాకు ధీటుగా భారత్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అరుణాచల్ విషయంలో చికాకు పెడుతున్న చైనాకు గట్టి బుద్ధి చెప్పాలని భారత్ నిర్ణయించింది. ఈ మేరకు డ్రాగన్ కంట్రీ చైనాకు భారత్ గట్టి సమాధానం ఇస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ తమదే అని పదేపదే ప్రకటిస్తున్న చైనా, ఆ రాష్ట్రంలోని పలు ప్రాంతాల పేర్లను మార్చడం పరిపాటిగా మారింది. అయితే, దెబ్బకుదెబ్బగా భారత్ కూడా టిబెట్‌లోని 30 ప్రాంతాలకు పేర్లు మార్చాలని భావిస్తోంది. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేబినెట్ టిబెట్ ప్రాంతంలోని 30 ప్రాంతాలకు పేరు మార్చాలనే నిర్ణయానికి ఆమోదం తెలిపినట్లు సమాచారం. చైనా దూకుడుకు అడ్డుకట్ట వేయాలనే భారత్ ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత్ పెట్టాలనుకుంటున్న ఈ పేర్లు చారిత్రక పరిశోధన, టిబెట్ ప్రాంతానికి సంబంధించిన సంబంధాల ఆధారంగా భారత సైన్యం ద్వారా ప్రచురించబడుతుంది. వాస్తవ నియంత్రణ రేఖ(ఒంఅ) వెంట వారి మ్యాప్‌లలో అప్డేట్ చేస్తారు. చైనాలోని టిబెట్ అటానమస్ రీజియన్‌లోని మొత్తం 11 నివాస ప్రాంతాలు, 12 పర్వతాలు, 4 నదులు, ఒక సరస్సు, ఒక పర్వత మార్గము ఈ జాబితాలో ఉన్నాయి. చైనా గతంలో 2017 నుంచి అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు పేర్లు పెట్టింది. ఆ సమయంలో భారత్ తమ తీవ్ర నిరసన తెలిపింది. అరుణాచల్ భారత్‌లో అవిభాజ్యం భాగమని చెప్పింది. టిబెట్ ప్రాంతాన్ని చైనా బలవంతంగా ఆక్రమించిన తర్వాత, భారత్ ఈ భూభాగాన్ని చైనాలో అంతర్భాగం గా అంగీకరించింది. అయితే, ఇప్పుడు మోడీ ప్రభుత్వం మాత్రం చైనా పేర్లు మార్చే విధానంలో దూకుడుకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మే 5, 2020లో పాంగాంగ్‌త్సో సరస్సు, గాల్వాన్ ఘర్షణల తర్వాత ఇరు దేశాల మధ్య సరిహద్దులు ఉద్రిక్తంగా ఉన్నాయి. ఇరు పక్షాలు ఈ సైనిక ప్రతిష్టంభనను తగ్గించేందుకు 21 సార్లు చర్చించాయి. భారత్ టిబెట్‌లోని పలు ప్రాంతాలకు పేర్లు పెట్టడం ద్వారా ఆ ప్రాంతాలను ÷-లకెయిమ్ చేసే లక్ష్యాన్ని నొక్కిచెప్పనుంది. ఇటు భారత్ సరిహద్దుల్లో, అటు దక్షిణ చైనా సముద్రంలో చైనా దుందుడుకు వైఖరి తర్వాత భారత్ ఈ నిర్ణయం తీసుకోవాలని అనుకుంటోంది. దీని ద్వారా చైనాకు గట్టి సందేశం ఇవ్వాలని భావిస్తోంది. జూన్ 11న విదేశాంగ శాఖ మంత్రిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన ఎస్ జైశంకర్ చైనా మరియు పాకిస్థాన్‌లకు సంబంధించిన సమస్యలపై భారతదేశం యొక్క బలమైన వైఖరిని పునరుద్ఘాటించారు. సరిహద్దు సమస్యలు, సీమాంతర ఉగ్రవాదం రెండింటినీ భారత్ దృఢంగా పరిష్కరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# నీట్ పరీక్ష రద్దు కుదరదు

చేసింది. ఇక, ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల కౌన్సిలింగ్ ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా ఎన్‌టీఏ తమ సమాధానం తెలియజేయాలని కోర్టు ఆదేశించింది. ఈ ఏడాది మే 5వ తేదీన నీట్ యూజీ -2024 ప్రవేశ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. జూన్ 4న ఫలితాలను ప్రకటించారు. అయితే తొలుత జూన్ 14న ఫలితాలను వెల్లడిస్తామని చెప్పి.. అంతకంటే ముందే ఓట్ల లెక్కింపు జరుగుతుండగా విడుదల చేయడం వివాదానికి దారితీసింది. ఈ ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా మొదటి ర్యాంక్ రాగా, వారిలో ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం పలు అనుమానాలకు దారితీసింది. ఈ పరీక్షలో పేపర్ లీకేజీ జరిగిందని, ఫలితాల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ సహా పలు విపక్షాలు ధ్వజమెత్తాయి. దీంతో ఆరోపణలపై విచారణకు యూపీఎస్సీ మాజీ ఛైర్మన్ సారథ్యంలో నలుగురు సభ్యులతో కమిటీ వేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

# మలావీలో విషాదం

## విమాన ప్రమాదంలో ఉపాధ్యక్షుడు దుర్మరణం
## భార్య సహా..తొమ్మిదిమంది మృత్యువాత



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీ ఉపాధ్యక్షుడు సౌలోస్ చిలిమా (51) విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన భార్యతో సహా విమానంలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది కూడా ప్రాణాలు కోల్పోయారు. మలావీ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా కార్యాలయం మంగళవారం నాడు ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. ఒకరోజు జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. సంఘటన వివరాల ప్రకారం, మలావీ మాజీ అటార్నీ జనరల్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు చిలిమా సహా మరో తొమ్మిది మంది సైనిక విమానంలో ప్రయాణిస్తుండగా సోమవారం అదృశ్యమైంది. ప్రతికూల వాతావరణం కారణంగా ఉత్తర నగరమైన జుజులో విమానం ల్యాండ్ కావడంలో విఫలమైంది. దీంతో రాజధాని లిలాంగ్వేకి తిరిగి రావాలని సందేశం అందింది. కానీ విమానం తిరిగి రాకుండానే అదృశ్యం కావడంతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు పర్వత ప్రాంతంలో విమానం శకలాలను కనుగొన్నారు. ఒక్కరు కూడా ప్రాణాలతో బయటపడకపోవడంతో మలావీలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇది అత్యంత హృదయవిదాకరమైన సంఘటన అని, ఈ విషయం తెలియజేయడానికి విచారం వ్యక్తం చేస్తున్నానని చక్వేరా తెలిపారు. ఈ ఘటనలో ఉపాధ్యక్షుడు సౌలస్ షిలిమా సహా 10 మంది దుర్మరణం చెందినట్లు ఆ దేశాధ్యక్షుడు లాజరస్ చక్వేరా వెల్లడించారు. గల్లంతైన విమానం శకలాలను గుర్తించామని.. అందులో ఎవరూ ప్రాణాలతో లేరని తెలిపారు. మలావీ ఉపాధ్యక్షుడు, మరో తొమ్మిది మందిని తీసుకెళ్తున్న సైనిక విమానం జూన్ 10న అదృశ్యమైంది. రాజధాని లిలోంగ్వే నుంచి బయలుదేరిన ఆ విమానం 370 కిలోమీటర్ల దూరంలోని జుజు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి ఉంది. ప్రయాణ సమయం 45 నిమిషాలు. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా అక్కడ దిగవద్దని, తిరిగి లిలోంగ్వేకు వెళ్లిపోవాలని ఏటీసీ సూచించింది. ఈ క్రమంలోనే రాడార్‌తో విమానం సంబంధాలు తెగిపోయాయి. గల్లంతైన విమానం కోసం మలావీ సైన్యం భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ వందల మంది సైనికులు, పోలీసులు, అటవీ అధికారులతో ముమ్మరంగా గాలించింది. పొరుగు దేశాల హెలికాప్టర్లు, డ్రోన్లను రంగంలోకి దించింది. అంగోలా దేశ అంతరిక్ష కేంద్రం సహాయాన్ని కోరింది. అమెరికా, బ్రిటన్, నార్వే, ఇజ్రాయెల్ కూడా సహాయం అందించేందుకు ముందుకువచ్చాయని మలావీ ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలోనే కూలిపోయిన విమాన శకలాలను గుర్తించినట్లు తెలిపింది.

# సమాచార కమిషనర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రధాన, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 29లోపు దరఖాస్తులు పంపించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ సమాచార కమిషనర్ల నియామకానికి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. గతంలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని సీఎస్ శాంతికుమారి స్పష్టం చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు లెక్కతప్పింది



కూడా ఇంజినీర్ల ద్వారా తీసుకుంది. ఇదే సమయంలో ఆయా సందర్భంగా నిర్మాణ సంస్థ, నీటిపారుదలశాఖ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, పైఅధికారులతో సంప్రదింపులు, వారి ఆదేశాల అమలు సహా సంబంధించిన అంశాలపై కూడా కమిషన్ ఇంజినీర్లను ప్రశ్నించింది. సమస్యలు తలెత్తినప్పటికీ మరమ్మత్తులు ఎందుకు చేయలేదని, అందుకు గల కారణాలపై కూడా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో ఇంజినీర్లను ఆరా తీసింది. మేడిగడ్డ ఆనకట్టకు సంబంధించి విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు నుంచి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వివరాలు సేకరించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారణ జరుపుతున్న కమిషన్ ఇవాళ నల్లా వెంకటేశ్వర్లును పిలిపించింది. ఆనకట్టల నిర్మాణ సమయంలో బాధ్యతలు నిర్వర్తించిన ఆయన నుంచి అవసరమైన సమాచారాన్ని తీసుకొంది. ఆనకట్టకు ఎంపిక చేసిన స్థలం, చేసిన పరీక్షలు, డిజైన్లు, నమూనాలు, మార్పులు - చేర్పులు, నాణ్యత, నీటి నిల్వ, నిర్వహణకు సంబంధించిన అంశాల గురించి ఆరా తీసినట్లు సమాచారం. కేవలం బ్యారేజీగా ఉపయోగించేందుకు వీలుగా నిర్మించి ఆ తర్వాత నీటిని ఎందుకు నిల్వ చేయాల్సి వచ్చిందని ప్రశ్నించినట్లు తెలిసింది. 2019లోనే సీసీ బ్లాకులు దెబ్బతినడం సహా ఇతర సమస్యలు వచ్చినప్పటికీ ఎందుకు మరమ్మతులు చేయలేదని అడిగినట్లు సమాచారం. పియర్స్ కుంగడానికి కారణాలు ఏమై ఉండవచ్చని ఆరా తీసినట్లు తెలిసింది. అన్ని అంశాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని నల్లా వెంకటేశ్వర్లును కమిషన్ ఆదేశించినట్లు సమాచారం. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై కాళేశ్వరంపై న్యాయవిచారణ చేపట్టిన ఘోస్ కమిషన్ తన విచారణలో వేగం పెంచింది. మేడి గడ్డ బ్యారేజీలో కుంగిన ప్రాంతాన్ని ఇప్పటికే స్వయంగా పరిశీలించిన కమిషన్ సంబంధిత అధికారుల నుంచి వివరాలను సేకరించింది.

# నేడు టెట్ ఫలితాలు

ప్రాథమిక కీని జూన్ 3న అధికారులు విడుదల చేశారు. దానిపై అభ్యంతరాలు స్వీకరించి తుది ఆన్సర్ కీని రూపొందించింది. జూన్ 12న ÷నైల్ ఆన్సర్ కీతోపాటు ఫలితాలను వెల్లడించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి టెట్ పరీక్షలకు మొత్తం 2,86,381 దరఖాస్తు చేసుకోగా.. వారిలో పరీక్షలకు 2,36,487 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో పేపర్-1 పరీక్షకు మొత్తం 99,958 మంది దరఖాస్తు చేసుకోగా 86.03 శాతం మంది హాజరయ్యారు. అదేవిధంగా పేపర్-2 పరీక్షకు 1,86,423 మంది దరఖాస్తులు చేసుకోగా.. 82.58 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. డీఎస్సీ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉండటంతో ఉపాధ్యాయ ఉద్యోగార్థులు టెట్ పరీక్షకు ప్రాధాన్యమిస్తారు. అలాగే ప్రభుత్వ టీచర్ పోస్టుల నియామకాలకు నిర్వహించే టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) రాసేందుకు టెట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించాల్సి ఉంటుంది. కాబట్టి బీఎడ్, డీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థులు టెట్ పరీక్షలో మంచి స్కోర్ సాధించేందుకు పోటీపడుతుంటారు. టెట్ పరీక్షలకు సంబంధించి 150 మార్కులకు పేపర్-1, 150 మార్కులకు పేపర్-2 నిర్వహించారు. ఒక్కో పేపరులో 150 ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 5 విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగంలో 30 ప్రశ్నలు- 30 మార్కులు కేటాయించారు. ఇక పేపర్-1లో 4 విభాగాలు ఉంటాయి. వీటిలో మొదటి మూడు విభాగాల్లో 30 ప్రశ్నలు- 30 మార్కులు, నాలుగో విభాగానికి 60 ప్రశ్నలు - 60 మార్కులు కేటాయించారు. పరీక్షల్లో అర్హత మార్కులను 60 శాతం, బీసీలకు 50 శాతం, ఎస్సీ-ఎస్టీ-దివ్యాంగులకు 40 శాతంగా నిర్ణయించారు. మరోవైపు టెట్ ఫలితాలను వెల్లడించనుండగా.. తెలం గాణలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ-2024 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మార్చి 4న ప్రారంభంకాగా... డీఎస్సీకి ముందు టెట్ నిర్వహణ తప్పనిసరి అని కోర్టు ఆదేశించడంతో ఏప్రిల్ 2తో ముగియాల్సిన గడువును జూన్ 20 వరకు పొడిగించారు. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జులై 17 నుంచి 31 వరకు టీఎస్ డీఎస్సీ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. అయితే డీఎస్సీకి కూడా ఇప్పటి వరకూ పెద్దగా దరఖాస్తులు రాలేదు. పోస్టులు పెరిగినా కొత్తగా వచ్చిన దరఖాస్తులు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. దీనికి కొత్తగా 37,700 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గతేడాది 5,089 పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ కోసం 1.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. దీంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 2.14 లక్షల మంది వరకు దరఖాస్తులు సమర్పించారు.

# గొర్రెల కుంభ కోణంలో పంశ సంవర్ధక ఎండీ రాంచందర్ నాయక్ ఏసీబీ వేటు

రామ్ చందర్ నాయక్.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ ఓఎస్డీ కళ్యాణ్ కుమార్‌లను మూడు రోజులపాటు ఏసీబీ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో సోమవారం వారిని కస్టడీలోకి తీసుకుని అధికారులు విచారించారు. కాగా గొర్రెల స్కామ్‌లో ఇప్పటికే 10 మందిని నిందితులుగా గుర్తించి పలువురిని అరెస్ట్ చేశారు. గొర్రెల స్కామ్‌లో మొదట రూ. 2.10 కోట్లు దారి మళ్ళినట్టు గుర్తించారు. పశు సంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రామ్ చందర్ నాయక్ , ఓఎస్డీ కళ్యాణ్ అరెస్ట్‌తో రూ.700 కోట్ల స్కామ్ జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. దీనికి సంబంధించి కీలక ఆధారాలు సేకరించింది. కస్టడీ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ మోహినొద్దిన్ పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# ఫోన్‌ట్యాపింగ్ కేసులో అభియోగపత్రం దాఖలు

ప్రాసిక్యూటర్ (పీపీ) కోర్టును కోరారు. బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తి కావడంతో బుధవారం తీర్పు వెల్లడించనున్నట్టు నాంపల్లి కోర్టు స్పష్టం చేసింది.

# విద్యుత్‌శాఖ కుంభకోణంలో కేసీఆర్‌తో సహా 25 మందికి నోటీసులు

భారీగా ఆర్థిక భారం పడిందని కమిషన్ అభిప్రాయపడింది. ఈ ఒప్పంద సమయంలో అసలు ఆ విద్యుత్ సంస్థ నిర్మాణమే జరగలేదని తమ దృష్టికి వచ్చిందని జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి స్పష్టం చేశారు. సాధారణంగా రెండు రాష్ట్రాలు విద్యుత్ ఒప్పందం చేసుకున్నప్పుడు కేంద్ర రెగ్యులేటరీ కమిషన్‌కు అధికారం ఉంటుంది. కానీ, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్ల అంశంలో రెండు రాష్ట్రాలు ఒప్పుకుని ఛత్తీస్‌గఢ్ రెగ్యులేటరీ కమిషన్‌కు పూర్తి అధికారాలు ఇచ్చారన్నారు. తద్వారా విద్యుత్ కొనుగోళ్ల కోసం అత్యధికంగా చెల్లింపులు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. టెండరు ప్రక్రియ ఎందుకు చేపట్టలేదు అని గత అధికారులను ప్రశ్నించగా, విద్యుత్ కొరత కారణంగా అత్యవసరంగా విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చిందని సమాధానం ఇచ్చా రన్నారు.

# ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

ఎంజీ వర్సిటీ ఇంఛార్జి విసి నవీన్ మిట్టల్ విడుదల చేశారు. మొత్తం 96.90 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. రెండేళ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం టీజీ ఎడ్‌సెట్ పరీక్షను మే 23న నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. మొత్తం 29, 463 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కాగా.. ఈసారి ఎడ్‌సెట్ పరీక్షలను నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించింది. రాష్ట్రంలోని బీఈడీ కాలేజీల్లో మొత్తం 14, 285 బీఈడీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ ఎడ్‌సెట్ హాల్‌టికెట్ నెంబరు, పుట్టినతేదీ వివరాలు నమోదుచేసి ర్యాంకు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షలో మొత్తం 96.90 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది ఎడ్‌సెట్ పరీక్షకు 27,495 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 26,994 అభ్యర్థులు (98.18శాతం ) ఉత్తీర్ణత సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మే 23న రెండు సెషన్లలో టీజీఎడ్‌సెట్-2024 పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 16,929 మందికి గానూ 14,633 మంది, రెండో సెషన్ 16,950 మందికి గానూ 14,830 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 87శాతం హాజరు శాతం నమోదైంది.

# సింగరేణి ఉద్యోగార్థులకు తీపికబురు

## కారుణ్య నియామక గరిష్ఠ వయోపరిమితి 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంపు
## యాజమాన్యం నిర్ణయం

**హైదరాబాద్(జనంసాక్షి):**సింగరేణి కారుణ్య నియామక ఉద్యోగార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారసుల గరిష్ఠ వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని 2018 మార్చి 9 నుంచి అమలు చేయనున్నట్టు సింగరేణి వెల్లడించింది.

# జూన్ 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు

## సభ్యుల ప్రమాణం..కొత్త స్పీకర్ ఎంపిక

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరిన వేళ, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను కూడా నిర్వహించేందుకు కసరత్తు మొదలయ్యింది. ఈ క్రమంలో లోక్‌సభ కార్యకలాపాలు నిర్వహించేందుకు స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. అంతకంటే ముందుగా కొత్తగా ఎన్నికైన ఎంపీలు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉంది. వీటికోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జూన్ 24 నుంచి జులై 3 వరకు వీటిని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. జూన్ 24-25 తేదీల్లో ఎంపీల ప్రమాణ స్వీకారం, జూన్ 26న స్పీకర్ ఎన్నిక ఉండొచ్చని సమాచారం. ఈ సమయంలో స్పీకర్ పదవి ఎవరికి దక్కొచ్చనే అంశం ఆసక్తిగా మారింది. మోదీ 3.0 ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా ఉన్న తెదేపా, జేడీయూ ఆ పదవిని ఆశించినట్లు వార్తలు వచ్చాయి. ఇండియా కూటమి పార్టీలు సైతం స్పీకర్ పోస్టుకు పట్టుబట్టాలని వీరిపై ఒత్తిడి తేవడం గమనార్హం. మరోపక్క, రాజస్థాన్ కోటా స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఓం బిర్లాకు మరోసారి అవకాశం ఇవ్వొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ భాజపా అధ్యక్షురాలు పురందేశ్వరి పేరు కూడా ప్రచారంలో ఉంది.

# ఒడిషా సిఎంగా మోహన్ చరణ్ మాఝీ ఎంపిక

**భువనేశ్వర్(జనంసాక్షి):**ఒడిశా కొత్త ముఖ్యమంత్రిగా గిరిజన నేత మోహన్ చరణ్ మాఝీ ఎంపికయ్యారు. డిప్యూటీ సీఎంలుగా కేవీ సింగ్ డియో, ప్రవతి పరిదాలకు అవకాశం లభించింది. మాఝీని బీజేపీ శాసనసభా పక్ష నేతగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. మోహన్ మాఝీ కియోంజర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. వీరు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ , బీజేపీ అగ్రనేతలు, పార్టీ ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 147 స్థానాలకు గాను 78 సీట్లు గెలుచుకుని తొలిసారిగా రాష్ట్రంలో బీజేపీ సొంతంగా అధికారంలోకి వచ్చింది.

# ఏపీ సీఎంగా చంద్రబాబు

కూటమి నేతలు అచ్చన్నాయుడు, నాదెండ్ల మనోహన్, పురందేశ్వరిలు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలసి చంద్రబాబును నాయుకుడిగా ఎన్నికున్నట్లు లేఖ అందించారు. ఆయనను సిఎంగా ఆహ్వానించాలని కోరారు. దీంతో చంద్రబాబు ప్రమాణానికి లైన్ క్లియర్ అయ్యింది. రాజ్‌భవన్‌లో ఆంధప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎన్డీయే కూటమి నేతలు కలిశారు. టీడీపీ తరపున అచ్చెన్నాయుడు, బిజెపి నుంచి పురంధేశ్వరి, జనసేన నుంచి నాదెండ్ల మనోహర్ గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. సభా నాయకుడిగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ చేసిన తీర్మానాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేశారు. 164 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు ఎన్డీయే కూటమి నేతలు లేఖ ఇచ్చారు. ఈ తీర్మానాన్ని పరిశీలించిన గవర్నర్.. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కూటమి నేతలను ఆహ్వానించారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కూటమి నేతలు మీడియాతో మాట్లాడారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటు అంశాలను వివరించామని తెలిపారు. శాసనసభా పక్ష నేతగా చంద్రబాబును మూడు పార్టీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఆ వివరాలను గవర్నర్‌ను కలిసి అందజేశామని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు చంద్రబాబును ఆహ్వానించాలని కోరామన్నారు. సాయంత్రం గవర్నర్ కార్యాలయం నుంచి రాజ్యాంగపరంగా పిలుపు వస్తుందన్నారు. బుధవారం నాడు చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. జనసేన పీఏసీ ఛైర్మ్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. ఈ విజయం ప్రజల విజయంగా భావిస్తున్నామన్నారు. గవర్నర్‌కు కూటమి తరఫున కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని కోరామన్నారు. ఇది రాజ్యాంగ పరమైన పక్రియ అని.. గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకు చంద్రబాబును ఆహ్వానిస్తారని నాదెండ్ల చెప్పారు. ఆంధప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమం, సుపారిపాలన కూటమితోనే సాధ్యం అని చెప్పారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలో చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తవగా.. చిన్న చిన్న పనులను సైతం పూర్తి చేస్తున్నారు. బుధవారం ఉదయం 11.27 గంటలకు నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, సినీ ప్రముఖులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నాయి. గన్నవరం ఎయిర్‌పోర్ట్ సమీపంలో చంద్రబాబు నాయుడు ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ఆయన చేత గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటు చేయాలంటూ టీడీపీ అధినేత చంద్రబాబును ఏపీ గవర్నర్ కోరారు. ఉదయం విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో కూటమి ఎమ్మెల్యేలంతా చంద్రబాబును పార్టీ నేతగా ఎన్నుకున్నారు. ఇక కూటమిలోని జనసేన. బీజేపీ ఎమ్మెల్యేలకు కీలక మంత్రి పదవులు దక్కే అవకాశాలున్నట్లు ఓ చర్చ సైతం సాగుతుంది. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో బుధవారం విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. విజయవాడ నగరం నుంచి గన్నవరం వెళ్లే వాహనాలను పోలీసులు మళ్లించనున్నారు. విజయవాడ రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి వెళ్లే వాహనాలతో పాటు.. అంబులెన్స్, అత్యవసర ఆరోగ్య చికిత్స వాహనాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. అలాగే గన్నవరం వెళ్ళే ఇతర వాహనాలు అన్నిటినీ నిలిపి వేయనున్నారు. కేవలం పాసులు ఉన్న వారికే అనుమతి ఇవ్వనున్నారు. ఇక విజయవాడలో సాధారణ వాహనలు కూడా మళ్లించనున్నారు. విజయవాడ నుంచి ఏలూరు, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలకు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బెంజ్ సర్కిల్ నుంచి కంకిపాడు-పామర్రు-హనుమాన్ జంక్షన్-ఏలూరు వైపు మళ్లిస్తారు. అలాగే.. వియవాడ వెలుపల ట్రాన్స్ పోర్టు వాహనాలను మళ్లించనున్నారు.

**నేటి చంద్రబాబు ప్రమాణానికి మోడీ రాక**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ పర్యటన ఖరారైంది. ఈనెల 12న కేసరపల్లి ఐటి పార్కు ప్రాంగణంలో జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరు కానున్నారు. 12వ తేదీ ఉదయం 8.20 గం.లకు ఢిల్లీ నుండి విమానంలో బయలుదేరి ఉ.10.40.గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. ఉదయం 10.55 గం.లకు అక్కడ నుంచి ఐటి పార్కు ప్రాంగణానికి చేరుకుని ఉ.11 నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.40 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని 12.45 గం.లకు విమానంలో భువనేశ్వర్ బయల్దేరి వెళ్తారు. మోదీ పర్యటన నేపథ్యంలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. కాగా సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రధాని మోదీతో పాటు, హోం మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు.

# ముయిజ్జు అదే తీరు..

## ఇటు భారత్‌లో పర్యటన.. అటు ఒప్పందాలపై దర్యాప్తు

**ఢిల్లీ(జనంసాక్షి):** మహమ్మద్ ముయిజ్జు (మాల్దీవులకు అధ్యక్షుడిగా ఎన్నికైన దగ్గరి నుంచి మనదేశంతో దౌత్యపరమైన సంబంధాల్లో ఒడుదొడుకులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే కేంద్రంలో కొత్త సర్కార్ ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ఢిల్లీ వచ్చిన ఆయన మన నేతలతో కరచాలనాలు చేశారు. అభినందన సందేశాలు పంపారు. ఇక్కడ ఆయన పర్యటిస్తోన్న సమయంలో.. మాల్దీవుల పార్లమెంట్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. తమ గత ప్రభుత్వం భారత్ చేసుకున్న ఒప్పందాలను సమీక్షించే ఉద్దేశంతో తీసుకువచ్చారు. ఇది రెండు దేశాల సంబంధాలను మరింత దిగజార్చుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. హైడ్రోగ్రాఫిక్ సర్వే, ఉతురు థిలా ఫాల్హు డాక్‌యార్డ్ ప్రాజెక్ట్ నిర్మాణం, మానవతాసాయం - సహాయక చర్యల నిమిత్తం మాల్దీవుల సైన్యానికి ఇచ్చిన డార్నియర్ విమానం వంటి వాటి కోసం ఇరుదేశాల మధ్య గత ప్రభుత్వంలో కుదిరిన ఒప్పందాలను ఇప్పుడు పార్లమెంటరీ కమిటీ పరిశీలించనుంది. ఈ ఒప్పందాలు మాల్దీవుల సార్వభౌమత్వానికి ముప్పు కలిగిస్తాయని ఆరోపించడం గమనార్హం. మరోసారి విదేశాంగమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎస్. జై శంకర్‌ను దీనిపై పాత్రికేయులు ప్రశ్నించారు. "ముయిజ్జుతో నేను సమావేశమయ్యాను. ఆయన ప్రధాని మోదీతో కూడా భేటీ అయ్యారు. విదేశాంగ విధానంలో చర్చల ద్వారా ఈ అంశాలపై ముందుకు వెళ్లాలనుకుంటున్నాను" అని చెప్పారు. చైనా అనుకూలుడిగా పేరున్న ముయిజ్జు.. అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటినుంచి భారత్‌తో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తోన్న విషయం తెలిసిందే. ఇదివరకటి అధ్య క్షుల్లా భారత్‌లో కాకుండా.. తన తొలి పర్యటన తుర్కియే, ఆ తర్వాత చైనాలో జరి పారు. ఇంకోపక్క భారత్ బలగాలు మాల్దీవులను విడిచి వెళ్లిపోవాలని షరతు విధిం చారు. దేశంలో చేపడుతున్న పరిశ్రమలు, నిర్మాణ ప్రాజెక్టుల కోసం చైనా వైపు మొగ్గ చూపుతున్నారు.

**తెలంగాణ ప్రభుత్వము**
**ఎగ్జిక్యూటివ్ ఇంజీనీరువారి కార్యాలయము,మిషన్ భగీరథ ఇంట్రా, డివిజన్-భువనగిరి**

ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

**tender Notice No.03/T2/MB Division Bhongir/2023-24** **Dt:10.06.2024**

టెండరు నోటీసు నం.03/టీ2/ఎంబీ డివిజన్/భువనగిరి/2023-24, తేది:04.06.2024 పనిపేరు: (మొదటిపిలుపు)యాదాద్రి జిల్లాలోఅడ్డగూడూర్(మం),అడ్డగూడూర్(గ్రా॥)కు నీటి సరఫరా ఏర్పాటు చేయుట. అంచనా విలువ రూ.6లక్షలు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్‌లో టెండరు డాక్యుమెంట్లు లభించు తేది: 15.06.2024 నుండి 24.06.2024 సా॥ 3గం॥ల వరకు. టెండర్లు స్వీకరించు తేది:15.06.2024 నుండి 24.06.2024 సా॥ 3గం॥ల వరకు. టెండర్లు తెరచు తేది: 24.06.2024 సా॥ 4గం॥లకు. సంబంధిత అధికారి ఈఈ, ఎంపీ ఇంట్రా, డివిజన్-భువనగిరి,సెల్: ఈఈ: 9100120915.2)టెండరు నోటీసు నం.03/టీ2/ఎంబీ డివిజన్/భువనగిరి/2023-24, తేది:04.06.2024 (మొదటిపిలుపు) యాదాద్రి జిల్లా, అడ్డగూడూర్(మం),కోటమర్తి(గ్రా)కు నీటిసరఫరా ఏర్పాటు చేయుట.అంచనా విలువ రూ.6లక్షలు.టెండరు నోటీసు నం.03/టీ2/ఎంబీ డివిజన్/భువనగిరి/2023-24, తేది:04.06.2024 (మొదటిపిలుపు) యాదాద్రి జిల్లా, మోత్కూర్(మం), దత్తప్పగూడెం(గ్రా)కు నీటిసరఫరా కల్పించుట. అంచనా విలువ రూ.6.50లక్షలు.మిగతా వివరాల కోసం **https://tender.telangana.gov.in** వెబ్‌సైట్‌నందు చూడగలరు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, ఎంబీ(ఇంట్రా) డివిజన్, భువనగిరి**

DIPR No.35-DP/CL/ADVT/1/2024-25

**తెలంగాణ ప్రభుత్వము**
**పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్**

**E-procurement Short tender Notice NIT:1063 to 1071/2024-25** **Dt:10.06.2024**

పనుల సంఖ్య(09),పనులపేర్లు:ఎంపీలాడ్స్, సీడీపీ&ఎండబ్ల్యూడీ గ్రాంట్స్ 2022-23 కింద నిజామాబాద్ జిల్లా, బోధన్& నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ కాన్సిస్ట్యూషన్స్, మొత్తం ఈసీవీ రూ.83.25లక్షలు. దిగువ సంతకం దారుచే టెండర్లు ఆహ్వానించడమైనది.టెండరు దారులు టెండరు షెడ్యూళ్లను తేది: 12.06.2024 ఉ॥10.30 నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. మరియు చివరి ప్రచురణ తేదినుంచి 7 రోజులు. మిగతా వివరాలు ఆన్‌లైన్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా **www.tender.telangana.gov.in**

**సం/- జిల్లాపంచాయతీరాజ్ ఇంజినీరు, పీఐయూ, నిజామాబాద్**

DIPR No.27-DP/CL/ADVT/1/2024-25

# భారత ఆర్థిక పురోగాభివృద్ధిలో
# యువతదే కీలకపాత్ర

- గవర్నర్ సిపి రాధాకృష్ణన్
- ఘనంగా తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవం







సిద్దిపేట, జూన్ 11 (జనంసాక్షి) : భారత ఆర్థిక పురోగాభివృద్ధిలో యువతదే కీలక పాత్ర అని తెలంగాణ, జార్ఖండ్ గవర్నరు, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నరు సిపి రాధాకృష్ణన్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్‌కు పుష్కల అవకాశాలున్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యమవుతుందని, అందులో యువత ప్రముఖ పాత్ర పోషించాలని అన్నారు. భారత స్థూల జాతీయోత్పత్తికి 18% పైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకై ప్రభుత్వం సహజ, సేంద్రియ వ్యవసాయానికి మరింత మద్దతునిస్తుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఉద్యాన అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 70% పైగా గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమే అని, 82 శాతం పైగా చిన్న సన్నకారు రైతులే అని పేర్కొన్నారు. విద్యార్థులు విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వచ్చుకానీ వెనుక తిరిగొద్దని గవర్నర్ పిలుపునిచ్చారు. పెద్దగా ఆలోచించాలని వాటిని చేరుకునేందుకు ఆరంభం సైతం చేరువ అంతే పెద్దగా ఉండాలని అన్నారు. ప్రపంచంలో అబ్రహం లింకన్, నరేంద్ర మోడీ ప్రపంచంలో తనదైన ముద్ర వేశారని, పేదరికం ఆకలి బాధతో కొట్టుమిట్టాడుతున్న జనాలకు వాటి నుంచి విముక్తి కల్పించిన గొప్ప వ్యక్తి భారత ప్రధాని నరేంద్ర మోడీ అని గవర్నర్ పేర్కొన్నారు. చదువుతో సహా ప్రతి అంశంలో నాణ్యతను చూపించినట్టయితే విజయం తథ్యమని అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు. విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు రాజ్ భవన్ ఎప్పుడు సిద్ధంగానే ఉంటుందని ఈ సందర్భంగా గవర్నర్ తెలిపారు.

### విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానం

బీఎస్సీ హానర్స్ హార్టికల్చర్ లో అత్యధిక ఓజిపిఏ సాధించినందుకు గాను 2023 బ్యాచ్ కు చెందిన ఆర్. వరలక్ష్మి మూడు బంగారు పతకాలు అందుకున్నారు. బిఎస్సి హానర్స్ ఫారెస్ట్రీలో పిసిసిఎఫ్ గోల్డ్ మెడల్ కె. రవళి డీన్స్ గోల్డ్ మెడల్ కె. ప్రత్యూష అందుకున్నారు. ఎమ్మెస్సీ హార్టికల్చర్ లో అన్ని విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ఎస్కేఎల్ టిఎస్‌హెచ్ గోల్డ్ మెడల్, అలాగే విద్యార్థినిలలో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను, ఇంకా కూరగాయల విభాగంలో టాపర్గా నిలిచినందుకుగాను గాను ఎం.మాళవిక మూడు గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. పండ్ల శాస్త్ర విభాగంలో జీఎస్ దివ్య, పూల శాస్త్ర విభాగంలో పీ. విద్య శ్రీ, అలాగే ఔషధ, సుగంధ ద్రవ్య పంటల విభాగంలో పి.మహేశ్వరి గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.

### విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం

ఈ మూడో స్నాతకోత్సవంలో 156 మంది కి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మంది ఫారెస్ట్ పీజీ, అలాగే మరో ఆర్గుకి పీహెచ్డ్ డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.గీతాలక్ష్మి స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శ్రీమతి బి. నీరజ ప్రభాకర్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ భగవాన్, డీన్ డాక్టర్ ఎం. రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్, డిఎస్ఏ డాక్టర్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాసన్, ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి, బోర్డు మెంబర్ డాక్టర్ ఆర్కే మాథూర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులు బాగుపడాలంటే
# రాహుల్ గాంధీ ప్రధాని కావాలి



- మణిపూర్ నుండి బాంబే వరకు రాహుల్ గాంధీ యాత్రలో పాల్గొన్న షిరిడి ప్రాంతానికి చెందిన రైతు
- ఏఐసీసీ కార్యాలయంలో జగ్గారెడ్డికి ఎదురు పడ్డ రైతు..
- పూర్వపరాలు సేకరించిన జగ్గారెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 11 (జనంసాక్షి): ఏఐసీసీ కార్యాలయానికి వెళ్లిన జగ్గారెడ్డి కి ఒంటి నిండా కాంగ్రెస్ కండువాలు..చేతిలో కాంగ్రెస్ జెండా.. కాళ్లకు కనీసం చెప్పులు కూడా లేని.. మహారాష్ట్ర లోని షిరిడి ప్రాంతానికి చెందిన సదాశివాలేఖర్ కనిపించారు. అతని నుండి వివరాలు సేకరించారు. అతని పేరు సదశివాలేఖర్.. నాలుగున్నర ఎకరాల సాదాసీదా రైతు... కాంగ్రెస్ పార్టీకి వీరాభిమాని. రాహుల్ గాంధీ కోసం మణిపూర్ నుండి బాంబే వరకు రాహుల్ గాంధీ జోడో యాత్ర లో చెప్పులు లేకుండా పాల్గొన్నారు. ఇంత శ్రమ పడటం ఎందుకు అని జగ్గారెడ్డి అడగగా.... రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు ఇలాగే ఆయన వెంట తిరగాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే వ్యవసాయానికి మేలు జరుగుతుందని... రైతులకు మంచి రోజులు వస్తాయని స్పష్టం చేశారు. రైతులకు ఇప్పటి వరకు మేలు చేసింది కాంగ్రెస్ నని... రాహుల్ గాంధీ ప్రధాని అయితే రైతులతో పాటు అన్నీ వర్గాలకు అండగా ఉంటారని జగ్గారెడ్డికి వివరించారు.

# మిషన్ భగీరథ మంచినీటి నల్లాల సర్వేను
# అంగన్‌వాడీలకు అప్పగించడమా?

- ఈ నిర్ణయంపై రాష్ట్రప్రభుత్వం పునరాలోచించాలి
- తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ (ఏఐటియుసి) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టేకుమల్ల సమ్మయ్య



కరీంనగర్, జూన్ 11 (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లాలోని అంగన్వాడి టీచర్లకు గ్రామపంచాయతీలలో మిషన్ భగీరథ మంచినీళ్ల నల్లా కలెక్షన్ల సర్వే చేసి ప్రభుత్వ యాప్ ద్వారా రోజువారి డేటాను ప్రభుత్వానికి ఇవ్వాలని అంగన్వాడీ టీచర్లకు ఆదేశాలు జారీ చేసి వారితో సర్వేలు చేయించడం సరైనది కాదని వెంటనే ఈ నిర్ణయాన్ని వెనిక్కి తీసుకోవాలని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టేకుమల్ల సమ్మయ్య అధికారులను కోరారు. క్షేత్ర స్థాయిలో ఆచరణకు సాధ్యం కానీ సర్వేలను అంగన్వాడీల కు అప్పగించి వారిపై పని భారాన్ని మోపడం వల్ల ఉపయోగం ఉండదని ఎవరు చేసే పని వారే చేయాలని ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో చేయించాలన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి కొరకు బడిబాట,పూర్వ విద్య, ప్రీస్కూల్ కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మన జిల్లాలో కలెక్టర్ అంగన్వాడీ లను ఇతర పనుల సర్వేలు చేయించడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. మరోపక్క ఐసిడిఎస్ ద్వారా నిత్యం ప్రభుత్వం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యక్రమాలు చేపట్టి ప్రోత్సహించే విధంగా ఉండాలి తప్ప అంగన్వాడీ కేంద్రాలు కుంటుపడే విధంగా నిర్ణయాలు తీసుకోరాదని హితువు పలికారు. జూన్ 12వ తేదీ నుండి పాఠశాలలు ప్రారంభమవుతున్న క్రమంలో అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను చేర్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయకుండా అంగన్వాడీ టీచర్లతో మిషన్ భగీరథ నల్లాల సర్వే చేయించడం సరైనది కాదని ఆక్రోశం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు అంగన్వాడీ లను వెంటనే మిషన్ భగీరథ సర్వేలను చేసి కార్యక్రమాన్ని నిలిపి వేయాలని, అలాగే జిల్లాలో మిషన్ భగీరథ మంచినీటి నల్లాలు ఏ గ్రామంలో కూడా పైపులు పగిలిపోయినవి ఎక్కడ కూడా నల్లాల ద్వారా మంచినీరు రానినటువంటి పరిస్థితి ఉన్నదనే విషయం పై ముందుగా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం గ్రామీణ ప్రాంతాలలో మిషన్ భగీరథ నల్లాలు ఎన్ని గ్రామాలకు మంచినీళ్ల సౌకర్యం ఉన్నదా లేదా అని గ్రామ కార్యదర్శుల ద్వారా తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. అంగన్వాడీలటీచర్ల కు ఐసిడిఎస్ పనులను పక్కకు ఉంచి మిషన్ భగీరథ పనుల సర్వేలను పూర్తిగా నిలిపివేసి కేంద్రాలకు పిల్లలు వచ్చే విధంగా ప్రోత్సహించి ఐసిడిఎస్ పనులను మాత్రమే అప్పగించాలని సమ్మయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆరు నెలలైనా హామీలు అమలేదీ?

- తక్షణమే హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలి
- రుణమాఫీకి డేట్ ఇచ్చినట్లే మిగతా హామీలకు డేట్స్ ఇవ్వాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏలేటి మరో బహిరంగ లేఖ

హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) : సిఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి ఆరు నెలలైంది.... లోకసభ ఎన్నికల కోడ్ కూడా ముగిసింది ... ఇకనైనా సాకులు మాని, మీరు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రధాన హామీలను ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేస్తామని పిసిసి చీఫ్ గా రేంత్ రెడ్డి మాటిచ్చారని, ఇప్పుడు ఆ మాటను మరచిపోయారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సిఎంగా బాధ్యతలు చేపట్టిన 99 రోజులకు పార్లమెంటు ఎన్నికల షెడ్యూలు వెలువడడంతో ఎలక్షన్ కోడ్ కారణంగా హామీల అమలు సాధ్యపడడం లేదని మీరు చెప్పుకుంటూ ఇన్నాల్లు తప్పించుకున్నారు. ఇపుడు ఎన్నికల కోడ్ ముగిసింది. మీరు అధికారంలోకి వచ్చి కూడా ఆరు నెలలైంది. కానీ మీరు ఇచ్చిన 420 హామీల్లో ప్రధాన అంశాలు మాత్రం ఎప్పటి నుంచి అమలు చేస్తారనే స్పష్టత ఇవ్వకపోవడమంటే మీకు ఓట్లు వేసి, అధికారాన్ని అప్పగించిన ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. రైతులకు రెండు లక్షల రూపాయల వరకున్న పంటరుణాలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 9వ తేదీనే ఏక కాలంలో మాఫీ చేస్తామన్న మాటను నిలబెట్టుకోకుండా మాట తప్పి అన్నదాతలను మోసం చేశారు. దాంతో లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతోందని గ్రహించి ఎలక్షన్ కోడ్ ను ఉల్లంఘిస్తూ రుణ మాఫీ హామీ అమలును ఆగస్టు 15కు వాయిదా వేసి రైతన్నల నమ్మకాన్ని కోల్పోయారు. ఫలితంగా లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ భంగపడింది. 64 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ 8 ఎంపీ సీట్లు గెలిస్తే ... ఎనిమిది మంది ఎమ్మెల్యేలున్న బిజెపి కూడా 8 లోకసభ సీట్లను గెలుచుకుంది. అంటే ప్రజలు కాంగ్రెసును తిరస్కరించినట్లే కదా. లోకసభ ఎన్నికలు మీ ప్రభుత్వ వంద రోజుల పాలనకు రెఫరెండం అని మీరే ప్రకటించారు. అంటే ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మోసం చేస్తున్న మీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించినట్టే కదా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని నిలదీశారు. ప్రధానంగా రైతులతో పాటు వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువత, నిరుద్యోగుల వంటి పలు వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు జాడే కనిపించడం లేదని మహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్, చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్, కామారెడ్డి బీసీ డిక్లరేషన్లలో ఇచ్చిన హామీల మాటేంటి. వ్యవసాయం – రైతు సంక్షేమం, నీటిపారుదల, యువత – ఉపాధి కల్పన, విద్యారంగం, వైద్యరంగం, గృహ నిర్మాణం, రెవెన్యూ, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్– గ్రామీణాభివృద్ధి, పారిశ్రామిక రంగం, మహిళా శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ వర్గాల సంక్షేమం, కార్మిక వర్గ సంక్షేమాలపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలేనా ముఖ్యమంత్రి గారూ... ఈ వాగ్దానాలను ఎలా అమలు చేయాలనే అంశంపై సిఎంగా మీరు అధికారులతో కనీస కసరత్తు కూడా చేస్తున్నట్టు కనిపించడం లేదు. ఇది హామీల ఎగేవత ధోరణి కాదా అని ప్రశ్నించారు.

# పట్టుదలతో జయంత్

- తండ్రి ఆశయాన్ని నెరవేర్చిన పల్లెటూరు అబ్బాయి పల్లె జయంత్
- జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 స్టేట్ 24 ర్యాంక్‌తో సంచలనం
- సృష్టించి అందరినీ ఆకట్టుకున్న విజయ గాథ



నాగర్‌కర్నూల్, జూన్ 11 (జనంసాక్షి) : ఆ విద్యార్థి సాధాసీదాగా సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుకున్నాడు. ఓ పెద్ద విషాదం ఆ కుటుంబాన్ని కుంగదీసింది. తన తండ్రి ఆక్సిడెంట్‌లో కుటుంబానికి దూరమయ్యాడు. అయినా ఆ విద్యార్థి వెరవలేదు. కసితో పుస్తకాన్ని పట్టాడు. బాధలు, బాధ్యతల నడుమ అబ్బాయి జేఈఈ అడ్వాన్స్‌డ్2024లో స్టేట్ 24వ ర్యాంక్‌తో సంచలనం సృష్టించాడు.

నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం కొండారెడ్డిపల్లిలో జయంత్ 2006 జూన్ 11న పల్లె కృష్ణయ్య-శ్రీలతలకు జన్మించాడు. కృష్ణయ్య సెర్ప్ డీఆర్‌డీఏ ఏపీఎంగా పని చేస్తున్నాడు. శ్రీలత అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. హ్యాపీగా సాగిపోతున్న ఈ కుటుంబంలో జయంత్ మంచి ప్రతిభ కనబరుస్తూ చదువు కొనసాగించాడు. అయితే 2023 మార్చి 10న డ్యూటీకి వెళ్తున్న తన తండ్రికి ఆమన్‌గల్ వద్ద కార్ ప్రమాదం జరిగింది. కోమాలోకి వెళ్లాడు. ఆ వెంటనే జయంత్‌కు 15వ తేదీ నుంచి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభమయ్యాయి. అంతటి బాధలోనూ పట్టు విడవలేదు. చదువుతోనే తన భవిష్యత్ అని భావించాడు. మొదటి సంవత్సరంలో 470 మార్కులకు 449 మార్కులు సాధించాడు. 14 నెలల పాటు కోమాలో ఉండి 2024, మే8న జయంత్ తండ్రి తుది శ్వాస విడిచారు. ఆ తండ్రి ఆశయాన్ని ఎవరు ఊహించని విధంగా జేఈఈ స్టేట్ 24 ర్యాంక్ సాధించాడు. ఎప్సెట్‌లోనూ మంచి ప్రతిభ కనబర్చాడు. చిన్న వయసులో భర్తకు శ్రీలత 14 నెలలు చిన్నపిల్లాడిలా అన్ని సేవలు చేసింది. అయినా దక్కలేదు. ఆ బాధను దగ్గరినుంచి చూసిన జయంత్ అమ్మను సంతోషపెట్టాలనుకున్నాడు. పట్టువదలకుండా చదివి జేఈఈ 24వ ర్యాంక్ సాధించాడు. అన్నయ్యే కాదు తానూ ఏం తక్కువ కాదన్నట్టు జయంత్ చెల్లె కూడా పదో తరగతిలో 9.5 జీపీఏ సాధించి అందరినీ అబ్బురపరిచింది.

ఈ రోజుల్లో సకల సౌకర్యాలు అందించినా కనీసం పాస్‌కాని విద్యార్థులను చూస్తుంటాం. బాధలో ఉండి పుట్టెడు కష్టాలను తోడుపెట్టుకుని చదివి ర్యాంకులు సాధించడం ఆశామాషీ విషయం కాదు. జయంత్ విద్యార్థిగా తాను సాధించిన విజయం పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.




# బీఆర్‌ఎస్‌లో పాడి కౌశిక్ 'ఐరన్ లెగ్'

- పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్




వరంగల్, జూన్ 11 (జనంసాక్షి) : బీఆర్ఎస్‌లో పాడి కౌశిక్ రెడ్డి ఐరెన్ లెగ్ అని పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుండి పార్టీలో పనిచేసిన కార్యకర్తలను పక్కన బెట్టి హుజురాబాద్‌లో టిక్కెట్ ఇస్తే చావుతప్పి కన్నులొట్టబోయినట్టు బొటాబొటి ఓట్లతో గెలిచిన పాడి కౌషిక్ రెడ్డి బీసీ బిడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్ గురించి నిరాధారమైన ఆరోపణలు చేయటం సిగ్గుచేటన్నారు. ఆత్మహత్య పేరుతో ఓట్లు తెచ్చుకున్న కౌషిక్ రెడ్డి భాషను సరి చేసుకోవాలన్నారు. తెలంగాణ అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే తెలంగాణ ఉన్న పార్టీలో కుటుంబ పాలనను వ్యతిరేకించినందుకు ఈటెల రాజేందర్‌పై గెలవడానికి ఐరన్ లెగ్గు పాడి కౌశిక్ లాంటి ఉద్యమ ద్రోహులను ప్రోత్సహించి, హుజురాబాద్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ పతనానికి బీజం వేసుకున్నారని, జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు సంపాదించి, రాష్ట్ర మంత్రిగా తెలంగాణ ప్రజల మన్ననలు పొందుతున్న పొన్నం ప్రభాకర్ ఎదుగుదలను ఓర్వలేక, అక్కసుతో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ విమర్శలకు దిగడం దిగజారుడుతనానికి పరాకాష్ట అన్నారు. ఇటువంటి ఐరన్ లెగ్ నాయకుల వల్ల ఇప్పటికే బీసీలకు దూరమై అధికారం కోల్పోయిన కేసీఆర్ స్థాపించిన పార్టీ ఎగ్జిట్ అయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మల్లేశ్వర్ జోస్యం చెప్పారు. గతంలో రాజకీయ పార్టీల్లో ఐరన్ లెగ్గుల ను ప్రోత్సహించిన ఆయా పార్టీలు భ్రష్టు పట్టి పోతాయనేదానికి ఆంధ్రప్రదేశ్ ఎన్నికలే ఉదాహరణ అంటూ అభిప్రాయపడ్డారు, 23 సంవత్సరాల అనుభవం గల బీఆర్ఎస్ పార్టీకి టైగర్లు ఎవరు? గోడమీద పిల్లులు ఎవరు? అనేది తెలియనంత కాలం అట్టడుగు వర్గాలు దూరమవడం ఖాయమన్నారు. ఇప్పటికే కేసీఆర్ కోటరీ కారణంగా తెలంగాణ సమాజం ఈసడించుకొని పార్లమెంట్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టిన విషయం గుర్తెరుగుతే మంచిదని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ హితబోధ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ చందా మల్లయ్య, పాస్ రాష్ట్ర నాయకులు బూర విద్యాసాగర్, మెరుగు బాబు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్ , జిల్లా ఉపాధ్యక్షులు వంగల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఇఇ పోస్టులకు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వాలి

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్

హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) : అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల భర్తీ పక్రియ ఎప్పుడో పూర్తయినా తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థులకు ఇంతవరకూ అపాయిం ట్మెంట్ లెటర్స్ ఇవ్వకపోవడం బాధాకర మని ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. గాంధీ భవన్ వద్ద మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఎఇఇ అభ్యర్థులకు ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఇఇ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి వివిధ దశల్లో భర్తీ పక్రియ పూర్తి చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్చి నెలలోనే అభ్యర్థుల డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తి చేసినా.. ఇప్పటికీ నియామక పత్రాలు ఇవ్వకపోవడంపై ఆయన మండిపడ్డారు. రాష్ట్ర మంత్రులు, అధికారులకు అభ్యర్థులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి ఏఇఇ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు.

# తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, జూన్11 (జనంసాక్షి) : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. శ్రీవారి దర్శనానికి 18 గంటల సమయం పడుతోందని టిటిడి అధికారులు తెలిపారు. బుధవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానుండటంతో రద్దీ ఒక్కసారిగా పెరిగిందని తెలిపారు. ఉచిత సర్వ దర్శనానికి 31 కంపార్ట్ మెంట్లలో యాత్రికులు ఉన్నారని.. మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన యాత్రికులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని తెలిపారు. కాగా నిన్న శ్రీవారి హుండీ ద్వారా రూ.3.70 కోట్ల ఆదాయం వచ్చినట్లు టిటిడి అధికారులు తెలిపారు.

# సమాచార కమిషనర్లకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి): ప్రధాన, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 29లోపు దరఖాస్తులు పంపించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ సమాచార కమిషనర్ల నియామకానికి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. గతంలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని సీఎస్ శాంతికుమారి స్పష్టం చేశారు.

# పోలీసు నిర్బంధాల నేతకు పోలీసు వందనం!



*పోలీసు దెబ్బలకు ఆయింట్మెంటుగా పొలిటికల్ సర్కిల్స్ లో ఓ సరదా నానుడి ఉంది. పోలీసు దెబ్బలు తిన్న లీడర్లకు ఆ దెబ్బలు వృథా పోవనీ, ఎంతో ఎత్తుకు ఎదిగేలా చేస్తాయనీ! (అలాగని ఎవరైనా వాంటెడ్లీ ఆసక్తి చూపేరు సుమీ!) ఆరు నెలల క్రితం వరకు పోలీసు నిర్బంధాల పాలైన బండి సంజయ్ కుమార్ పోలీసు అంతర్భాగమైన కేంద్ర హోం శాఖకే సహాయ మంత్రి అయ్యారు! అంటే పోలీసు మంత్రి అయ్యారన్నమాట. తెలంగాణలోనే కాదు, దేశంలో ఎక్కడికి వెళ్ళినా పోలీసుల గౌరవ వందనం ఇకపై అందుకోనున్నారు. ఇది అనివార్యమైన ప్రొటోకాల్. కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, హైదరాబాద్ వంటి చోట్ల సంజయ్ పోలీసులతో చేదు అనుభవాల పాలయ్యారు. ఐపీఎస్ స్థాయి వారు తోసి వేసిన లేదా చేయి చేసుకున్న సందర్భాలూ లేకపోలేదు.*

బీఆర్ఎస్ పాలనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ కార్యకలాపాలు, ప్రజా పోరాటాలకు సంజయ్ "బండి" కట్టేవారు. ఆయన ఫీల్డులోకి వచ్చినప్పుడు పోలీసులతో ఘర్షణ వాతావరణం ఉండేది. వాగ్వాదాలు, తోపులాటలు, ఉద్రిక్తతలు, అరెస్టులు రొటీన్ అనేంత పరిస్థితి ఉత్పన్నం అయ్యేది. తీవ్ర మనస్తాపంతో ఒక దశలో ఎంపీగా తన హక్కులకు భంగం కలిగిందని పార్లమెంటు సభా హక్కుల (ప్రివిలేజ్) కమిటీకి ఐపీఎస్ ర్యాంకు వారిపై ఫిర్యాదూ చేశారు. సంజయ్ కట్టడికి గత పాలకులు పోలీసులను ఉసిగొల్పేవారనే ముద్ర పడింది. వారితో వివాదాలు ఎంతెంత పెరుగుతుంటే.. రాష్ట్ర బీజేపీలో అగ్గిబరాటా(ఫైర్ బ్రాండ్)గా పేరొందిన ఈ కరీంనగర్ కాషాయ నాయకుడు జనంలో అంతంత ఫేమస్ అవుతుండె. తద్వారా తామే ప్రజల్లో బీజేపీకి, సంజయ్‌కి ఆదరణ పెంచుతున్నామనే సింపుల్ లాజిక్ ను నాటి ఏలికలు మిస్ అయ్యారు. భారత ప్రభుత్వంలో నెంబర్ టూగా వినుతికెక్కిన అమిత్ అనిల్ చంద్ర షా పట్ల వ్యక్తిగత అభిమానం, భక్తి, గౌరవంతో తన పాదరక్షలు తెచ్చిపెట్టినందుకు సంజయ్ ను తక్కువ చేసి వ్యాఖ్యానాలు గుప్పించారు. అదీ సంజయ్ ఫ్యాన్స్ నే కాదు, ఇతరులనూ బాధించింది. అదే సమయంలో తెలంగాణ సీఎం సీటులో ఏపీ మూలాల స్వామీజీని కూర్చోబెట్టిన సన్నివేశం సంగతేమిటని రివర్స్ శూలాలు సంధించారు. ఆత్మగౌరవం, ఆత్మాభిమానం వంటి బరువైన పదాలను వాటం తీరు వాడుకోవద్దనీ కౌంటరిచ్చారు. ఈ విధంగా సంజయ్ ప్రాబల్యం ఎగబాకుతున్న క్రమంలో రాష్ట్ర శాఖకు అదీ అసెంబ్లీ ఎన్నికల ముందు కొత్త ప్రెసిడెంటును నియమించడం ఆ పార్టీ శ్రేణులు సహా ప్రజలనూ నెర్వస్ చేసిందనే అభిప్రాయం వ్యాపించింది. నాణేనికి మరో వైపు అన్నట్టుగా బీజేపీ జాతీయ నాయకత్వం ప్రతిదీ కౌంట్ చేసిందనీ ఇపుడు విదితం అవుతోంది. అప్పట్లోనే సంజయ్ ని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, తాజాగా ఇప్పుడు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా నియమించి అన్నింటికీ సమాధానం ఇచ్చింది. ఏ అమిత్ షా విషయంలో అవహేళన చేశారో అదే హోం మంత్రి అమిత్ షా వద్ద సహాయ మంత్రిగా, ఏ పోలీసులైతే దురుసుగా ప్రవర్తించారో ఆ పోలీసులే సలాం చేసేలా సంజయ్ ని బీజేపీ భుజాన ఎత్తుకొంది. అలాగే ఏపీలో వైసీపీ సర్కారు పంథా, పంతంతో ఏ చంద్రబాబు నాయుడినైతే పోలీసులు లోపల వేశారో ఆ చంద్రబాబు నాయుడే ప్రభుత్వంలోకి వచ్చారు. ఏకంగా కేంద్రంలోనూ చక్రం తిప్పుతున్నారు. ఆ రాష్ట్రంలో ఎంపీగా ఉన్నప్పుడు రఘురామ కృష్ణంరాజును చిత్రహింసలు పెట్టిన చేతులే నేడు సెల్యూట్ చేయక తప్పని స్థితి. మన వద్ద 6 నెలల కిందటి దాకా ఏ రేవంత్ రెడ్డి మీద కేసీఆర్ ప్రభుత్వం పోలీసులతో జులుం చేయించిందో అదే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పోలీసు రెస్పెక్టును ఆస్వాదిస్తున్నారు. రాష్ట్ర సాధనోద్యమంలో తలమునకలైనపుడు కేసీఆర్ నూ సమైక్య పాలకుల పోలీసు బలగాలు నానా ఇబ్బంది పెట్టాయి. కరీంనగర్ అల్గునూర్ చౌరస్తాలో అరెస్టు చేసి, ఖమ్మం హాస్పిటల్ లో ఉంచినపుడు బూటు శబ్దాలతో గుండె ఆగాలనేంతలా పోలీసు ఉన్నతాధికారులు నాటి పరాయి పాలకుల మనసెరిగి ఊగిపోయారు. పోనీ, తానే సీఎంగా ప్రభుత్వంలోకి వచ్చాక తాను అనుభవించిన పోలీసు నిర్బంధాలను తెలంగాణలో జీరో చేయకపోగా, అంతకుమించి దండెత్తించారనే అపవాదు మూటగట్టుకున్నారు. రకరకాల మోటోలతో ఫోన్ ట్యాపింగ్ వంటి కొత్త ఎత్తులపై ఎంత కటువుగా మోజు పడ్డారో ఒక్కో కోణం ఆవిష్కరణల్లో దర్శిస్తున్నాం.

పాలకులు ఎవరైనా యూనివర్సల్ గా గమనంలో ఉంచుకోవాల్సినది ఏమంటే... పోలీసులను అవసరానికి మించి అంతే లేకుండా వినియోగించుకుంటే అంతే వేదన మిగిలేలా తమ ప్రభుత్వాలు పతనం అవుతాయనీ! అతిగా వ్యవహరించే పోలీసు అధికారులకూ కొత్త ప్రభుత్వాలతో, కొత్త ప్రజాప్రతినిధులతో తిప్పలు తప్పవనీ! ఇందుకు పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ సన్నివేశాలే తాజా తార్కాణం.



**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు, హైదరాబాద్
9440850384

# మంత్రి పదవులతో బీజేపీ వ్యూహం!

*తెలంగాణ లో బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది.పార్లమెంట్ ఎన్నికలలో ఎనిమిది ఎంపీ సీట్లను గెలుచుకున్న బీజేపీ ఇద్దరికీ మంత్రి పదవులు ఇచ్చింది. కిషన్ రెడ్డి కేంద్ర హోమ్ సహాయ మంత్రి గా గతంలో ఉండగా, ఇప్పుడు ఆ శాఖ ను కొత్తగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ని మంత్రి చేసి అప్ప జెప్పారు. మరో కీలక బొగ్గు శాఖ ను కిషన్ రెడ్డి కి ఇచ్చారు. కిషన్ రెడ్డి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుని గా కొనసాగుతున్నారు. ఈటెల రాజేందర్ కు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుని భాద్యతలు ఇస్తారని తెలుస్తున్నది. 72 మంది పీఎం మోడితో సహా మంత్రులు ప్రమాణం చేయగా, మరో తొమ్మిది మందిని మంత్రులుగా పెట్టుకునే అవకాశం ఉన్నది. బొగ్గు గనుల ప్రాంతం తెలంగాణ లో చాలా ముఖ్యమైన ప్రాంతం ఇక్కడ 12 దాకా అసెంబ్లీ, ఐదు పార్లమెంట్ స్థానాల మీద బొగ్గు గని కార్మికుల ప్రభావం ఉంటుంది.*





ఈ ప్రాంతంలో బీజేపీ వీక్ గా ఉన్నది. బిఎమ్మెఎస్ కూడ బలంగా లేదు. కాబట్టి కోల్ మినిస్టర్ అంటే కోల్ ఇండియా తో పాటు సింగరేణి లోనూ కకీలకంగానే ఉంటారు. అందుకే వ్యూహాత్మకంగా కిషన్ రెడ్డి ని నియమించారు. ఇక బండి సంజయ్ కు కేంద్ర మంత్రి పదవి ఇవ్వడం తో బీజేపీ లోని ఉత్తర తెలంగాణ శ్రేణుల్లో నూతన ఉత్తేజం కనిపిస్తుంది. సంజయ్ కి పక్కా నేల మీది క్యాడర్ లీడర్ గా పేరున్నది. బీజేపీ కి ఆయనకు పదవి ఒక వ్యూహమే అనక తప్పదు! చాలా కాలంగా తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు తహ తహ లాడుతున్నది. అయితే ఈ ఇద్దరు మంత్రులతో పార్టీ వ్యూహానికి తగ్గట్టు గా ఫలితాలు వస్తాయా?రావా? ఇప్పుడపుడే చెప్పలేని పరిస్థితి ఉన్నది,అంటే అతిషయోక్తి కాదు!

**కాంగ్రెస్ అలర్ట్ కావాలి!**

మొత్తానికి కాంగ్రెస్ పార్టీ, ముఖ్యం గా సీఎం రేవంత్ రెడ్డి అలర్ట్ గా ఉండాల్సిన పరిస్థితి ఉన్నది. ఒక వైపు ఆంధ్రప్రదేశ్ గెలిచిన ఉత్సాహంలో ఉన్న టీడీపీ, తెలంగాణ లో ఇంకా బతికే ఉన్నది. పవన్ కళ్యాణ్ జన సేన పార్టీ, ఈ రెండు ఒకవైపు తెలంగాణాలో కాళ్ళు, చేతులు ఆడించే పరిస్థితి చాలా స్పష్టంగా ఉన్నది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కు తెలంగాణ రాజకీయాలు కొత్తవి ఏమీ కావు! ఇప్పుడైతే ఆయన కేంద్రంలో చక్రం తిప్పుతున్నారు. బీజేపీ తో కలిసి తెలంగాణాలో పని చేస్తారా? విడిగానే చేసుకుపోతారా? అనేది తేలకున్నా, తెలంగాణ లో టిడిపి మళ్ళీ పుంజుకోడానికి చంద్రబాబు కృషి చేయడం మాత్రం మానరు! అలాగే బిఆర్ ఎస్ కూడ చేసిన తప్పులకు చెంపలు వేసుకుని కదిలి, విపక్ష పాత్రను మంచిగా పోషిస్తే తప్ప మనుగడ అసాధ్యం అనేది స్పష్టంగా కనిపిస్తున్నది!



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

**కిషన్ రెడ్డి పై నమ్మకం!**

మంత్రి కిషన్ రెడ్డి మీద చాలా మందికి నమ్మకం పుట్టే పరిస్థితి ఉన్నది!తెలంగాణ కు గుండె కాయ అయిన సింగరేణి కి, నల్ల నేల ప్రాంతం కార్మిక కుటుంబాలకు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి గా కిషన్ రెడ్డి భాద్యతలు తీసుకోవడం తో ఆశలు చిగురిస్తున్నాయి.అసెంబ్లీ లో బీజేపీ పక్ష నేతగా, మంత్రి గా, ఎంపి గా కూడా కిషన్ రెడ్డి పలుమార్లు సింగరేణి ని సందర్శించారు. బొగ్గు బావుల్లో నేరుగా దిగి కార్మికుల సమస్యలు, సంస్థ అభివృద్ధి గురించి తెలుసుకునే వారు, తెలంగాణ ఉద్యమంలోనూ కిషన్ రెడ్డి కోల్ బెల్ట్ లో జరిగిన పలు సభలు, సమావేశాల్లో పాల్గొన్నారు. మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచార సభలకు వచ్చారు. బీజేపీ లో కేంద్ర మంత్రులు సామాన్య జనం ను అతి సామాన్యంగా కలుస్తూ ఉంటారు. మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ కూడా సింగరేణి ప్రాంతంలో జరిగిన ప్రైవేటీకరణ వ్యతిరేక, సింగరేణి బచావో, తెలంగాణ ఉద్యమ కార్యక్రమం లలోనూ పాల్గొన్న దాఖలాలు ఉన్నాయి. భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ నేత సింగరేణి కార్మికులతో కలిసి కూర్చుని ముచ్చటించారు, మాజీ సీఎం కెసిఆర్ కూడ వచ్చే వారు!కెసిఆర్ కూతురు కవిత కూడ వచ్చేవారు,మాజీ కేంద్ర మంత్రి కాకా గడ్డం వెంకట స్వామి,మాజీ ఎంపీ, ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట్ స్వామి లాంటి వాళ్ళు, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, టీజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, పౌరహక్కుల సంఘం నేత బాలగోపాల్, పురుషోత్తం, ప్రజా యుద్ధ నౌక గద్దరన్న, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావ్, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి,ప్రస్తుత సిపిఐ పక్ష నేత కూనం నేని సాంబశివరావ్ ఇలా ఎందరికో సింగరేణి తో అనుబంధం ఉన్నది.ప్రస్తుతం ఉన్న కేంద్ర మంత్రుల్లో అందరికన్నా ఎక్కువ కిషన్ రెడ్డి కి సింగరేణి మీద అవగాహన ఉంది. అసెంబ్లీ లోనూ చాలా సార్లు సింగరేణి కార్మికుల, సంస్థ సమస్యల మీద కిషన్ రెడ్డి స్పందించే వారు! సింగరేణి కార్మికులకు ఐటి రీఎంబర్స్మెంట్ ఇవ్వాలని, చాలా సార్లు ఆయన డిమాండ్ కూడ చేశారు. బొగ్గు సంస్థల్లో ఐటి మాఫీ కోసం చాలా కాలంగా కార్మిక సంఘాలు, కార్మికులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు.సింగరేణి కార్మికులకు,రాష్ట్ర అసెంబ్లీ లోనూ ఐటి మాఫీ చేయాలని తీర్మానం చేసి కేంద్రంకు పంపడం జరిగింది. కనీసం పెర్క్స్ ( అలవన్స్ ) ల మీద కోల్ ఇండియా మాదిరి ఐటి రీఎంబర్స్మెంట్ ఇవ్వాలి! సింగరేణి కి బొగ్గు బ్లాక్ లు! సింగరేణి కి ఇంకా భవిష్యత్తు ఉండాలంటే కొత్త బొగ్గు బ్లాకులు రావాలి!మరో 150 సంవత్సరాలు సంస్థ కొనసాగావిధంగా తెలంగాణాలో గోదావరి తీరంలో ఆంధ్రప్రదేశ్ లోని చింతల పూడి దాకా 10 వేల మిలయన్ టన్నుల బొగ్గు తీయాల్సి ఉన్నది. ఈ నిక్షేపాలను సింగరేణి స్వంత అన్వేషణ విభాగం గుర్తించి ఉంది. ఒక 60 దాకా బొగ్గు బ్లాకులు రెడీ గా ఉన్నాయి. అయితే మారిన కేంద్రం పాలసీ ప్రకారం ఫీజులు కట్టి, ప్రైవేట్ సంస్థల మాదిరి, ప్రభుత్వ రంగంలో ఉన్న సింగరేణి, కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థలు వేలంలో పాల్గొంటే తప్ప బ్లాకులు అలాట్ కావు!

**దాసరి తర్వాత కిషన్ రెడ్డి!**

కాబట్టి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, బొగ్గు సంస్థల భవిష్యత్తు కోసం బొగ్గు బ్లాక్ ల కేటాయింపు విషయంలో వెసలు బాటు ఇప్పించాలి! ప్రభుత్వ రంగంలో బొగ్గు సంస్థలు బతికి ఉంటేనే రేపు ఈ ప్రాంతంలో కొంత ఉపాధికి అవకాశాలు ఉంటాయి. ఆ దిశన ముందుగా మంత్రి కృషి చేయాలి!కోల్ ఇండియా లో ఇప్పటికే 30 శాతం షేర్ లు అమ్మేసారు. అటు కోల్ ఇండియా అయినా, ఇటు సింగరేణి అయినా ప్రతి ఏడాది కేంద్రానికి రెండు కలిపి పది వేల కోట్ల దాకా డివిడెంట్లు, పన్నులు, ఐటి ని, కోల్ సెస్ ను చెల్లించడం జరుగుతున్నది. అయితే దాదాపు 25 ఏండ్లుగా కేంద్రం ఒక్క పైసా బడ్జెట్ లో సింగరేణి కి కానీ, అటు కోల్ ఇండియా కు కానీ కేటాయించలేదు.గత ఇరవై ఏండ్లుగా సంస్థలు మంచి లాభాల్లో నడుస్తున్నాయి. సింగరేణి లో అయితే కార్మికులకు వాటా బోనస్ ను కూడ చెల్లిస్తున్నారు. బొగ్గు సంస్థలకు కేంద్రం బడ్జెట్ కేటాయించాలి.సపోర్ట్ ఇప్పించాలి.గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో దాసరి నారాయణరావ్ కూడ బొగ్గు శాఖ మంత్రి గా పని చేసిన దాఖలాలు ఉన్నాయి. బొగ్గు బ్లాక్ల కేటాయింపు స్కాం ఆరోపణలు రాగా, ఆయన మీద విచారణ కూడ జరిగింది. ప్రస్తుతం బొగ్గు శాఖ ను కిషన్ రెడ్డి చేపట్టారు!

# అభివృద్ధి చెందిన దేశాల్లోనూ బాలకార్మికులున్నారు!

*పేదరికం శాపంగా మారి చిన్నారుల భవితవ్యం అంధకారంగా మారడం. అత్యంత బాధాకరమైన విషయం. ఒక దేశం సుభిక్షంగా అన్ని రంగాలలో ప్రగతి సాధించినప్పుడే నిజమైన అభివృద్ధి. ప్రపంచంలోని చాలా దేశాలలో బాల కార్మిక వ్యవస్థ అనధికారికంగా కొనసాగుతున్న క్రమం అభం శుభం తెలియని చిన్నారులలో శాపంగా మారింది అని చెప్పవచ్చు. ఒక దేశం అభివృద్ధి చెందాలంటే అన్ని రకాలుగా సంక్షేమంతో కూడిన కార్యక్రమాలతో పాటుగా ఆర్థిక, రాజకీయ, విద్య, వైద్య విభాగాలలో ఒక సమానమైన కోణం ప్రధానమైనది. ముఖ్యంగా బాల కార్మికుల వ్యవస్థ అనేక అంశాలపై ఆధారపడి ఉంది ఒకవైపు పేదరికం వెంటాడే ప్రధాన సమస్యగా చెప్పవచ్చు. బాలకార్మిక వ్యవస్థ తీవ్రమైన మానవ హక్కుల సమస్య. బాల కార్మికుడు అన్న దానికి సార్వత్రికంగా ఆమోదించిన నిర్వచనం "బాల్యాన్ని నాశనం చేసే రీతిలో బాలుడు లేదా బాలిక పనిచేయడం" చిదులమవుతున్న పసి హృదయాలు, వెంటాడుతున్న ఆర్థిక సమస్యలు దీనికి ప్రధాన కారణం అని చెప్పవచ్చు..*



బాలల శారీరక, మానసిక అభివృద్ధికి ఆటంకమై వారికి కనీస అక్షరాస్యతను, వినోదాన్ని కూడా పొందే అవకాశాన్ని ఇవ్వని పనిని, స్థితిని బాలకార్మిక వ్యవస్థ అంటారు. పాఠశాలల్లో విద్య అభ్యసించే రోజులతో అక్షర జ్ఞానానికి నోచుకోకుండా భారమైన శ్రమకు బలైపోతున్న బాలల జీవితాలు మనం సాధించిన అభివృద్ధిని ప్రశ్నిస్తున్నాయి. ఇది అత్యంత బాధాకరమైన పరిస్థితి. ఒకరకంగా నాగరికతకే తలవంపుగా పరిణమించాయి. బాలకార్మిక వ్యవస్థ ఒక్క భారతదేశానికే పరిమితం కాలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం బాలకార్మికులు తారసపడక తప్పదు.

ప్రపంచ వ్యాప్తంగా 2000 నాటికి 246 మిలియన్ల మంది బాలకార్మికులు ఉంటే 2012 ముగిసేనాటికి 168 మిలియన్ల మంది ఉన్నారు. మొత్తం బాలబాలికల జనాభాలో 11 శాతం మంది బాలకార్మికులే. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అత్యధికంగా 77.7 మిలియన్ల మంది బాలకార్మికులున్నారు. సబ్ సహారన్ ఆఫ్రికాలో 59 మిలియన్లు, లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంతంలో 12.5 మిలియన్లు, ఉత్తర ఆఫ్రికా, మధ్య ప్రాచ్యంలో 9.2 మిలియన్ల మంది బాలకార్మికులు ఉన్నారు. ఇట్టి యొక్క బాల కార్మిక వ్యవస్థ పేద దేశాల్లో బాలకార్మికులుగా మారుతున్న సంఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. అయితే జనాభా పరంగా చూస్తే అత్యధిక శాతం అధిక జనాభా కలిగిన దేశాలలో గమనించవచ్చు. ఆసియా పసిఫిక్ దేశాలలో బాలకార్మికుల సంఖ్య భారీగా ఉంది. అయితే సబ్ సహారన్ ప్రాంతంలో బాలకార్మిక జాబితాలో చేరుతున్న సంఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సబ్ సహారన్ ఆఫ్రికాలో ప్రతీ ఐదుగురు బాలబాలికల్లో ఒకరి కంటే ఎక్కువ మంది బాలకార్మికులుగా ఉంటున్నారు.

ఆర్థిక మాంద్యం, సంక్షోభం వల్ల బాలకార్మికుల సంఖ్య భారీగా పెరుగుతుందని భావించారు. అయితే అందుకు విరుద్ధంగా బాలకార్మికుల సంఖ్య పతనమైంది. దీనికి కారణం బాలకార్మికులు అధికంగా ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఆర్థిక మాంద్యం. సంక్షోభం ప్రభావాలు స్వల్పంగా ఉండటం ఒక కారణమైతే , మాంద్యం సమయంలో బాలకార్మికులకు ఉపాధి లభించకపోవడం మరో కారణం. బాల కార్మిక వ్యవస్థ సత్ఫలితాలనిస్తున్న నిర్మూలన కార్యక్రమాలను ఒక కోవలో పరిశించినట్లయితే....బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా గత నాలుగేళ్లుగా పరిస్థితి చాలా మెరుగ్గా ఉందని గణాంక సహితంగా తెలిపింది. ప్రభుత్వాలు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం చేపట్టిన చర్యలు సరైన మార్గంలో పయనిస్తున్నాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ స్పష్టం చేసింది.

2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశం మొత్తం మీద 5 నుంచి 14 ఏళ్ల లోపు వయసులో ఉన్న 1.26 కోట్ల మంది బాలబాలికలు ఆర్థిక కార్యకలాపాల్లో (బాలకార్మికులుగా) ఉన్నారు. వీరిలో 12 లక్షల మంది ప్రమాదకర వృత్తుల్లో ఉన్నారు. 2004-05లో జాతీయ నమూనా సర్వే అంచనా ప్రకారం దేశంలో 89 లక్షల మంది బాలకార్మికులున్నారు. 2009-10 లో 5-14 ఏళ్ల వయసున్న బాలకార్మికుల సంఖ్య 49.84 లక్షలు. యూనిసెఫ్ ప్రకారం దాదాపు సగం మంది, ప్రణాళిక సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడిమానేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55 శాతం, షెడ్యూల్డ్ తెగల్లో 63 శాతం దాకా ఉందని అంచనా. బడి మానేసిన ప్రతి పిల్లవాడూ అనివార్యంగా బాలకార్మికుడిగానే జీవిస్తున్నాడని వివిధ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. అనధికారిక గణాంకాల ప్రకారం భారత్ లో 10 కోట్ల మంది బాలకార్మికులు ఉన్నారు. భారతదేశంలో మొత్తం బాలల జనాభాలో 14 శాత మంది వివిధ పనుల్లో చెమటోడ్చుతున్నారని అంచనా. మొత్తం కార్మికుల్లో 4 శాతం మంది బాలలేనని అంచనా. ప్రతీ పదిమంది బాలకార్మికుల్లో తొమ్మిది మంది వ్యవసాయ సంబంధిత పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు శారీరక హింసకు గురవుతున్నారు. దాదాపు యాభై శాతం మంది ఏదో ఒక రూపంలో భౌతికంగా వేధింపులకు బాధితులవుతున్నారు.

50 శాతం మంది వారమంతా ఎలాంటి విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు. అందులో కొంత మంది ఏదో ఒక రూపంలో లైంగిక వేధింపులకు గురవుతున్నారు. బాలకార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తారు. కాబట్టి వారికి హక్కులు, కనీస వసతులు కరువు అవుతున్నాయి. తేలిగ్గా మోసానికి గురవుతున్నారు. వారి కష్టానికి తగిన వేతనం లభించడంలేదు . శ్రమ దోపిడీకి గురవుతున్నారు. నిర్దిష్ట పనిగంటలు లేవు. సెలవులు, బోనస్, పెన్షన్, గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ లాంటి ఏ సామాజిక భద్రతా చర్యలు వర్తించవు. వేతనాలు అతితక్కువ. పని పరిస్థితులు భయంకరంగా ఉన్నాయి. సూరత్ లోని వజ్రాలు చెక్కుడు పరిశ్రమల్లో, శివకాశీలోని మందుగుండు తయారీ పరిశ్రమల్లోనూ, జైపూర్ లోని రాళ్ల చెక్కుడు పనిలోనూ, ఫిరోజాబాద్ అద్దాల పరిశ్రమల్లోనూ, మురాదాబాద్ లోని లోహ పరిశ్రమల్లోనూ, అలీఘర్ లోని తాళాల పరిశ్రమల్లోనూ, మీర్జాపూర్ తివాచీల తయారీలోనూ, మార్కాపూర్ లోని పలకల తయారీ పరిశ్రమలోనూ హీన మైన, హేయమైన వాతావరణంలో బాలకార్మికులు పనిచేస్తున్నారు. పరిశీలించి చూస్తే ఈ పరిశ్రమలన్నీ ప్రమాద భరిత పనులకు సంబంధించినవే. ఎంతో మంది పిల్లలు హోటళ్లలోనూ, దుకాణాలలోనూ, గృహాలలోనూ సేవకులుగా పనిచేస్తున్నారు. తివాచీ పరిశ్రమలో పనిచేసే బాలలు కంటి చూపును కోల్పోతున్నారు. శ్వాస కోస వ్యాధులతో బాధపడుతున్నారు. కాశ్మీరులోని తివాచీల పరిశ్రమలో పనిచేస్తున్న వారిలో 60 శాతం మంది క్షయ, ఆస్తమా వ్యాధులతో బాధపడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఫిరోజాబాద్ లోని గ్లాస్, గాజుల పరిశ్రమలో పనిచేసే పిల్లలు అస్తమా, బ్రాంకైటిస్, కంటి సంబంధించిన రోగాలకు గురవుతున్నారు. శివకాశీలో టపాకాయల పరిశ్రమలో పనిచేసే బాలలు రోగాలతో పాటు పేలుడు లాంటి ప్రమాదాలకు బలైపోతున్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే బాలలు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ యంత్రాలతో పనిచేసే వారు సరైన శిక్షణ, సరైన భద్రత లోపించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. బాల కార్మికులుగా చిన్నారులు మారడానికి కారణాలను పరిశీలించి నట్లయితే.... తల్లిదండ్రుల పేదరికం పిల్లలకు శాపంగా మారుతోంది. పేదరికం వల్ల పిల్లలు తమ మనుగడ కోసమే కాకుండా తమ కుటుంబ అవసరాల కోసం పనిచేయాల్సిన దుస్థితి. పిల్లలను అదనపు ఆదాయం తెచ్చేవారిగా పేద కుటుంబాలు భావిస్తున్నాయి. తల్లిదండ్రుల నిరక్షరాస్యత: ఎక్కువ మంది తల్లి తండ్రులు నిరక్ష్యరాస్యులు కావడంతో పిల్లల భవిషత్తు ప్రశార్ధకంగా మారుతోంది. ఆర్థిక పరిస్థితి, అవగాహన లోపం వల్ల ప్రాథమిక విద్యను కూడా అందించలేకపోతున్నారు.సాంఘిక ఆర్థిక స్థితిగతులు (కుటుంబ పరిమాణం, నిరుద్యోగిత మొదలైనవి.) బాలకార్మిక వ్యవస్థ వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహనా లోపం ప్రధానంగా చెప్పవచ్చు.

భారీ పారిశ్రామికీకరణ, పట్టణీకరణ ఒక కోవలో చెప్పాలంటే పల్లెల నుంచి పట్టణాలకు వలస: గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలు లేక పనికోసం వలసకు వెళ్లిన చోట పిల్లలను చదివించే పరిస్థితి ఉండదు. వారు కూడా బాలకార్మికులుగా మారుతున్నారు. ప్రస్తుత విద్యావిధానంపై పేద తల్లిదండ్రులకు విశ్వాసలోపం. బాల కార్మిక వ్యవస్థపై సమాజంలో తీవ్రమైన అవగాహన, వ్యతిరేకత లేకపోవడం. పిల్లలను పనిలో పెట్టుకోవడాన్ని సమాజం వ్యతిరేకించిన నాడే ఈ పరిస్థితి నుంచి బయటపడగలం. పేద కార్మికుల చిన్నారుల ముఖాలలో వెలుగులను చూడగలం.

(జూన్ 12న ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా...)



**డా. చిటికెన కిరణ్ కుమార్**
9490841284

# బాటసారి

మా... మార్గనిర్దేశకుడు, మా...
శ్రేయోభిలాషి,
ప్రపంచశాంతిని కాంక్షించే
శాంతికాముకుడు.
శాంతికోసం అశాంతినైన సృష్టించాలే,
భరించాలే అనే దూర దృష్టి కలవాడు.
సిద్ధాంతాలను ఇంకించుకున్న
కరుడుగట్టిన మార్క్సిస్టు.
మనం గమ్యంచేరాలంటే
మావో వేసిన ధారిఒక్కటే మార్గమని
నమ్మినవాడు.
ప్రజా ప్రేమికుడు.
ఒకనాడు మమ్మల్నీ
బద్రజీవులని
బద్రంగనే అన్నడు.
మా ఆచరణలో ఉన్న అవకతవకలను
చూసి,
బుద్ధిమాటలతో ఎప్పటి కప్పుడు
బుజ్జగించడమే కాదు,
గద్ధించడం అతనికి అలవాటు.
బుజ్జగించడానికి మరీ మేం
చిన్నపిల్లలం కాదు కదా!
లోకం పోకడ తెల్సినవాల్లుగా,
లోకానికి దారి చూపాలని అతని
నిర్దేశం.
అప్పుడప్పుడు మందలింపులుంటాయి.
ఆ మందలింపులతో మాలో మంటలు
రాజేయాలని,
అతని ఆరాటం.
వృద్ధాప్యం రా రా రమ్మని
పిలిచినా
దానిని పెడచెవినపెట్టి,
అలుపెరగనిబాటసారి లా
ప్రయాణంలోనే మమ్మల్ని కలుస్తూ –
కలవర పెడుతుంటాడు.
ఆ కలవరాలే మాలో
కల్లోలం లేపాలని
కళలు కంటాడు.
ఆ కల్లోలాలను చల్లార్చే ప్రకృతి
ప్రేమను
నూరి పోస్తాడు.
కపటమెరుగని కవిగా
ఉందొక అవతారం
కల్లబొల్లి కబుర్లుకాదు, కఠినసత్యాలను
కంటికింపుగా మనసుకొంపుగా
రాస్తుంటాడు.
మాయ మర్మాల
మాంత్రికుడు కాదు
మావో ఆలోచనల వారసుడు
మాకోసం తపిస్తుంటాడు.
పెద్దమనిషి గా
పెద్దమనసు చేసుకుని,
తిరుగుతూనే ఉంటాడు.
తను చదును చేసిన
వ్యవసాయ క్షేత్రాన్ని
తనివితీరా చూస్తూ –
కలుపురాకుండా
జగ్రతలుచెపుతుంటాడు.
వేపుగపెరిగిన పంటరా సులను
వెంట తిసుకపొదు, సమానంగా
పంచనీకి
సమాయాత్తమౌతాడు.
పంటలను
దొచుకునెటోల్లుంటరనీ,
కాపలా కాస్తుంటాడు.
చీడ పీడల మీద
చిందులేస్తుంటాడు
భద్రతలు చెపుతూ
బద్రమంటూ ఉంటాడు.
బద్ర జీవులుగా కాదు,
బుద్ధి జీవులుగా
ఈ భూమిని కాపడమంటాడు.
బద్రతలేని బద్రజీవి,
జర భద్రం అంటూ –
ప్రయాణంలో కలుస్తానని,
సెలవు తీసుకుంటాడు.
తిరుగు ప్రయాణం లో
కలుస్తాడని,
వేయికళ్ళతో
ఎదురుచూస్తూ ఉంటాం

**-వసంత**



# "బడి"కి వేళయింది

ఇక్కడే అక్షర బీజం
పురుడు పోసుకుని
జ్ఞాన సుధ పంచేది
ఓనమాల బుడతలు
అడుగులేసేది ఇక్కడే

గుణింతాల గువ్వలు
రెక్కల విప్పేది ఇక్కడే
అంకెల నెలవంకలు
సంకెల వేగుచుక్కలు
వెలుగులద్దేది ఇక్కడే

అచ్చుల విరిజల్లులు
హల్లుల హరివిల్లులు
తలుకులీనేది ఇక్కడే
పదాల పదనిసలు
వాక్యాల సరిగమలు

కచేరి చేసేవి ఇక్కడే
చిరుచిరు నగవులు
పాలబుగ్గల పాపలు
పరవశించేది ఇక్కడే
రేపటి భావి పౌరులు
పాఠం నేర్చేది ఇక్కడే
అందుకే బాలల్లారా
బడి గంట మోగింది
ఆడుతూ పాడుతూ
ఉరకలు వేస్తూ రండి

తల్లి ఒడిని తలపించే
చదువులమ్మ బడిలో
అక్షర యజ్ఞం చేయగా
అట్టహాసంగా రారండి

(జూన్ 12 నుంచి బడులు ప్రారంభం అవుతున్న సందర్భంగా..)

**కోడిగూటి తిరుపతి**
9573929493

## నేత-చేప

నీటి లోని చేప
ప్రాణాలు
సురక్షితం
ఒడ్డున పడ్డ చేప
ప్రాణాలు గాలిలో
నేత గెలుపు
ఓటములు
చేప బతుకు
తెరువులు

**రేడియమ్**
9291527757

## రచనలకు ఆహ్వానం

**సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణలపై రచనలకు, సాహిత్యం, కవిత్వం, పుస్తక సమీక్షలు రాసే కవులకు జనంసాక్షి ఆహ్వానం పలుకుతోంది. మీ రచనలను hyd-janamsakshi@gmail.com కు పంపగలరు. మీ రచనలు క్లుప్తంగా, సూటిగా పేజీమేకర్ ఫైల్‌లోగానీ, యూనికోడ్ ఫార్మేట్‌లోగానీ పంపించగలరు.**

# మ్యాన్ హోళ్లు తెరిస్తే కఠిన చర్యలు

- నిబంధనల ఉల్లంఘనలకు క్రిమినల్ కేసులు నమోదు
- జలమండలి పరిధిలోని మ్యాన్ హోళ్లకు సేఫ్టీ గ్రిల్స్
- అందుబాటులో ఎయిర్ టెక్ మిషన్లు, ఇతర వాహనాలు
- జీహెచ్ఎంసీ, పోలీసు శాఖల అధికారుల సమన్వయంతో పనులు






**హైదరాబాద్ జూన్ 11 (జనం సాక్షి)**

నగరంలోని రహదారులు, ఇతర ప్రాంతాల్లో ఉన్న మ్యాన్ హోళ్లు తెరిస్తే కఠిన చర్యలుంటాయని జలమండలి అధికారులు హెచ్చరించారు. వర్షాకాలం నేపథ్యంలో.. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ సూచనలు చేశారు. వర్షాకాల ప్రణాళికలో భాగంగా.. జలమండలి ఇప్పటికే అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. లోతైన మ్యాన్ హోళ్లతో పాటు 25 వేలకు పైగా మ్యాన్ హోళ్లపై ఇప్పటికే సేఫ్టీ గ్రిల్స్ బిగించారు. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్ తో సీల్ చేసి, రెడ్ పెయింట్ ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్ (ఎస్పీటీ) వాహనాలను రంగంలోకి దింపారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలు అందించారు. ఈ బృందాలకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్ తో కూడిన డీ వాటర్ మోటార్ ఉంటుంది. దీని సాయంతో వర్షపు నీటిని తొలగిస్తారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండి పనిచేస్తారు. అధికంగా నీరు నిలిచే ప్రాంతాలపై ఈ బృందాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయి. వీటితో పాటు ఎయిర్ టెక్ మిషన్లు సైతం అందుబాటులో ఉన్నాయి. మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలు (సిల్ట్)ని ఎప్పటికప్పుడు తొలగిస్తారు.

### సెక్షన్‌కు ఒక బృందం ఏర్పాటు

మ్యాన్ హోళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్ స్పెక్టర్ నేతృత్వంలో ఒక సీవరేజీ బృందం ఏర్పాటు చేశారు. వీరు ఉదయాన్నే క్షేత్ర స్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారు. చోకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తారు. ఎక్కడైనా మ్యాన్ హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా లేదా ఇతర సమస్యలు, ఫిర్యాదులుంటే జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. దగ్గర్లోని జలమండలి కార్యాలయాల్లో నేరుగా సంప్రదించవచ్చు.

### చట్టం ఏం చెబుతోంది?

ఎవరైనా పౌరులు, అనధికార వ్యక్తులు అధికారుల అనుమతి లేకుండా మ్యాన్ హోళ్లపై ఉన్న మూత తెరచినా, తొలగించినా–1989, సెక్షన్ 74 ప్రకారం నేరం. దీన్ని అతిక్రమించి, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. నిందితులకు జరిమానా విధించడంతో పాటు కొన్ని సార్లు జైలు శిక్ష కూడా వేసే అవకాశముంది.

### కార్మికులకు శిక్షణ

**పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది విధులు నిర్వర్తించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయాల్లో ఎలా పనిచేయాలనే విషయంపై వారికి జలమండలి ఏటా భద్రతా వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల్లో వారికి ఎస్వోపీ మార్గదర్శకాల ప్రకారం.. భద్రతా పరికరాల పనితీరు, ఉపయోగించే విధానం, పారిశుద్ధ్య పనుల్లో తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలపై శిక్షణ ఇస్తోంది. అంతే కాకుండా పని ప్రదేశాల్లో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు చేసే ప్రథమ చికిత్స పైనా అవగాహన కల్పిస్తుంది.**

### మాధ్యమాల్లో విస్తృత ప్రచారం

వర్షాకాలంలో సీవరేజి నిర్వహణలో సాధారణ పౌరులు ఎలా ప్రవర్తించాలి, ఎలా నడుచుకోవాలనే అంశాలపై జలమండలి విరివిగా ప్రచారం చేస్తుంది. స్థానిక కాలనీల సంఘాలు, ఎస్‌హెచ్ గ్రూపుల సభ్యులతో ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. అంతే కాకుండా చేయాల్సిన, చేయకూడని పనులపై దినపత్రికలు, టెలివిజన్, ట్విటర్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి సమాయత్తం అవుతోంది.

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



- తాండూర్ గ్రామ సర్వే నంబరు 111 ప్రభుత్వ భూమి
- కబ్జాకు గురైన భూమి స్వాధీనం-ప్రభుత్వ బోర్డు ఏర్పాటు
- ఆర్డీవో యం. శ్రీనివాసరావు

**తాండూరు జూన్ 11 (జనం సాక్షి)**

తాండూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని విజయ విద్యాలయ పాఠశాల పక్కన ఆక్రమణకు గురైన 17 గుంటల భూమి సర్వే నెంబరు 111కు చెందినది. సర్వే నెంబరు ప్రభుత్వ భూమి. (1954–55) ఖాస్రా పహాని నుండి ప్రస్తుత రెవెన్యూ రికార్డుల వరకు ఈ సర్వే నెంబరు ప్రభుత్వ భూమి గానే రెవెన్యూ రికార్డులలో గలదు. సర్వే నెంబర్ యొక్క మొత్తం విస్తీర్ణం 14 ఎకరాల14 గుంటలు. ప్రస్తుత ఆర్డీఓ కార్యాలయం కొంత భాగం, విజయ విద్యాలయ పాఠశాల , ఆక్రమణకు గురైన భూమి, ఆర్అండ్‌బి రోడ్డు, కొన్ని ఇండ్లు సర్వే నంబర్‌లో ఉన్నాయి. అయితే పసారం లలిత్ సందీప్ నిశాంక్ మరియు ఇతరులు కోర్టు యొక్క మధ్యంత ఉత్తర్వుల ప్రకారం ఇట్టి భూములు ఫెన్సింగ్ వేసి బోర్డు ఏర్పాటు చేయగా అట్టి బోర్డును నేడు తొలగించి ప్రభుత్వ బోర్డును భూమిలో ఏర్పాటు చేశారు. కోర్టు అంతిమ తీర్పు వెలువడిన అనంతరం తగు చర్య తీసుకోబడుతుందన్నారు. ఆదేశాలను అతిక్రమించి ఇట్టి భూమిలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టిన, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాండూరు తాసిల్దార్ తారా సింగ్ ,గిర్ధావర్ బాల్ రాజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.56.57 కోట్లతో నార్సింగి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు



**రాజేంద్రనగర్, జూన్ 11(జనం సాక్షి)**

నార్సింగి మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం మంగళవారం చైర్ పర్సన్ మైలారం నాగపూర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్ బాబుల అధ్యక్షతన జరిగింది. నార్సింగి మున్సిపాలిటీ అభివృద్ధి పనుల కోసం రూ.56.57 కోట్ల వ్యయంతో ఆమోదం తెలిపారు. జరగనున్న అభివృద్ధి పనులుగా సిసి రోడ్లు కై రూ.13.52 కోట్లు, డ్రైనేజీ పనులకు గాను రూ.8.45 కోట్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు రూ.22.12 కోట్లు, వైకుంఠధామం పనులకు 2.62 కోట్లు, వీధి దీపాల కొరకు రూ.2.55 కోట్లు, గ్రీనరీ పనులకు రూ.1 కోటి, బోర్ మెటీరియల్, పరిశుద్ధ కార్మికుల పనిముట్లు ఇతర పనులకు గాను రూ.6.31 కోట్లుగా ఆమోదించారు. ఈ సమావేశంలో కమిషనర్ టి. ప్రవీణ్ కుమార్ రెడ్డి డిఈ నరసింహ రాజు, మేనేజర్ యోగేష్, ఇరిగేషన్ డిఈ రామ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

**ఉద్యోగ భద్రత కల్పించాలి:సిఐటియూ డిమాండ్**

**తాండూరు జూన్ 11(జనం సాక్షి)**



పెద్దేముల్ మండల కేంద్రంలో సిఐటియు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. 7 నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల 7 నెలలు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని పెద్దేముల్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొస్తే కార్మికుల వేతనాలు పెంచుతామని కార్మికుల ఉద్యోగ భద్రత కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చి ఇంతవరకు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుంది అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలో అనేక గ్రామాలలో గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు కనీస వేతనం రూ. 26000 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు 7 నెల నుండి పెండింగ్ జీతలు పెట్టుకొని వారితోనే వెట్టిచాకిరి చేయించుకుంటూ కనీస వేతనం రూ. 26000 ఉద్యోగ భద్రత గుర్తింపు కార్డులు ప్రమాద బీమా సౌకర్యం అమలు చేయకుండా వేధింపులకు పాల్పడుతున్న పంచాయతీ సెక్రెటరీ స్పెషల్ ఆఫీసర్లపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 51 అడ్డుపెట్టుకొని గ్రామపంచాయతీ కార్మికులపై వేధింపులకు గురి చేస్తున్న ప్రతి సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ మండల అధ్యక్షులు అంబరప్ప, ఉపాధ్యక్షులు శ్రీను, ప్రధాన కార్యదర్శి రాములు, కోశాధికారి మల్లేశం ,కమిటీ సభ్యులు వెంకటమ్మ, బాలమణి ,రత్నం, ఎల్లప్ప, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధులు తక్షణమే విడుదల చేయాలి

**సిపిఐ రంగారెడ్డి జిల్లా జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్**

**చేవెళ్ల, జూన్ 11 (జనం సాక్షి)**




చేవెళ్ల మండల కేంద్రంలోని భూ పోరాట కేంద్రం సిపిఐ కాలనీ పేస్ 2 లో మండల సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి యండి మక్బూల్ అధ్యక్షతన చేవెళ్ల మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో రైతు భరోసా పథకం ప్రకారం ఎకరానికి పదిహేను వేల రూపాయలు నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఒకపక్క వర్షాలు ప్రారంభం అయినవి కాబట్టి రైతులు దుక్కులు తినటానికి విత్తనాలు ఎరువులు కొనుక్కోవడానికి రైతు భరోసా కింద నిధులు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు ఎరువులు నకిలీ లేకుండా నాణ్యతగా ఉండే విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచాలని అదేవిధంగా గతంలో పెండింగ్లో ఉన్న ఉపకార వేతనాలు ఫీజు రీయంబర్స్మెంట్ నిధులు కూడా విడుదల చేయాలని కోరారు. ఎన్నికల హామీలలో ఇచ్చినటువంటి అన్ని పథకాలను తొందరగా ప్రజలకు అందే విధంగా చూడాలని మండల కేంద్రంలోని 75వ సర్వే నెంబర్లు గత 16 నెలలుగా గుడిసెలు వేసుకుని భూ పోరాటం చేస్తున్న ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే రామస్వామి, జిల్లా ఏఐటియుసి కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, బికేఎంయు జిల్లా అధ్యక్షులు జే అంజయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల, లలిత, విజయమ్మ, లత, అనసూయ, జయమ్మ, మండల ఏఐటీయూసీ అధ్యక్షుడు శివ, యాదగిరి, శ్రీకాంత్, పెంటయ్య, ఎలీషా, ఒగ్గు సత్యనారాయణ ప్రజానాట్య మండలి కళాకారుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# మణికొండ మున్సిపాలిటీలో కారు బీభత్సం

**రాజేంద్రనగర్, జూన్12 (జనం సాక్షి)**

మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడ గోల్డెన్ టెంపుల్ వద్ద ఓ మైనర్ బాలుడి రాష్ డ్రైవింగ్ పలు ద్విచక్ర వాహనాలను డీ కొట్టాడు. నార్సింగ్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి తెలిపినవిరాల ప్రకారం పుప్పాలగూడకు చెందిన మైనర్ బాలుడు బెలినో కార్ నెంబర్ టీఎస్ 09 ఎఫ్ సి 8171తో రాష్‌గా డ్రైవ్ చేస్తూ ఒక మహిళను అతని కుమారుడిని ఢీకొట్టాడు. దీంతో భయపడి పోయి అక్కడి నుంచి తప్పించుకొనుటకు వేదంగా కారు నడపడంలో మరో ద్విచక్ర వాహనాలకు ఢీ కొట్టాడు. దీంతో వారికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భం ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన వారు ఐనా, మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి నడపడం నేరమని ఆ శిక్ష వాహనాల యజమానులకు కూడా వర్తిస్తుందని తెలిపారు.



# పెద్ద చెరువు దగ్గర జరుగుతున్న పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

వర్షాకాలంలో ప్రజలకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా తగు చర్యలు తీసుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అంతకుముందు పెద్ద చెరువు నుంచి విడుదలలై దిగువకు వెళ్ళే నీటి కోసం నిర్మాణం చేస్తున్న కెనాల్ పనులను మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ విజయ భాస్కర్ రెడ్డి మరియు మహబూబ్ నగర్ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. రానున్నది వర్షాకాలం కాబట్టి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎంతో విశాలంగా ఉన్న పెద్ద చెరువును చుట్టూ కొందరు ఆక్రమించి భవనాలు నిర్మించుకున్నారని వారికి మున్సిపల్ నుంచి నోటీసులు జారీ చేయాలని ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. చైతన్య పాఠశాల ప్రక్కన పెద్ద చెరువు కు ఆనుకొని కొందరు వ్యక్తులు భూ ఆక్రమణ చేస్తూ కనిపించారు వెంటనే ఎమ్మెల్యే అక్కడి వ్యక్తులను ప్రశ్నించగా సదరు వ్యక్తులు సరియైన సమాధానం ఇవ్వలేదు. సదరు వ్యక్తి ట్రాక్టర్, జెసిబి తీసుకొని అక్కడ నుంచి వెళ్లిపోయారు . ప్రభుత్వ భూములు ఆక్రమించుకొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కమీషనర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, బెజ్జుగం రాఘవేంధర్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూరు జూన్ 11(జనం సాక్షి)**

అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు నియోజకవర్గ పరిధిలోని పెద్దేముల్, తాండూరు మండలాలు మరియు తాండూరు పట్టణానికి చెందిన 237 మంది లబ్ధిదారులకు రూ. 2,37,27,492 విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంతో రాష్ట్రంలోని ఎంతో మంది పేద కుటుంబాల ఆడపిల్లల పెండ్లి ఖర్చు భారం తగ్గిందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పేదింటి ఆడబిడ్డ మేడలో బంగారం ఉండాలనే ఉద్దేశంతో మన ప్రభుత్వం త్వరలో తొలం బంగారం కూడా ఇస్తామని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలతోనే మెరుగైన విద్య

**ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**చిన్నంబావి జూన్ 11 (జనం సాక్షి)**



చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. పెద్దమారు ఉన్నత పాఠశాలకు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మైనర్ రిపేర్లకు, ఎలక్ట్రీషియన్ కు, కాంపౌండ్ వాల్, మరుగుదొడ్ల నిర్మాణానికి, 25 లక్షల రూపాయలను మంజూరు చేస్తానని అలాగే ప్రాథమిక పాఠశాలకు 15 లక్షల రూపాయలు మంజూరు చేస్తానని ఈ నిధులను త్వరగా పనులు ప్రారంభించి అన్ని సౌకర్యాలను పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సరైన ఉపాధ్యాయులు లేరని అవసరమైతే వాలంటీర్లుగా పిటి లని తీసుకొని పిల్లలకు క్రీడలను నేర్పించాలని అన్నారు. ఉదయం ఏడు గంటలకు విద్యార్థులను స్కూలుకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చూసుకోవాలి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీఈవో గోవిందరాజులు, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కళ్యాణ్ కుమార్, సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, డైరెక్టర్ విద్యాసాగర్ రావు, మాజీ సర్పంచ్ బీచుపల్లి యాదవ్, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మ తేజ, రాజ్ కుమార్, రంజిత్ కుమార్, వడ్డేమాన్ బిచ్చన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో సకల సదుపాయాలు కల్పించాలి

**జిల్లా బిసి సంక్షేమ అధికారి కృష్ణమాచారి**

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**



వసతి గృహాల్లో సకల సదుపాయాలు కల్పించాలని జిల్లా బిసి సంక్షేమ అధికారి కృష్ణమా చారి ఆదేశించారు. వసతి గృహాలు బుధవారం పునః ప్రారంభం అవితున్నందున మంగళవారం నారాయణపేట బిసి కళాశాల వసతి గృహంలో వసతి గృహ సంక్షేమ అధికారులకు, నాలుగవ తరగతి సిబ్బందికి వసతి గృహ నిర్వహణ పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి ప మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత, వసతి గృహ విద్యార్థులకు రుచికరమైన వంటకాలను తయారు చేసే విధానాలు తగు సూచనలు ఇచ్చారు నాలుగవ తరగతి సిబ్బంది విద్యార్థులకు ప్రతి రోజు 24 గంటలు అందుబాటులో ఉండి విద్యార్థుల ఆరోగ్య విషయములో బాగోగులు చూసుకుంటూ వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ పరిశుభ్రమైన ఆహారము అందించాలని ఆదేశించారు. సమావేశంలో వసతి గృహ నాలుగవ తరగతి సిబ్బంది, వార్డెన్లు మసూద్, మాసూం, మైజొద్దిన్, మంజుల, రేణుక, ముస్తఫా, శివలు పాల్గొన్నారు.

# ప్రజలు మెచ్చే ప్రజాపాలన..!




- రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు
- అధికారులు తమవంతు సహకారం అందించాలి
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**వనపర్తి బ్యూరో జూన్11(జనం సాక్షి)**

ప్రజలు మెచ్చే విధంగా, పారదర్శకమైన ప్రజాపాలన అందించేందుకు అధికారులు తమవంతు సహకారం అందించాలని రాష్ట్ర ఎక్సైజ్, మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన వీపంగండ్ల, చిన్నంబావీ, పానగల్ మండలాలకు సంబంధించిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై మంగళవారం వనపర్తి జిల్లా ఐడిఒసి సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలు మెచ్చే విధంగా పారదర్శకమైన ప్రజాపాలన అందించేందుకు కృత నిశ్చయంతో ఉందని అందుకు ఆయా శాఖల అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ముందుగా వైద్య ఆరోగ్య శాఖ పై సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రమైన తాగు నీరు, పరిశుభ్రత, వైద్య సదుపాయం అందుబాటులో ఉండాలని తెలిపారు. వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు అంబులెన్స్ సౌకర్యం కల్పించండి. అవసరమైన నిధులను అందిస్తాం. రేమద్దుల గ్రామంలో నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని ఆధీనంలో తీసుకొని వైద్య సేవలు అందించేందుకు మల్టి లెవల్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్‌ను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### విద్యా శాఖ

జిల్లాలో మొత్తం విద్యార్థులు ఎంతమంది, ఉపాధ్యాయులు ఎంతమంది, ఉపాధ్యాయులు ఖాళీలు ఎన్ని ఉన్నాయని విద్యా అధికారినీ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుండి పదవ తరగతి వరకు 54,306 మంది విద్యార్థులు, 2026 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, 364 ఖాళీలు ఉన్నట్లు డిఈఒ గోవిందరాజులు వివరాలు వెల్లడించారు. చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లో కొరత ఉన్న సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్దదగడ, పెద్ద మరూర్ లోని ప్రభుత్వ పాఠశాల, ఉన్నత పాఠశాల మొత్తం 4 పాఠశాలలకు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

### పంచాయతీ రాజ్

సీసీ రోడ్లు, బిటి రోడ్లు మంజూరు అయిన వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీరును ఆదేశించారు. టెండర్ అయి సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లకు 60 సి సెక్షన్ కింద నోటీసులు జారీ చేయాలని, ఇంకా టెండర్లు పిలువని వాటికి వెంటనే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు.

### విద్యుత్ శాఖ

విద్యుత్ శాఖ ద్వారా రైతులకు ఇబ్బంది పెట్టే పని చేయవద్దని ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు కఠినంగా తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఎంతమంది రైతులు వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్నారు, వాటి పురోగతి ఎంటి అని విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ ఎస్.. ఈ లేకపోవడంతో విద్యుత్ సమస్యల పైన మూడు మండలాల నుండి వచ్చిన 24 ఫిర్యాదులను జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తూ సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై పూర్తిస్థాయి నివేదికను వారం రోజుల్లో ఇవ్వాల్సిందిగా జిల్లా కలెక్టర్‌ను సూచించారు.

### మిషన్ భగీరథ

మిషన్ భగీరథ నిర్వహణ లోపం వల్ల శుభ్రమైన నీరు రావడం లేదని ఇది ఎంతమాత్రం ఉపేక్షించేది కాదని మంత్రి అన్నారు. గోపాల్ దీన్నే రిజర్వాయర్ నుండి వీపనగండ్ల, పాన్ గల్, చిన్నంభావి మండలాలకు వచ్చే మిషన్ భగీరథ నీరు పచ్చగా వస్తున్నాయని, నిర్వహణ లోపం ఎక్కడుందని మిషన్ భగీరథ అధికారులను మంత్రి ప్రశ్నించారు.

### వ్యవసాయం

జిల్లాలో విత్తనాలు, ఎరువుల నిల్వల పై వివరాలు అడిగితెలుసుకున్నారు. విత్తనాలు, ఎరువులను కొరత లేదని ఎక్కడైనా నకిలీ విత్తనాలు అముతున్నట్లు రైతులు గుర్తిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదులు చేయాలని సూచించారు. అనంతరం రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రజల భూ సమస్యలు ఫిర్యాదుల పై ఫిర్యాదు వారీగా రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, జిల్లా అధికారులు, ఆర్డీవో, తహశీల్దార్లు, ఎంపీడీఓ లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## అధైర్యపడవద్దు అండగా ఉంటాం

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి టౌన్, జూన్ 11, (జనం సాక్షి):**

తరుచుగా ఆపదలు వస్తుంటాయని వాటిని తట్టుకొని నిలవడమే ఏకైక మార్గమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఉద్బోధించారు. స్థానిక డిగ్రీ కాలేజీ సమీపంలోని మాతాశిశు సంరక్షణ హాస్పిటల్ ముందు ముందు బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు కొమ్ము లక్ష్మి ఏర్పాటు చేసుకొన్న కిరాణా స్టోర్ ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమయి నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని కొమ్ము లక్ష్మికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్థులు భీమా సౌకర్యం ఖచ్చితంగా కలిగివుండాలని అన్నారు. అధైర్యపడవద్దు అండగా ఉంటామని ఆమెకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో నిరంజన్ రెడ్డితో పాటుబీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ ,అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, నాయకులు నందిమల్ల అశోక్, తిరుమల్, గంధం పరంజ్యోతి, నీలస్వామి, సూర్యవంశంగిరి, మురళీ సాగర్, స్టార్ రహీమ్, ఎం.బాలరాజు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

- సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం
- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ జూన్ 11 (జనం సాక్షి)

వర్షాకాలం నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, అధికారులు ఎక్కడా అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైద్య శాఖ, పారిశుద్ధ్యంపై అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో వర్షాలు పెద్ద ఎత్తున పడే అవకాశం ఉందని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో పూడికతీత చేపట్టాలని సూచించారు. చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య సిబ్బందిని పూర్తి స్థాయిలో వినియోగించి అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో... వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, పూర్తి స్థాయిలో మందులు, అత్యవసర సామాగ్రి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని అన్నారు. పల్లె దవాఖానాలు, పీహెచ్ సీ లలో సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఎక్కడా ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని అన్నారు. మక్తల్ ఆసుపత్రి ని జిల్లా ఏరియా ఆసుపత్రిగా మార్చేందుకు ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. కర్ని పీహెచ్ సీ కి శాశ్వత భవనం, పల్లె దవాఖానా లకు భవనాలను రాబోయే రోజుల్లో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో వ్యవసాయం, ఇరిగేషన్ శాఖలపై రివ్యూ నిర్వహించి, రైతులకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సౌభాగ్య లక్ష్మీ, సూపరిండెంట్ డా.రాజన్న, వైద్యులు, అన్ని మండలాల ఎంపీడీవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలలు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**సదాశివపేట జూన్ 11(జనం సాక్షి)**

బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సదాశివపేట మండలంలోని కోనాపూర్ పిఎస్ ఎంఎల్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించడం జరిగింది. గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్‌కు గ్రామానికి సంబంధించిన సమస్యలను, పాఠశాలకు సంబంధించిన సమస్యలను విన్నవించడం జరిగింది. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రజా సమస్యలపై అధికారులు మానవీయ కోణంలో పనిచేయాలి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

ప్రజా సమస్యలు, సంక్షేమం విషయంలో అధికారులు మానవీయ కోణంలో పనిచేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం (ఐడిఓసి) లో జిల్లా కలెక్టర్ జి రవి నాయక్ మరియు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్‌లతో కలిసి జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 27 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వల్ల అభివృద్ధి ఆగిపోయిందని ఇక మీదట అధికారులు అంతా కూడా అభివృద్ధి పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన ఆదేశించారు. శంషాబాద్ నుంచి కర్నూలు వరకు ఇండస్ట్రియల్ క్యారిడార్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని ఆయన చెప్పారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు మరియు ఇరిగేషన్ అధికారులు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. గతంలో ప్రభుత్వ భూములు ఆక్రమించుకొన్న భూములు తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత చట్టానికి, న్యాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థ ను కాపాడుతూ ప్రజాపాలన సాగిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. గత వేసవికాలంలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో 99% నీటి ఎద్దడి లేకుండా సాఫీగా తాగునీరు సమస్యలు నివారించడానికి అధికారులు పనిచేశారని ప్రజా సమస్యలపైన అధికారులు ఎంతో నిబద్ధతతో పనిచేశారని ఆయన అభినందించారు. గత సంవత్సరం విద్యాశాఖ అధికారుల కృషి వల్ల మహబూబ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యే గిఫ్ట్ డిజిటల్ కంటెంట్ బుక్స్ ద్వారా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో విద్యార్థులు 20% అధిక ఫలితాలు సాధించారని వారు చేసిన కృషి ఫలితంగా ఎంతో మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సైతం మంచి ఫలితాలు సాధించారని ఆయన తెలిపారు. వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు . ఇదే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడానికి డిజిటల్ కంటెంట్ బుక్స్ అందించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందని ఆయన చెప్పారు. తొలిసారిగా పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాం టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని ఆయన తెలిపారు.




## అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి

### జిల్లా కలెక్టర్ జి.రవినాయక్

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డితో కలిసి మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని వివిధ శాఖలు ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు ప్రగతిని వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం సమీక్షించారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతులు, మౌలిక వసతుల పనులు ప్రగతి, పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ, త్రాగు నీరు సరఫరా, మిషన్ భగీరథ నీటి సరఫరా, మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులు, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, అర్‌బి, నేషనల్ హైవే ఎస్‌సి, ఎస్.టి., బిసి.సంక్షేమం, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో శాఖల వారీగా చేపట్టిన పనులను సుదీర్ఘంగా సమీక్షించి సూచనలు చేశారు.

## పాఠశాలల పునఃప్రారంభం ఘనంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్

వనపర్తి బ్యూరో జూన్ 11 (జనం సాక్షి)



పాఠశాలల పునఃప్రారంభం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. పాఠశాలలు వేసవి సెలవు అనంతరం ఈ విద్యా సంవత్సరంలో బుధవారం నుండి పాఠశాలల పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హా ల్లో విద్యా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ రేపటి పాఠశాలల పునఃప్రారంభం ఒక పండగ వాతావ రణాన్ని కల్పించాలని అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పాఠశాలల అలంకరణతో పాటు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెలవుల అనంతరం విద్యార్థులు తిరిగి పాఠశాలకు వెలుచున్న సందర్భంగా పిల్లలకు ఒక పండగ వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, జిల్లా విద్యా శాఖ అధికారి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడుల దశ తిరిగేనా..!

- ప్రభుత్వాలు మారినా అరకొర వసతులే
- స్వీపర్లు స్కావెంజర్లు లేకుండా పారిశుద్ధ్యం ఎలా ?
- నేటి నుంచే పాఠశాలలు పునఃప్రారంభం

**వనపర్తి టౌన్, జూన్ 11, (జనం సాక్షి):**

ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాలు మార్చడం పాలకులకు పరిపాటిగా మారింది. దీంతో రాజుల సొమ్ము రాళ్ళ పాలు అనే నానుడి పునరావృతం అవుతున్నదని పలువురు విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మనఊరు మనబడి మనబస్తీ మనబడి పథకంతో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు గత ప్రభుత్వం సంకల్పించింది దీని ప్రకారం అన్ని మండలాలు పట్టణాల్లో మూడవ వంతు పాఠశాలలను తీర్చిదిద్దారు .మనఊరు మనబడి మనబస్తీ మనబడి పథకంతో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు గత ప్రభుత్వం సంకల్పించింది దీని ప్రకారం అన్ని మండలాలు, పట్టణాల్లో మూడవ వంతు పాఠశాలలను తీర్చిదిద్దారు.అయితే రాష్ట్రంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కొత్త ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం కోట్ల రూపాయలు కేటాయించింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలకు రంగులు వేస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నారు. టాయిలెట్ల రిపేరింగ్, అదనపు టాయిలెట్ల నిర్మాణం, డ్రైయినేజీ వ్యవస్థ సరిచేయడంతో పాటు ఎలక్ట్రికల్ పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఈ నెల 12లోపు పాఠశాలలను అందంగా తీర్చిదిద్ది విద్యార్థులకు మంచి వాతావరణంలో స్వాగతం పలికేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.



### స్వీపర్లు, స్కావెంజర్లు లేకుండా పారిశుద్ధ్యం ఎలా ?

అయితే ప్రభుత్వ పాఠాశాలల్లో పారిశుధ్య పనుల కోసం గతంలో స్కావెంజర్లు ఉండేవారు. 40మందిలోపు విద్యార్థులు ఉంటే ఒకరిని రూ.2వేలు, అంతకంటే ఎక్కువ విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులకు రూ.2500 చొప్పున వేతనం చెల్లించేవారు. ఈ వేతనంతోనే సదరు కార్మికులు నిత్యం పాఠశాలల ప్రాంగణాలు, గదులు, టాయిలెట్లను శుభ్రం చేసేవారు. కానీ రెండేండ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్కావెంజర్ల వ్యవస్థను రద్దుచేసింది. దీంతో స్కావెంజర్లుగా పని చేసిన వారు ఉపాధి కోల్పోయారు. పాఠశాలల్లో పరిశుభ్రతను ప్రభుత్వం.. హెచ్‌ఎంలు, ఉపాధాయ్యులపై నెట్టేసింది. వారి నుంచి వ్యతిరేకత పెరగడంతో ఆ తర్వాత మున్సిపాలిటీలు, పంచాయతీలకు అప్పగించింది. స్థానిక సంస్థల కార్మికులు పాఠశాలల్లో ప్రాంగణాలను శుభ్రం చేస్తున్నారు. కానీ మరుగుదొడ్లు పరిశుభ్రత చేయడం లేదు. దాంతో బడుల్లో స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారింది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం, శానిటేషన్ ప్రశ్నార్థకంగా మారింది. అన్ని స్కూళ్లకు స్కావెంజర్లను నియమించడం ద్వారా స్వచ్ఛ వాతావరణంలో ప్రభుత్వ స్కూళ్లను నడిపించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

## ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా 'మై ఆటో ఇస్ సేఫ్'

### డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి

**జహీరాబాద్, జూన్11 (జనం సాక్షి)**

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారి రూపేష్ ఆదేశాల మేరకు "మై ఆటో ఇస్ సేఫ్" కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జహీరాబాద్ డివిజన్ డిఎస్పి రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణ పోలీస్ ఠాణా ఆవరణలో డివిజన్ పరిధిలోని ఆటో వాహన యజమానులు, చోదకుల (డ్రైవర్లు)కు అవగాహన కల్పించారు. ప్రయాణికులకు ఎంతో సురక్షితమైన ఈ " మై ఆటో ఇస్ సేఫ్ " కార్యక్రమంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు, వృద్ధులు, వికలాంగులు, కళాశాల విద్యార్థినీలకు ఎంతో మేలు చేకూరనుంది. ప్రయాణిస్తున్న ఆటోలో ఈవ్ టీజింగ్, చోరీకి పాల్పడడం, ప్రమాదాలు చోటు చేసుకోవడం వంటి తదితర సమస్యలు ఉత్పన్నమైతే వెను వెంటనే సమాచారం సేకరించి తగు చర్యలు తీసుకునే ఆస్కారం ఉందని డిఎస్పి వాహన చోదకులు, ప్రయాణికులకు మార్గదర్శనం చేశారు. ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఏమాత్రం అనుమానం కలిగిన వెంటనే " క్యూ ఆర్ కోడ్ %ఽ% మై ఆటో ఇస్ సేఫ్ "కు సమాచారం ఇస్తే క్షణాల్లోని ఆటో యజమాని, వాహన చోదకుడి, తదితర వివరాలు సేకరించి చర్యలు చేపట్టే ఆస్కారం ఉందన్నారు. అనంతరం ఆటోలకు "మై ఆటో ఇన్ సేఫ్" స్టిక్కర్లను అంటించారు. ఈ పాటికె జిల్లాలోని సంగారెడ్డి, పటాన్ చేరు, కోహిర్, చిరాగ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహన చోదలకు అవగాహన కల్పించారు. "మై ఆటో ఇస్ సేఫ్"తో ప్రయాణికులతో పాటు ఆటో యజమానులు, డ్రైవర్లకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని డిఎస్పి సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ, గ్రామీణ, కోహిర్, హద్దునూర్, రాయికోడ్, ఝరాసంగం, చిరాకుపల్లి పోలీస్ స్టేషన్లకు చెందిన సిఐ, ఎస్ఐ, ఆటో యజమానులు, వాహన చోదకులు పాల్గొన్నారు.



## ఉద్యమ చరిత్రను మసకబార్చేందుకు కాంగ్రెస్ కుట్ర

### బీఆర్ఎస్ రాష్ట్ర నేత రంగినేని అభిలాష్ రావు

**వనపర్తి టౌన్, జూన్11, (జనం సాక్షి):**

తెలంగాణ ఉద్యమ చరితను మసకబార్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్ రావు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మరచి గ్రూపు-1పేపర్లో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన ప్రశ్నలు లేకుండా తెలంగాణ అస్తిత్వానికి తీరని ద్రోహం చేశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన తెలంగాణ పోరాట యోధుడు కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేందుకు ఉద్యమ చరిత్రను విస్మరించే ప్రయత్నం చేస్తున్నారని, ఆయనపై ఉన్న వ్యక్తిగత కక్షతో ఉద్యమ చరిత్రకు సర్కార్ సమాధి కట్టడానికి పూనుకున్నదని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని తీరుపట్ల తెలంగాణ సమాజం తీవ్ర ఆగ్రహంతో ఉన్నదని, భవిష్యత్తులో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్ రావు ఆ ప్రకటనలో హెచ్చరించారు.

## నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కమిటీ వేయాలి

**గద్వాల నడిగడ్డ, జూన్ 11 (జనం సాక్షి)**

ఎంతో మంది కష్టపడి చదివి రాసిన నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై విచారణ కమిటీ నియమించాలని డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. ఒకే సెంటర్ లో ఎగ్జామ్ రాసిన విద్యార్థులందరికీ టాప్ ర్యాంక్‌లు రావడం అనుమానాలకు తావిస్తుంది. ఇలా జరగడం కష్టపడిన విద్యార్థుల శ్రమను దొచుకోవడమే అని కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి కోట్లు, కోట్లు సంపాదిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నయని విద్యార్థుల శ్రమను, జ్ఞానంను, కాలాన్ని వారి జీవితాల్ని కార్పొరేట్ విద్యసంస్థలు నాశనం చేశాయన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలను నిరోధించకపోతే కార్పొరేట్ విద్యా మాఫీయాగా తయారు అవుతుందని, నీట్ ఎగ్జామ్ విషయంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉన్న అనుమానాల్ని నివృత్తి చేయాలనీ, లేనియెడల అన్ని కార్పొరేట్ విద్యా సంస్థలను ముట్టడించి, తదుపరి కార్యచరణ చేపడతామన్నారు.





## నాన్న.. ప్రతి ఒక్కరికి
# ఒక సూపర్ హీరో



నాన్న... ప్రతి ఒక్కరికి ఒక సూపర్ హీరో.. పిల్లలు తమ జీవితంలో ఎవరినైనా అనుసరిస్తారు. అనుకరిస్తారు. ఆదర్శంగా తీసుకుంటారు అంటే అది నాన్ననే .. ఎవరూ తెలియని ఈ లోకంలో ఒక ముద్దు యువరాజుగానో, యువరాణిగానో మనల్ని పరిచయం చేసి, మన తప్పటడుగులను, తప్పుటడుగులను దిద్ది, మనల్ని పోషించి, చదివించి సమాజానికి మనల్ని ఉన్నతంగా పరిచయం చేసే నాన్నే మన సూపర్ హీరో. అలాంటి నాన్నలందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు ఇక ఫాదర్స్ డే విషయానికి వస్తే అమెరికాకు చెందినసోనోరా స్మార్ట్ డాడ్ అనే మహిళ తండ్రి గొప్పతనాన్ని తెలియజేయడానికి, నాన్నకు గౌరవార్ధంగా ఒకరోజు ఉండాలని మొదలు పెట్టిన ప్రచారం కార్యరూపం దాల్చి ఫాదర్స్ డేగా మారింది. ఇక ఆమె ఆలోచనలకు ప్రతిరూపంగా 1910వ సంవత్సరంలో మొదటి సారిగా ఫాదర్స్ డే జరుపుకున్నారు. ఇక అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం ఫాదర్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

ఫాదర్స్ డే... ప్రతి సంవత్సరం జూన్ నెలలోని మూడవ ఆదివారం నాడు ప్రపంచ వ్యాప్తంగా 52 దేశాలలో తండ్రుల గౌరవార్థం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు.అమ్మ కోసం మదర్స్ డే లాగా, నాన్న కోసం కూడా ఒక రోజు కావాలని ఫాదర్స్ డేని నిర్వహిస్తున్నారు. అయితే మనదేశంలో ఫాదర్స్ డేను జరుపుకోవడం అంత అవసరమా అంటే ప్రస్తుత కాలంలో తమ పిల్లల జీవితం కోసం, భవిష్యత్తు కోసం ఎంతో త్యాగం చేస్తున్న తండ్రులను చాలామంది నిర్లక్ష్యంగా చూస్తున్నారు. తండ్రి గొప్పతనాన్ని చాలామంది గుర్తించడం లేదు.ఇక చాలామంది వృద్ధాప్యంలోకి వచ్చిన తండ్రుల ను నిర్ధాక్షిణ్యంగా అనాధాశ్రమాలకు చేరుస్తున్నారు. ఇలాంటి సమయంలో ఫాదర్స్ డే జరుపుకోవడం, నాన్న గొప్పతనాన్ని గుర్తుచేసుకోవడం, ఆయన వల్లే మనం ఈరోజు గొప్పగా బ్రతుకుతున్నాము అనే విషయాన్ని గుర్తించడం అవసరమేమో అనే భావన కలుగుతుంది. కుటుంబ బాధ్యతను, బిడ్డల ఉన్నతిని కాంక్షించి నిత్యం శ్రమించే శ్రమజీవి నాన్న. పిల్లలు అడిగితే, తనకు కష్టసాధ్యమైనప్పటికీ తెచ్చి ఇచ్చే నాన్న గొప్పతనం ఇంత అని చెప్పడానికి సాధ్యం కాదు.

పిల్లల కళ్ళల్లో ఆనందం కోసం, వారి ముఖంలో చిరునవ్వు చూడడం కోసం నాన్న తన సర్వస్వాన్నీ త్యాగం చేస్తాడు. పిల్లల ఉన్నతి కోసం వెట్టిచాకిరీ చేస్తాడు. బాధ్యతగా చివరివరకూ బిడ్డల కోసం అండగా నిలిచే గొప్ప వ్యక్తిత్వం నాన్నది. అలాంటి నాన్న త్యాగ జీవి. తనకంటే తనవారి క్షేమాన్ని కాంక్షించి అనుక్షణం పనిచేసే కష్టజీవి. అందుకే ప్రతి ఇంట్లో పిల్లలు సూపర్ హీరో నాన్నే. ఈ రోజు ప్రతి ఒక్కరూ తాము సాధించిన ఘనత గురించి చెప్పుకుంటూ, సమాజంలో ఉన్నతంగా బ్రతుకుతున్నారు అంటే అందుకు మూలం నాన్న ఇచ్చిన స్ఫూర్తి.

గుర్తించాల్సింది తండ్రి గొప్పతనం చెప్పడం మాత్రమే కాదు,తన కోసం ఎన్నో కష్టాలు పడి పెంచి పెద్ద చేసిన తండ్రి పట్ల కాసింత ప్రేమాభిమానాలను చూపించడం. అందరూ తమ జీవితంలో గొప్పగా ఎదగడానికి కారణమైన, చిన్నప్పటి నుండి మన కోసం కష్ట పడిన తండ్రిని గౌరవిస్తే, వారిని ప్రేమిస్తే, వారి త్యాగాలను గుర్తిస్తే, వృద్ధాప్య దశలో వారికి చేదోడుగా నిలిస్తే ఆ తండ్రికి కావాల్సింది ఇంకేముంది

.తండ్రిని గౌరవించడం, ప్రేమించడం తప్ప ఫాదర్స్ డే సందర్భంగా మన నాన్న కు ప్రత్యేకంగా ఇవ్వాల్సిందేముంది. ప్రపంచానికి చెప్పాల్సిందేముంది. నాన్నను గౌరవించటానికి ఫాదర్స్ డే అవసరం లేదు . నాన్న గొప్పతనం చెప్పటానికి ఇది ఒక సందర్భం మాత్రమే .. నాన్నను ప్రేమించటానికి ఒక్కరోజు మాత్రమే చాలదు, ప్రతిరోజు మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మనం కృతజ్ఞులమై ఉండాలి. మనం ఎంతో ప్రేమానురాగాలతో పెంచిన వారిపట్ల మనం చూపించాల్సింది కూడా ప్రేమే కదా .

జన్మనిచ్చిన అమ్మను , నీడగా నిలిచి రక్షించిన నాన్నను ఆదరించి మీరు నడిచే మార్గమే రేపు మీ పిల్లలకు ఆదర్శం .. ఇంకేం నాన్నను సూపర్ హీరోగా చూసి మీరు కూడా మీ పిల్లలకు సూపర్ హీరోలవ్వండి . ఇక అందరూ అలాగే ఉంటే అప్పుడు ప్రతి రోజూ హ్యాపీ ఫాదర్స్ డేనే !!

నన్ను తన భుజాలపై మోస్తూ మొదటిసారి ఈ లోకాన్ని నాకు పరిచయం చేసింది నాన్నే.. ఫాదర్స్ డే శుభాకాంక్షలు నాన్న.

నాన్న ఓర్పుకు మారుపేరు, మార్పుకు మార్గదర్శి. నీతికి నిదర్శనం.. హ్యాపీ ఫాదర్స్ డే

నాన్నా, మీరే నా సూపర్ హీరో. ఐ లవ్యూ డాడీ.. హ్యాపీ ఫాదర్స్ డే నాన్న ఇంటిపేరునే కాదు, సమాజంలో మంచి పేరునూ ఇస్తాడు.. హ్యాపీ ఫాదర్స్ డే నాన్నా

.నాన్న చూపిన బాటలో విజయం ఉంటుందో లేదో తెలియదు కానీ.. అపజయం మాత్రం ఉండదు.

నాన్నా.. నా మొట్టమొదటి గురువు, నా బెస్ట్ ఫ్రెండ్ మీరే.. హ్యాపీ ఫాదర్స్ డే.

గెలిచినప్పుడు10 మందికి చెప్పి, ఓడిపోయినప్పుడు భుజం తట్టి దగ్గరగా తీసుకొని గెలుస్తావులే అని చెప్పే వ్యక్తి నాన్న.



భగవంతుని నుంచి పొంది అత్యుత్తమ బహుమతి పేరు నాన్న.. ఫాదర్స్ డే శుభాకాంక్షలు

పిల్లల కళ్లలో సంబరాన్ని చూసి మురిసిపోయే కర్మయోగి అతడు. కన్నబిడ్డలనే జీవితంగా బతికే నాన్నకు మనం ఏమిచ్చిన ఆ రుణం తీరదు.

నాన్న అంటే ఒక నమ్మకం,నేను ఉన్నాను అన్న భరోసా ప్రతి నిత్యం మన వెన్నంటే ఉంటుంది,ఏ స్వార్థమూ లేని నిజమైన ప్రేమను అందించేది ప్రపంచంలో తల్లి తర్వాత స్థానం తండ్రిది,అలాంటి తండ్రి ప్రేమకు వెలకట్టగలమా.సంవత్సరంలో వచ్చే ఒక్కరోజు నీ ఫాదర్స్ డే సెలబ్రేషన్స్ చేసుకోవడం కాదు మన శ్వాస ఉన్నంత వరకు కూడా ప్రతి రోజూ ప్రతి నిమిషం ప్రతి క్షణం తన తండ్రి తపన, నాన్నకు ప్రేమతోనీవు కొవ్వొత్తిలా కరిగే మా జీవితాలలో వెలుగు నింపడానికినీ జీవితం మొత్తం మాకై శ్రమిస్తూ మా విజయానికి వెన్నంటే నడుస్తున్న ఓ నాన్న నీకు వందనం.

మా నాన్నకు ప్రేమతో
హ్యాపీ ఫాదర్స్ డే



**వెంకటేశ్వర ప్రసాద్**
**మీ కూతురు వీరవెల్లి**
**శ్రీలత నేరేడుచర్ల**

# పాపం ఒకరిది శాపం మరొకరిదా?



వాకిలి బరబరా ఊడ్చి వచ్చిన యాదమ్మ పేపర్ చదువుతున్న నా ముందు వచ్చి నిల్చుని "నిన్నటి మాట మర్చి ఈ పొద్దు కొత్త పాట అందుకుంటే మంది నమ్ముతరా" అంది.

ఈ ఉపోద్ఘాతం దేనికో అర్థం కాక ఆమెకేసి చూస్తున్న నన్ను చూస్తూ "గదేనమ్మా.. శుక్రవారం రాత్రి ఫోన్ చేసి అన్నం తిన్నవా అని అడిగింది. పరీక్షలు మల్ల వాయిదా పడ్డయని బాధపడిరదని టీవీల చెప్పిండు. బాధపడకు బిడ్డ ధైర్యంగా ఉండుమని చెప్పిన అన్నడు. నాతో మాట్లాడిన 20 నిముషాలకే సచ్చిపోయిందని తెలిసిందని కండ్లల్ల నీరుపెట్టుకున్నడు. అగ్గో.. గిప్పుడేమో ప్రేమల ఎవడో మోసం చేసిండు అంటిన్రు" అని ఒక్క క్షణం ఆగింది యాదమ్మ.

"ప్రేమించినోని వేధింపులు ఎవ్వరికీ చెప్పలేక, ఇంట్లో చెబితే ఏమయితదోనని పానం తీసుకున్నదని ఆ పిల్ల తమ్ముడు, తల్లి అంటున్నరు. కానీ అది నిజం కాదట. ఆ పిల్ల అవ్వయ్యలను, తమ్ముని సర్కారోళ్ళు తీస్కబోయి బెదిరిచ్చిరట. పోయిన పిల్ల పాపం తిరిగొస్తదా.. మేం చెప్పినట్టు చేస్తే నీ కొడుక్కు నౌకరి, మీకు మా లెస్స పైసలు ఇస్తమని అట్ల చెప్పిచ్చింరట" గుసగుసగా చెప్పింది యాదమ్మ. "కూలీనాలి చేసి రెక్కలు ముక్కలు చేసుకొని చదివించే తల్లిదండ్రుల కష్టం చూడలేక, పరీక్షలు మల్ల మల్ల వాయిదాల మీద వాయిదాల పడ్డయట, అది తట్టకోలేని బిడ్డ శానా బాధపడ్డదట. ఆమె దోస్తులు సుతం బాధపడ్డరట. ఆ హాస్టల్ల పంచేసేటి మా ఆడిబిడ్డ బిడ్డ చెప్పింది. ఆ హాస్టల్ల అందరిదీ అదే గోస. ఎన్ని దినాలు ఇంట్లకెల్లి తెచ్చుకు తినాలే. ఏండ్లకు ఏండ్లు చదివిన పరీక్షలు పెట్టలేరని ఏడుస్తున్నరట. ప్చ్.. పాపం ఆ పొల్లగాడు. ఆని గోస గోస గాదు. ఆ పిల్లవాడు రాథోడ్ కాకుంట రెడ్డి, రావు, శర్మ అయితే ఇట్లనే చేస్తుంటిరా?" అంటూ పనిలో పడిరది యాదమ్మ. ఆ క్షణంలో వర్ధమాన నటి ప్రత్యూష, ఆయేషాల విషయంలో ఏం జరిగిందో గుర్తొచ్చింది. బలవంతులు నేరం చేసినా, దోషి అయినా తప్పించుకోగలిగే, బలహీనుడు తప్పు చేయకపోయినా దోషిగా నిలబెట్టే వ్యవస్థలో ఉన్నాం మరి! చిరు చిరు ఆశలు మొగ్గతొడుగు తుండగా చిన్ని చిన్ని లక్ష్యాలతో పల్లె నుంచి పట్నం బాట పట్టి అహోరాత్రులు కష్టపడి గ్రూప్స్ రాసిన ఆశావహులు ఆ యువత. భవిష్యత్ వెతుక్కునే బిడ్డల ఆశలపై ఎప్పటికప్పుడు కడివెడు నీళ్ళు జల్లడమే నేడు ఆనవాయితీగా మారిపోయింది. అలాంటప్పుడు నిరుద్యోగ యువత నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడటంలో ఆశ్చర్యం ఏముంది? ఆమె భౌతిక స్వరూపం తప్ప మనసు కనపడని కాబోదులు కదా! హృదయాంతరాలలోకి వెళ్ళరు. మనసులోని ఆలోచనను, సంస్కారాన్ని తెలుసుకోరు. రగిలే వేదన అర్థం చేసుకోరు. చితిమంటలు మాత్రం పేర్చడానికి ముందుంటారు. అసలు ఈనాటి ఆడపిల్లలు ఎలా ఉన్నారు? చాలామంది ప్రేమను, అందులోని వైఫల్యాన్ని అంత సీరియస్‌గా తీసుకోవడం లేదు. కానీ తమ చిన్న చిన్న ఆశలు, ఆశయాలు తీర్చుకోవడానికి తమకంటూ ఒక ఉద్యోగం, సంపాదన ఉండాలని కలగంటు న్నారు. తల్లిదండ్రులకు భారం కాకూడదని వారికి అండదండగా నిలబడాలని ఆశిస్తున్నారు. తమను తాము నిరూపించుకోవడానికి, తమకో అస్తిత్వం ఏర్పరచుకోవడానికి ఎంత్కెనా శ్రమ పడుతున్నారు. ఎవరికైనా అనుకున్న గమ్యం చేరే దారి చీకటిగా కనిపించినపుడు ఏం చేయాలో తోచని పరిస్థితిలో బేలతనం ఆవహిస్తుంది. ఆ క్రమంలోనే ప్రవల్లిక తనకు తాను నష్టజాతకురాలిగా భావించుకున్నది. కన్నవారికి ఇంకా ఇంకా భారం కాకూడదనుకున్నది. బాధ్యతనెరిగి ఆలోచించడం ఆమె తప్పు కాదు. మరి ఎవరిది? ఆమెకు ఆ పరిస్థితి ఏర్పడడానికి కారణం ఎవరు? అటు చావలేక ఇటు బ్రతకలేక కొన ఊపిరితో కొట్టు మిట్టాడే ప్రవల్లికలు ఎందరో.. అందుకే ఒక ప్రవల్లిక మరణం గ్రూప్ పరీక్షలు రాసేవారిని అంత కలచివేసింది, కుదిపివేసింది.

ఉన్నంతకాలం పరిస్థితులు ఇలాగే ఉంటాయి. ఒక మూసధోరణికి అలవాటు పడిన సమాజంలో ఆమె ల్కెంగికత చుట్టూ అల్లిన అపోహలను ఛేదించుకుంటూ పోవలసిందే.

పాపం ఒకరిది - శాపం మరొకరిదా?! పాపం ఒకరిది - శాపం మరొకరిదా?!

### గుర్తింపులేని మాస్టర్ మైండ్స్
# పాఠశాలను సీజ్ చేసిన అధికారులు

- గుర్తింపులేని పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న జిల్లా విద్యాశాకాధికారులను సస్పెండ్ చేయాలి
- ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్



**కాప్రా/నాచారం జూన్ 11 (జనంసాక్షి) :** విద్యా శాఖ గుర్తింపులేని మాస్టర్ మైండ్స్ పాఠశాలను సీజ్ చేయాలని, గుర్తింపు లేని పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న జిల్లా విద్యాశాకాధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ హనుమసాయి నగర్ లోని అనధికార మాస్టర్ మైండ్స్ పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు.అనంతరం ఉప్పల్ మండల విద్యాశాకాధికారి ఆదేశాల మేరకు సీఆర్ పీ స్వప్న పాఠశాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా లిఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏ ఐ వై ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లి లు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ ఆగడాలు అధికమయ్యాయని, ఈ పాఠశాలలను కట్టడి చేయడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలం చెందారని వారు ధ్వజమెత్తారు. జీ ఓ.నెం.1 కు వ్యతిరేకంగా నూతన పాఠశాల ఏర్పాటుకు ఆటస్థలం, మెరుగైన తరగతి గదులు,ఫైర్ సేఫ్టీ ఇతర మౌలిక సదుపాయాలతో పాటు విద్యాశాఖ నుండి పూర్తి స్థాయి అనుమతులు, గుర్తింపు పొందాలి. కానీ, ఇవేవీ పొందకుండా విచ్చలవిడిగా అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్య శాఖ నిబంధనలకు పాతర వేస్తూ ధనార్జనే ధ్యేయంగా మాస్టర్ మైండ్స్ యాజమాన్యం వ్యవహరిస్తున్నార న్నారు. అదే విధంగా పక్కపక్కనే పాఠశాలలకు ఏవిధంగా అనుమతులు ఇస్తారో అధికారులు స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా విద్యాశాకాధికారులు మామూళ్లకు అలవాటు పడ్డారని, కార్పొరేట్ పాఠాశాలలకు రెడ్ కార్పెట్ వేస్తున్నారని ధ్వజమెత్తారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని విద్యాసంస్థల పై ఏ ఐ వై ఎఫ్ నిరంతర పోరు నిర్వహిస్తుందని వారు అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, జిల్లా ఆఫీస్ బేరర్స్ శేఖర్, కిరణ్, కళ్యాణ్, మాజీద్, మహేష్, అజీమ్ పాషా, శ్రీకాంత్, అవినాష్ పాల్గొన్నారు.

# కల్తీ విత్తనాల కట్టడియే ప్రభుత్వ లక్ష్యం

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- విత్తనాలు,ఎరువులు క్రిమిసంహారక మందులపై ఫర్టిలైజర్ డీలర్లకు అవగాహన సదస్సు
- హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,డీసీపీ నారాయణ రెడ్డి



**షాద్ నగర్ (జనంసాక్షి)** రాష్ట్రంలో కల్తీ విత్తనాలను నివారించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్ నగర్ పట్టణంలో వ్యవసాయ శాఖ,పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ షాప్ డీలర్లకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహా రక మందులపై అవగాహన సదస్సు ఏర్పాటు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డి, షాద్ నగర్ ఏసిపి రంగస్వామి, ఏడి రాజారత్నం తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ వానాకాలం సాగులో భాగంగా ఫర్టిలైజర్ షాప్ డీలర్ రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని,డీలర్ లు అమ్మే విత్తనాలు,క్రిమిసంహారక మందులతో ఏ ఒక్క రైతు కూడా నష్టపోవద్దని అన్నారు.ప్రతినిత్యం వ్యవసాయ శాఖ అధికారులు కచ్చితంగా ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి రికార్డులను పక్కాగా చూడాలని అన్నారు.ఎవరైనా నకిలీ నకిలీ విత్తనాలు అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి పాటుపడుతుందని,రైతే రాజుగా మారాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.. నకిలీ విత్తనాలకు తావులేకున్న ప్రతి ఒక్క డీలర్ సహకరించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాదయ్య యాదవ్ తదితరులున్నారు.

## లారీ కిందపడి మహిళ మృతి

**మచిలీపట్నం:** లారీని ఓవర్‌టేక్ చేయబోతుండగా బైక్ పై నుండి మహిళ రోడ్డుపై పడింది.. ఆ లారీ టైరు ఆమెపై ఎక్కడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం మచిలీపట్నం బుట్టాయిపేట సెంటర్ లో జరిగింది. రేపల్లెకు చెందిన మోపిదేవి రాజేశ్వరి అనే మహిళ తన భర్త, కుమారుడితో కలిసి తాళ్లపాలెంలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి హాజరై తిరిగి బైక్ పై బయలుదేరారు.. రాజేశ్వరి మీద నుండి లారీ టైర్ ఎక్కడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రక్తదానమే ప్రాణదానం

**శరీరానికి రక్తం ఇంధనం లాంటిది. కొందరికి రక్తం ఎక్కువ ఉంటే మరికొందరికి చాలా తక్కువగా ఉంటుంది. జీవన విధానం.. పౌష్టికాహార లోపం... వ్యాధి నిరోధక శక్తి మందగించడం వల్ల రక్తం కొరత ఏర్పడుతున్నది. ఈ లోటును పూడ్చేందుకు ఒకే ఒక్క అవకాశం.. రక్తం ఎక్కించడం, రక్తదానం చేసేవాళ్లు ఉంటేనే అత్యవసర పరిస్థితుల్లో ఇంకొకరి ప్రాణం కాపాడొచ్చు. ఆరోగ్య సమాజం కోసం ఇప్పుడు ఈ రక్తదాతలు అవసరం. ఈ నెల 14వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈ కథనం.**






రక్తదానం యొక్క ప్రాముఖ్యతను గురించి అవగాహన పెంపొందించడం, ప్రాణాలను కాపాడే స్వచ్ఛంద రక్తదాతలను గుర్తించటం మరియు క్రమం తప్పకుండా రక్తదానం చేసేలా ఎక్కువ మందిని ప్రోత్సహించడం కోసం జూన్ 14 అంకితం చేయబడింది. ఏబిఓ బ్లడ్ గ్రూప్ సిస్టమ్‌ను కనుగొన్నందుకు నోబెల్ బహుమతిని గెలుచుకున్న ఆస్ట్రియన్ ఇమ్యునాలజిస్ట్ అయిన కార్ల్ ల్యాండ్‌స్టెయినర్ జన్మదినాన్ని పురస్కరించుకుని జూన్ 14వ తేదీని ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా ఎంచుకున్నారు. మొదటిసారిగా 2004లో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ మరియు రెడ్ క్రెసెంట్ సొసైటీల సహకారంతో ఇది స్థాపించబడింది.

ముందుగా.. స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న రక్తదాతలకు, రోగుల ప్రాణాలను రక్షించి వారి జీవితాలను తిరిగి నిలబెడుతున్నందుకు శతకోటి నమస్కారాలు మరియు ధన్యవాదములు. ప్రతి సంవత్సరం, ప్రపంచ రక్తదాతల దినోత్సవం వివిధ అంశాలపై దృష్టి సారించడానికి విభిన్న థీమ్‌తో గుర్తించబడుతుంది. ప్రమోషనల్ ఈవెంట్‌లు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు మరియు విద్యా కార్యక్రమాలు నిర్వహించటం, ధృవీకరణ పత్రాలు, అవార్డులు మరియు పబ్లిక్ అక్నాలెడ్జ్‌మెంట్‌ల ద్వారా సాధారణ రక్తదాతలను గౌరవించడం, ఆసుపత్రులు, లాభాపేక్ష లేని సంస్థలు మరియు కమ్యూనిటీ గ్రూపుల సహకారంతో రక్తదాన శిబిరాలను నిర్వహించడం వంటి కార్యక్రమాల ద్వారా రక్తదానాన్ని ప్రోత్సహించవచ్చును.

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో, రక్త సేకరణ, నిల్వ, పంపిణీలో ప్రసిద్ధి చెందిన అనేక సంస్థలు ఉన్నాయి. వైద్యపరమైన అత్యవసర పరిస్థితులు, శస్త్రచికిత్సల కోసం సురక్షితమైన రక్తం యొక్క సరఫరాను నిర్ధారించడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయి.

ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులే కాకుండా ప్రైవేట్ పరంగాను కొన్ని మంచి సంస్థలు వారి కార్యక్రమాల ద్వారా ప్రజా మన్ననను పొందగలుగుతున్నాయి. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు, చిరంజీవి బ్లడ్ బ్యాంకు లు మంచి ఉదాహరణలు. ఈ రక్తదాన కేంద్రాలు అవసరమైన రోగులకు సురక్షితమైన, తగినంత రక్త సరఫరా చేస్తున్నాయి అని చెప్పవచ్చును. వారు క్రమం తప్పకుండా రక్తదాన డ్రైవ్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం మరియు అత్యవసర సమయంలో కీలకమైన సహాయాన్ని అందించటం ముఖ్యమైనవి. ఈ కేంద్రాలలో రక్తదానం చేయడం వల్ల ప్రాణాలను రక్షించడంతోపాటు సమాజం యొక్క ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు దోహదపడుతుంది.

ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవం వంటి అత్యవసర సమయాల్లో రోగులకు మరియు రక్తహీనత, క్యాన్సర్ వంటి పరిస్థితులతో బాధపడుతున్న వ్యక్తులకు రక్తదానం చేయడం చాలా కీలకం. మరి అసలు రక్తదానం చేయటం సురక్షితమేనా ఎవరైనా చేయవచ్చునా అంటే....రక్తదాతలకు చాలా ఆరోగ్య ప్రయోజనాలు వున్నాయి. రక్తదానం ఆరోగ్యకరమైన ఇనుము స్థాయిలను మైంటైన్ చేయటం మరియు గుండె ఆరోగ్యం మెరుగు పడటం లాంటి పాజిటివ్ పాయింట్స్ వున్నాయి. ఆరోగ్యకరమైన వ్యక్తులు ప్రతి 56 రోజులకు రక్తదానం చేయవచ్చు. రక్తదానం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రచారం చేయడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మరియు కమ్యూనిటీ నెట్‌వర్క్‌లను ద్వారా ప్రోత్సహించవచ్చును.

సాధారణ రక్తదానం యొక్క ప్రయోజనాలు మరియు ఆవశ్యకత గురించి స్నేహితులు, కుటుంబ సభ్యులు మరియు సహోద్యోగులకు తెలియజేయవచును. అసలు రక్తదానం చేసిన తరువాత మన శరీరం కలిగే మార్పులు ఉంటాయా అంటే ఖచ్చితంగా కొంత మార్పు కనపడుతుంది. రక్తదానం అనేది దాతలు మరియు గ్రహీతలు ఇద్దరికీ సురక్షితమైన మరియు ప్రయోజనకరమైన పద్ధతి. అయినప్పటికీ, ఇది శరీరంలో తాత్కాలిక మార్పులకు కారణమవుతుంది. వీటిని సాధారణంగా ఆరోగ్యకరమైన వ్యక్తులు బాగా తట్టుకుంటారు. శరీరం రక్త పరిమాణం మరియు కణాల నష్టాన్ని త్వరగా భర్తీ చేస్తుంది మరియు ఈ ప్రక్రియ దాతలకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దాతలు సజావుగా కోలుకోవడానికి విరాళం ఇచ్చిన వెంటనే హైడ్రేటెడ్‌గా ఉండటం, బాగా తినడం చాలా ముఖ్యం.



బ్లడ్ గ్రూప్ 'ఓ' రకం ఉన్న వ్యక్తులను సార్వత్రిక దాతలు లేదా యూనివర్సల్ డోనార్స్ అని పిలుస్తారు, ఎందుకంటే వారు ఇతర రక్త వర్గాలకు కూడా రక్తాన్ని దానం చేయవచ్చు. మరి యూనివర్సల్ గ్రహీతలు అంటే ఏ బ్లడ్ గ్రూప్ నుండి అయినా రక్తాన్ని పొందగలిగే 'ఏబి' బ్లడ్ గ్రూప్ ఉన్న వ్యక్తులు అని చెప్పవచ్చు.

రక్తదానం అనేది ప్రతిఫలంగా ఏమీ ఆశించకుండా చేసే పరోపకార చర్య. ఇది మానవాళి యొక్క కరుణ, దాతృత్వం అనే ఉత్తమమైన అంశాలకు సంబదించనది. రక్తం అనేది విశ్వవ్యాప్తంగా అవసరం, ఇది సరిహద్దులను చెరిపి విశ్వ ప్రయోజనాలకు దోహదపడే అంశం. అందుకే "రక్తదానం చేయండి ఒకరి ఉనికికి కారణం అవ్వండి".

**అపోహలు.. వాస్తవాలు!**

**అపోహ-1:** రక్తదానం సమయంలో విపరీతమైన నొప్పి ఉంటుంది.

**వాస్తవం:** రక్తదానం సమయంలో ప్రత్యేకమైన సూది గుచ్చేటప్పుడు కలిగే చిన్నపాటి నొప్పి తప్పించి ఎటువంటి తీవ్రమైన బాధ ఉండదు.

**అపోహ-2:** రక్తదానం వల్ల ఎయిడ్స్ వస్తుంది.

**వాస్తవం:** రక్తదానం పూర్తి శాస్త్రీయమైన.. సురక్షితమైన పద్ధతులలో ఏ రకమైన వ్యాధి క్రిములు సోకే అవకాశంలేని విధంగా జరుగుతుంది.

**అపోహ-3:** రక్తదానం వల్ల రక్తం తగ్గి రక్తహీనత వస్తుంది.

వాస్తవం: రక్తదానం తర్వాత ఎలాంటి రక్తహీనత ఏర్పడదు. ఒక యూనిట్ రక్తంలోని ఎర్ర రక్త కణాలు 3 రోజుల్లో, తెల్ల రక్తకణాలు 3 వారాల్లోనే తిరిగి వస్తుంది.



**- ఇమ్మడి సంధ్య సతీష్, కోదాడ**

## విపణి



## ఆఖర్లో అమ్మకాలు.. ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

ముంబయి:
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం లాభాల్లో కదలాడిన సూచీలు..

ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్నాయి. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు బలహీనపడ్డాయి. దీంతో ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 76,680.90 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నా దాదాపు లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 76,860.53 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల కారణంగా 33.49 పాయింట్ల నష్టంతో 76,456.59 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం కేవలం 5 పాయింట్లు లాభపడి 23,264.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.57 వద్ద ముగిసింది.

సెన్సెక్స్‌లో ఎల్అండ్‌టీ, టాటా మోటార్స్, మారుతీ సుజుకీ, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడగా.. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, రిలయన్స్, ఐటీసీ, సన్‌ఫార్మా షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ 81.43 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 2322 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.



# అలా చేస్తే మా కంపెనీలో యాపిల్ ఉత్పత్తులపై నిషేధం

## ఎలాన్ మస్క్



యాపిల్ పరికరాలకు ఏఐ రూపొందించిన కృత్రిమ మేధను అనుసంధానిస్తే తమ కంపెనీలో వాటిని నిషేధిస్తామని టెస్లా (సీఈఓ) ఎలాన్ మస్క్ పేర్కొన్నారు.
ప్రముఖ అంతర్జాతీయ సంస్థ యాపిల్ తాజాగా 'వరల్డ్‌వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్'ను నిర్వహించింది. ఈ వార్షిక సమావేశంలో సంస్థ తమ ఉత్పత్తులకు తీసుకురానున్న అప్‌గ్రేడ్‌లను ఆవిష్కరించింది. ఇందులోభాగంగా 18 సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్‌లో కృత్రిమమేధను జోడిస్తున్నట్లు వెల్లడించింది. యాపిల్ చాట్‌బాట్ పరికరాల్లో చాట్‌జీపీటీ )ని అనుసంధానించడానికి ఓపెన్ ఏఐ తో ఒప్పందం చేసుకుంటామని వెల్లడించింది.
ఎలాన్ మస్క్ దీనిపై స్పందిస్తూ ఐఫోన్ ఓఎస్‌కి ఓపెన్ ఏఐను అనుసంధానిస్తే తన కంపెనీ పరికరాలను ఇకపై అనుమతించబోమని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇటువంటి స్పైవేర్‌ను ఆపేయకపోతే తమ కంపెనీల్లో అన్ని యాపిల్ పరికరాల పైన నిషేధం విధిస్తామని తెలిపారు. సంస్థలో యాపిల్‌కు సంబంధించిన పరికరాలను ఇకపై ఉపయోగించమన్నారు.అనంతరం ఆయన మరో పోస్టులో యాపిల్ సంస్థకు సొంతంగా ఓపెన్ ఏఐని తయారుచేసుకునే సామర్థ్యం లేదని అనుకోవట్లేదన్నారు. సొంత ఏఐతో భద్రత, గోప్యత ఉంటుందన్నారు. అలాకాకుండా డేటాను ఓపెన్ ఏఐ అందజేస్తే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. యాపిల్ తన పరికరాల్లో చాట్ జీపీటీని అనుసంధానించడం వల్ల వినియోగదారుల డేటా గోప్యతకు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మస్క్ చేసిన వ్యాఖ్యలపై నెట్టింట్లో చర్చ నెలకొంది. నెటిజన్లు స్పందిస్తూ ఏఐతో అనుసంధానించడం వల్ల యాపిల్ సంస్థ ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులు నెలకొంటాయన్నారు.

# బ్లింకిట్‌లో జొమాటో రూ.300 కోట్ల పెట్టుబడి




ప్రముఖ ఫుడ్ డెలివరీ కంపెనీ జొమాటో తన క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది.
ఇప్పటికే స్విగ్గీ, జెప్టో నుంచి పోటీని ఎదుర్కొంటున్న తరుణంలో తన వ్యాపారాన్ని మరింత విస్తరించాలని చూస్తోంది. అందులోభాగంగా రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనుందని కంపెనీ తన ఫైలింగ్‌లో పేర్కొంది.
2022 ఆగస్టులో జొమాటో రూ.4,477 కోట్లకు బ్లింకిట్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అప్పటినుంచి వ్యాపారాన్ని విస్తరించడంలో భాగంగా పెట్టుబడులు పెడుతూ వచ్చింది. ఇప్పటివరకు రూ.2,300 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. బ్లింకిట్‌తో పాటు తన అనుబంధ సంస్థ జొమాటో ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.100 కోట్లు పెట్టింది. ఈ సంస్థ లైవ్ ఈవెంట్‌లు, టికెటింగ్‌లను నిర్వహిస్తుంది. స్విగ్గీ తీసుకొచ్చిన ఇన్‌స్టామార్ట్, జెప్టో నుంచి బ్లింకిట్ గట్టి పోటీని ఎదుర్కొంటోంది. ఈ తరుణంలో మరోసారి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం గమనార్హం.ఓవైపు స్విగ్గీ ఐపీఓకు సిద్ధమైంది. ఈ ఐపీఓ ద్వారా రూ.10,414 కోట్ల వరకు సమీకరించాలని భావిస్తోంది. మరోవైపు జెప్టో 300 మిలియన్ డాలర్లు (సుమారు రూ.2,500 కోట్లు) సమీకరించడానికి చర్చలు జరుపుతోంది. 2023 ఆర్థిక సంవత్సరంలో బ్లింకిట్ ఆదాయం రూ.1,064 కోట్లుగా ఉంది. 2024లో ఆ ఆదాయం రూ.2,302 కోట్లకు చేరింది. ప్రస్తుతం నిత్యావసర వస్తువులు డెలివరీ చేస్తున్న సంస్థ.. త్వరలో దుస్తులు, గృహాలంకరణ వస్తువులు, ఎలక్ట్రానిక్స్, స్పోర్ట్స్ వస్తువులు, గృహోపకరణాలను చేర్చాలని చూస్తోంది. ఇప్పటికే ఫుడ్ డెలివరీ విభాగాన్ని బ్లింకిట్ అధిగమించింది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.02 | ₹ 5.22 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

| | 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹65,850 | ₹71,840 |
| చెన్నై | ₹66,450 | ₹72,490 |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్ ₹ 95,000

## 104 MW విండ్ ప్రాజెక్ట్ ఆర్డర్ పొందిన సుజ్లాన్

దిల్లీ: ప్రముఖ పునరుత్పాదక ఇంధన సొల్యూషన్స్ ప్రొవైడర్.. సుజ్లాన్ గ్రూప్ మంగళవారం AMPIN ఎనర్జీ ట్రాన్సిషన్ నుంచి 103.95 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్ట్‌ను పొందినట్లు తెలిపింది. ఒప్పందంలో భాగంగా రాజస్థాన్‌లోని ఫతేఘర్ జిల్లాలో సుజ్లాన్..విండ్ టర్బైన్స్‌ను సరఫరా చేసి ప్రాజెక్ట్ సమగ్ర కార్యకలాపాలతో పాటు, నిర్వహణ సేవలను కూడా చేపడుతుందని సుజ్లాన్ ఇండియా సీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. సుజ్లాన్ 33 విండ్ టర్బైన్ జనరేటర్లను హైబ్రిడ్ లాటిస్ ట్యూబ్యులర్(HLT) టవర్‌తో, ఒక్కోటి 3.15 మెగావాట్ల రేట్ సామర్థ్యంతో అమర్చుతుంది. ఈ పరిమాణంలో ఉన్న ఒక ప్రాజెక్ట్ 85 వేల ఇళ్లకు విద్యుత్తును అందించడమే కాకుండా, సంవత్సరానికి 3.38 లక్షల టన్నుల $CO_2$ ఉద్గారాలను అరికట్టగలదు. ఈ ప్రాజెక్ట్ నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగిస్తారు.




# తెలుసుకుంటే.. ఆస్తి మీ వెంటే!



రిజిస్ట్రేషన్.. ఈ పదం మీద ఉన్న నమ్మకం అంత ఇంతా కాదు. స్టాంపు కాగితాల మీద రాసిన దస్తావేజును రిజిష్టరు చేస్తే చాలు, ఇక ఆస్తి మీద సర్వ హక్కులూ వచ్చినట్టు భావిస్తారు.
దీనికి ఉన్న విలువ అలాంటిది. ప్రభుత్వానికి కూడా కాసుల వర్షం కురిపించే శక్తి దీనిది. నిజంగానే దీనికి తిరుగు లేదా? ఒక్కసారి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే దాని గురించి ఆలోచించాల్సిన పని లేదా?
ఆస్తి కొనడం, దాన్ని మన పేరు మీదకి మార్పించుకోవడం. చూడ్డానికి ఇది చాలా తేలికైన వ్యవహారంగానే అనిపిస్తుంది. చిక్కులు వచ్చినప్పుడు కానీ తెలీదు అందులోని లోటుపాట్లు. మీకు రిజిస్టర్ అయిన స్థలం మళ్లీ వేరొకరికి రిజిస్ట్రేషన్ జరగవచ్చు లేదా కబ్జా కావచ్చు. ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులు దావా వేయవచ్చు. అప్పుడు వ్యవస్థను నిందించి లాభం లేదు. ఇలాంటి ఇబ్బందులు రాకుండా మనం తగిన జాగ్రత్తలు తీసుకున్నామా అని ఆలోచించాలి. కొనాలని నిర్ణయం తీసుకోగానే స్థలం/ఫ్లాట్ ధర గురించి తప్ప అమ్మే వారి హక్కుల గురించి శ్రద్ధ పెట్టారు చాలా మంది. అధిక ధర పెట్టినంత మాత్రాన మంచి వస్తువు లభిస్తుందని కచ్చితంగా చెప్పలేం. తక్కువ ధరకు మాత్రం మంచి సరుకు రాదని చెప్పవచ్చు. స్థిరాస్తి విషయంలో కూడా అంతే. ఆ ప్రదేశంలో వాస్తవంగా ఉన్న దాని కంటే తక్కువ ధరకే ఇస్తామని ఎవరైనా అంటే కొంచెం అనుమానించాల్సిందే. ఎందుకైనా మంచిది మన జాగ్రత్తలో మనం ఉండాల్సిందే.

### అమ్మే హక్కు ఉందా?

ఏ ఆస్తి అయినా కొనే ముందు మనం చూడాల్సిన మొట్ట మొదటి విషయం ఏంటంటే అమ్మే వారికి ఉన్న హక్కులు ఏంటని.. అసలు వారికి ఆ ఆస్తి ఎలా వచ్చింది అని. వారసత్వం అయితే.. వారసులు అందరూ సంతకాలు పెడుతున్నారా?మైనర్లుంటే కోర్టు అనుమతి తీసుకున్నారా?తండ్రి లేదా సంరక్షకుడు తన అధికార పరిధిలోనే వ్యవహరిస్తున్నారా? ఇతర హామీలు ఏమైనా ఇస్తారా? అసలు యజమాని నుంచి యాజమాన్య హక్కులు సరిగ్గానే సంక్రమించాయా? రిజిస్టరు దస్తావేజులు సరైనవేనా? అసలు పత్రాలు ఉన్నాయా, ఎక్కడైనా తనఖా పెట్టారా?ఆస్తి ఇంతకు ముందే అమ్మరా? ప్రభుత్వం/ప్రభుత్వ సంస్థల ఆసక్తి ఏమైనా ఉందా? దావా తగాదాలేమైనా ఉన్నాయా? ఇళ్ల స్థలాలకు, నిర్మాణాలకు సరైన అనుమతులు ఉన్నాయా?స్వాధీనంలో ఎవరు ఉన్నారు? ఇలాంటి అనేక విషయాలు వాకబు చేయాల్సిందే. సంబంధింత పత్రాలను ఎలాంటి మొహమాటం లేకుండా అడగండి. వాటిని అనుభవజ్ఞులైన న్యాయవాదులకు చూపించి సలహా పొందండి. ఆపైన పత్రాన్ని సరైన విధంగా రాయించుకోవాలి.

### సమస్యలేం ఉండవా?

అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. కాబట్టి, ఇక సమస్యలేం రావని కచ్చితంగా ఉండడానికి వీలు లేదు. కాకపోతే ప్రమాద అవకాశాలు తగ్గుతాయి. ముఖ్యమైన విషయం ఏంటంటే మీరివన్నీ చేస్తే చట్టం మీకు అదనపు రక్షణ కల్పిస్తుంది. అంటే..మిమ్మల్ని సొమ్ము చెల్లించి, నిజాయతీగా ఆస్తి పొందిన వ్యక్తిగా పరిగణిస్తుంది. అప్పుడే మీకు కొన్ని ప్రత్యేక హక్కులు వస్తాయి.

### అది ఎప్పుడంటే...?

మీరు ప్రతిఫలం ఇచ్చి ఆస్తి పొందిన వారు అయి ఉండాలి.

ఆస్తిపై ఇతరులకున్న హక్కులు తెలిసి ఉండకూడదు.

ఈ రెండింటిలో ఏది మీకు వర్తించకపోయినా మీరు సదుద్దేశంతో ఆస్తి కొన్న వారు కాదని అర్థం. తెలిసి ఉండటం అంటే నోటీసు కలిగి ఉండటం అని. చట్టం దీన్ని చాలా స్పష్టంగా, విపులంగా విశదీకరించింది. మనకున్న హక్కుల్ని విస్మరించి ఎవరైనా మన ఆస్తి అమ్మాలని కానీ ఇతరులకు బదిలీ చేయాలనీ ప్రయత్నిస్తే.. కొనేవాళ్లకు నేరుగా గానీ, పత్రికా ముఖంగా గానీ తెలియజేస్తాం. ఒక ఆస్తిని మనం కొనాలనుకున్నా పత్రికా ముఖంగా ప్రకటన ఇస్తాం. ఇవన్నీ మనం సదుద్దేశాన్ని చూపించే చర్యలు. మన హక్కుల్ని చెప్పినా లెక్క చేయకుండా కొన్నాడనుకోండి, మనం చేపట్టే చర్యలకు అతడు బద్ధుడే. అమాయకపు నటన సాధ్యం కాదు. కోర్టు తుది ఉత్తర్వు (డిక్రీ)లకు లోబడే అన్ని లావాదేవీలు ఉంటాయని గమనించాలి.

### వాదిస్తే ఫలితం లేదు

ఎదురుగా ఉన్నదాన్ని తెలియదని బుకాయిస్తే చట్టం ఒప్పుకోదు. కొన్ని సందర్భాల్లో వాస్తవంగా తెలియకపోయినా తెలియదని వాదించడం సాధ్యం కాదు. అదెలా అంటే...
కావాలని వాకబు చేయకపోవడం
స్థిరాస్తికి సంబంధించిన వివరాలని సేకరించాలి. రిజిస్టరు దస్తావేజుల గురించి రెవిన్యూ రికార్డులు పరిశీలించాలి. అసలు దస్తావేజు ఏమైందో కనుక్కోవాలి. అది మీ బాధ్యత. తెలుసుకోకపోయినా మీకు తెలిసినట్టే చట్టం భావిస్తుంది. మీకు వచ్చిన రిజిస్టరు కవర్ మీరు తీసుకోకుండా తిరిగి పంపించినా, అందులోని విషయాలు మీకు తెలిసినట్టే. తప్పించుకుంటే తప్పే వ్యవహారం కాదు.

### నిర్లక్ష్యం

మీకు అనుమానం రావాల్సిన సందర్భాల్లో విస్మరించడం. అంటే మీరు చూసిన దస్తావేజుల్లో కోర్టు సీలు ఉందనుకోండి.. అది ఎందుకు వచ్చిందో, ఆ దావా సంగతులేంటో, ఉత్తర్వులు ఏంటో దరిమిలా ఆ హక్కులు ఏంటో తెలుసుకోవాలి. నాకు తెలీదు అంటే కుదరదు.

### రిజిస్టరు దస్తావేజులు

రిజిస్టరు అయి, ఇండెక్సు పుస్తకాల్లో పొందుపర్చిన అంశాల గురించి ప్రతి వ్యక్తి తెలుసుకున్నట్టే చట్టం భావిస్తుంది. అందుకే రిజిస్ట్రార్ ఆఫీసులో ఇచ్చే మొక్కుబడి పుస్తకాల మీద ఆధార పడొద్దు. ఇండెక్స్ పుస్తకాల్ని పరిశీలించండి.

### స్వాధీనం

స్వాధీనంలో ఉన్న వ్యక్తి హక్కుల్ని తెలుసుకోవాలి. అలాంటి వ్యక్తులకు యాజమాన్య హక్కుల పురోభావన ఉంటుంది. అందుకే, ఎవరు స్వాధీనంలో ఉన్నా వారి హక్కుల గురించి విచారణ చేయాల్సి ఉంటుంది.

## ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓకు సెబీ గ్రీన్ సిగ్నల్!

దిల్లీ: ప్రముఖ విద్యుత్ వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు మార్గం సుగమమైంది.
ప్రతిపాదిత ఐపీఓకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలిసింది. మొత్తం రూ.7,250 కోట్లను ఐపీఓ ద్వారా ఓలా ఎలక్ట్రిక్ సమీకరించనుంది. సెబీ నుంచి అనుమతి పొందిన తొలి ఈవీ స్టార్టప్ ఇదే కావడం గమనార్హం.
ఐపీఓ కోసం సెబీకి ఓలా ఎలక్ట్రిక్ గతేడాది డిసెంబర్‌లోనే దరఖాస్తు చేసుకోగా.. తాజాగా ఆమోదం లభించింది. ఐపీఓలో భాగంగా ఫ్రెష్ షేర్ల జారీ ద్వారా రూ.5,500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ 95.19 మిలియన్ షేర్లను విక్రయించనున్నారు. వీటి విలువ రూ.1,750 కోట్లు ఉంటుంది. ఓలా ఎలక్ట్రిక్ వ్యవస్థాపకుడు భవీశ్ అగర్వాల్ 47.3 మిలియన్ షేర్లను, సంస్థ ప్రారంభంలో పెట్టుబడులు పెట్టిన ఆల్ఫావేవ్, ఆల్పైన్, డీఐజీ ఇన్వెస్ట్‌మెంట్, మ్యాట్రిక్స్ 47.89 మిలియన్ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయించనున్నారు.

## హెచ్‌ఎండీ బ్రాండ్‌పై ఫీచర్ ఫోన్లు.. యూపీఐ సదుపాయంతో 105, 110 మోడళ్లు




నోకియా బ్రాండ్‌పై ఫోన్లు తయారుచేస్తున్న హెచ్‌ఎండీ సంస్థ తన సొంత బ్రాండ్‌పై రెండు ఫీచర్ ఫోన్లను దేశీయ మార్కెట్లో లాంచ్ చేసింది.హెఎండీ 110, హెచ్‌ఎండీ 105 పేరిట వీటిని తీసుకొచ్చింది. ఈ బ్రాండ్‌పై తీసుకొచ్చిన తొలి ఫోన్లు ఇవే కావడం గమనార్హం. పేరుకే ఫీచర్ ఫోన్‌లైనా వీటిలో కొన్ని మల్టీమీడియా ఫీచర్లు ఇస్తుండడం గమనార్హం. హెచ్‌ఎండీ 110 మోడల్ ధర రూ.1,119గా, 105 మోడల్ ధరను రూ.999గా నిర్ణయించారు. జూన్ 11 నుంచి హెచ్‌ఎండీ.కామ్, ఇ-కామర్స్ సైట్లు, ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో లభిస్తాయని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. హెచ్‌ఎండీ 110 నలుపు, ఆకుపచ్చ రంగుల్లో లభిస్తుంది. 105 మోడల్ నలుపు, నీలం, గులాబీ రంగులో లభిస్తుంది. ఈ ఫోన్లలో ఫోన్ టాకర్, ఆటోకాల్ రికార్డింగ్, ఎంపీ 3 ప్లేయర్ వంటి ఫీచర్లు ఉన్నాయి. రెండింటిలోనూ వైర్‌లెస్ ఎఫ్‌ఎం సదుపాయం ఉంది. డ్యూయల్ ఎల్ఈడీ ఫ్లాష్, ఇన్‌బిల్ట్ యూపీఐ సదుపాయం ఉంది. 110 మోడల్‌లో కెమెరా సెన్సార్ అమర్చారు. అయితే, దానికి సంబంధించిన వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఈ ఫోన్లకు ఏడాది పాటు రీప్లేస్‌మెంట్ గ్యారెంటీ ఉంటుందని హెచ్‌ఎండీ వెల్లడించింది. రెండు ఫోన్లలోనూ 1000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. స్టాండ్ బై మోడ్‌లో ఇవి సుమారు 18 గంటల పాటు పనిచేస్తాయి.

## జనంసాక్షి జాతీయం అంతర్జాతీయం

# 'పీఎం కిసాన్'పై మోదీ సంతకం..

### పేమెంట్ స్టేటస్ ఇలా తెలుసుకోండి..




దిల్లీ: కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోదీ.. పీఎం కిసాన్ నిధుల విడుదల పైనే తొలి నిర్ణయం తీసుకున్నారు.
సోమవారం ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పీఎం కిసాన్ 17వ వాయిదా చెల్లింపు దస్త్రంపై సంతకం చేశారు. దీనివల్ల 9.3 కోట్ల మంది రైతులకు రూ.20వేల కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలగనుంది.
పెట్టుబడి సాయం కింద మూడు విడతల్లో రూ.2వేలు చొప్పున ఏటా కేంద్రం ఈ పథకం కింద రూ.6 వేలు అందిస్తోంది. ఇప్పటివరకు రూ.3 లక్షల కోట్లకు పైగా మొత్తాన్ని కేంద్రం రైతుల ఖాతాల్లో జమ చేసింది. 17వ విడతగా కిసాన్ సమ్మాన్ నిధి మొత్తాలు త్వరలో బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఆన్‌లైన్‌లోనూ ఆ వివరాలు తెలుసుకోవచ్చు.

**పేమెంట్ స్టేటస్ ఇలా..**

పీఎం కిసాన్ (pmkisan.gov.in) వెబ్‌సైట్ ఓపెన్ చేసి.. అందులో బెనిఫిషియరీ స్టేటస్ పేజీపై క్లిక్ చేయాలి. ప్రత్యేకంగా ఓపెన్ అయ్యే పేజీలో ఆధార్ లేదా అకౌంట్ నంబర్ ఎంటర్ చేయాలి. గెట్ డేటా బటన్‌పై క్లిక్ చేయగానే పేమెంట్ వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ కేవైసీ చేయకపోతే నిధులు జమ కావు. కాబట్టి ఒకవేళ కేవైసీ పూర్తి చేయకుంటే అదే వెబ్‌సైట్‌లో ఇ-కేవైసీ బటన్‌ను క్లిక్ చేసి ప్రక్రియను పూర్తి చేయాల్సిఉంటుంది.



## మిషన్ భగీరథ ఇంటింటి సర్వే

**జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**

జగిత్యాల బ్యూరో, జూన్ 11,(జనం సాక్షి) మిషన్ భగీరథ ఇంటింటి సర్వే ద్వారా సేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం రోజున జగిత్యాల గ్రామీణ మండలం చల్ గల్ గ్రామంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే పనులను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సర్వే టీమ్ లు ప్రతీ ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ కనెక్షన్ ఇచ్చిన ఇంటి యజమాని పేరు, కుటుంబ వివరాలు,ఆధార్ నెంబర్,కులం, ఇంటిలో నివసిస్తున్న వారి జనాభా, నల్లా ఏ విధంగా వస్తున్నది, ఇంటి యజమాని ఫోటో, నల్లా వలన ఏమైనా సమస్యలు ఉన్నాయా వంటి అంశాలను సేకరిస్తుందని తెలిపారు. ఈ వివరాలను ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1169 లాగిన్స్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు, వివోలు, సి సిలు, ఫీల్డ్ సహాయకులు గ్రామ, మండల పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో సర్వే చేయడం జరుగుచున్నది తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో 2,21,283 ఇండ్లకి గాను ఇప్పటివరకు 30,787 ఇండ్ల సర్వే పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌పై ఆరోపణలు అవాస్తవం

**– ముస్తాబాద్ ఎస్.ఐ శేఖర్ రెడ్డి**



**ముస్తాబాద్ (జనంసాక్షి):** ముస్తాబాద్ మండలంలో ఈ రోజు వాహ నాల తనిఖీ సమయంలో ముస్తాబద్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నెంబ ర్ ప్లేట్ సరిగా లేవంటూ బైక్ లు ఆపుతూ బైక్ కిస్ తీసుకుంటున్నాడని, అడిగిన వారిపై దురుసు గా ప్రవర్తిస్తున్నాడని , అదేవిధంగా మండల కేంద్రంలో ఫర్టిలైజర్ షాప్ లో తనిఖీ కోసం వచ్చిన ప్రభుత్వ ఉద్యోగి యెక్క బైక్ తాళాలు కూడా తీసుకెళ్లాడని వచ్చిన ఆరోపణలపై అట్టి అగ్రికల్చర్ అధికారిని అడుగగా అలాంటిది ఏమి జరగలేదని తెలపడం జరిగిందని ముస్తాబద్ ఎస్.ఐ తెలిపారు. దొంగ వాహనాలను గుర్తించడానికి , ప్రమాదాల నివారణకు,నెంబర్ ప్లేట్ లేని వాహనాలను ఉపయోగించి చైన్ స్నాచింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని అరికట్టడానికి ప్రతి రోజు వాహనాల తనిఖీ చేపడుతున్నామే తప్ప ఇబ్బందులు పెట్టడానికి కాదని, వాహనా దారులు గమనించి వాహనాల తనిఖీలకు సహకరించాలని ఎస్.ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

## ఫోటోగ్రాఫర్ల నిరసన



**చొప్పదండి జూన్ 11( జనంసాక్షి):** శుభకార్యంలో సెల్ఫోన్లో ఫోటో తీయనందుకు ఫోటోగ్రాఫర్ పై భౌతిక దాడి ని నిరసిస్తూ చొప్పదండి మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఫోటో స్టూడియోలను బందు పాటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్ కుమార్ మాట్లాడుతూ భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామంలో సారీ ఫంక్షన్ కి హాజరైన ఫోటోగ్రాఫర్ పై సెల్ ఫోన్ లో ఫోటోలు తీయలేదని భౌతిక దాడి చేయడం దారుణం అని అన్నారు. ఫోటోగ్రాఫర్ పై భౌతిక దాడి చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సామల కిషోర్, ప్రధాన కార్యదర్శి తెలికుంట వేణు ,మాజీ అధ్యక్షులు సిరిపురం శ్రీనివాస్, తాటి పెల్లి శివ, సభ్యుడు పెద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు

జమ్మికుంట(జనంసాక్షి):ధర్మారం గ్రామంలో రేణుకా ఎల్లమ్మ తల్లి వార్షిక బోనాల ఉత్సవాలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు.మహిళలంతా బోనాలను నెత్తినపెట్టుకుని గ్రామశివారులోని ఎల్లమ్మగుడికి చేరుకుని తల్లికి బోనాలను ఓడిబియ్యాన్ని సమర్పించుకున్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పైడిపెల్లి ఆనందంగౌడ్, కౌన్సిలర్ బొంగోని వీరన్న గౌడ్, బుర్ర సంపత్ గౌడ్, పైడిపెల్లి అయోధ్య గౌడ్, బొంగోని శ్రీనివాస్ గౌడ్, గుర్రపు తిరుపతి గౌడ్, మంద ఎల్లాగౌడ్, పైడిపెల్లి మల్లిఖార్జునగౌడ్, పొన్నం వెంకటరమణ గౌడ్ ,పైడిపెల్లి పెద్దభీమయ్య గౌడ్, బొంగోని సదానందం గౌడ్, పైడిపెల్లి తిరుపతి గౌడ్, గట్టు సదయ్య గౌడ్, పంజాల రాజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కమీషన్ల కోసం కక్కుర్తి

పాడికౌశిక్‌రెడ్డి చౌకబారు ఆరోపణలు మానుకో... • నీకు ముడుపులు ముట్టకపోతే అడ్డగోలుగా మాట్లాడతావా..!

మంత్రి పొన్నంపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం • ఎన్జీటీ తీర్పులను తుంగలో తొక్కింది బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాదా!

అడ్డగోలు ఇసుక దోపిడీ చేసింది నువ్వు కాదా! • ఆధారాలను నిరూపించలేకపోతే కోర్టుకిడుస్తాం

**ఎమ్మెల్యే కవ్వంపల్లి హెచ్చరిక**

**కరీంనగర్ బ్యూరో, జూన్ 11 (జనంసాక్షి)** కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఎన్టిపిసి నుండి తరలిస్తున్న ఫ్లై యాష్ ఓవర్ లోడ్ లారీలతో వెళ్తున్నాయని ఇందులో మంత్రి పొన్నం ప్రభాకర్ హస్తం ఉందని హుజురాబాద్ ఎమ్మెల్యే బిఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని మానకొండూరు శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో అక్రమ సంపాదనకు రుచి మరిగిన పాడి కౌశిక్ రెడ్డి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అవినీతికి తావులేనందున 35 ఏళ్ల రాజకీయ జీవిత చరిత్రలో డీసీఎంఎస్ చైర్మన్ గా, మార్క్ ఫెడ్ చైర్మన్ గా, పార్లమెంటు సభ్యునిగా, నేడు మంత్రిగా ఎదిగిన పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న రవాణా శాఖలో పరిపాలన పూర్తి పారదర్శకంగా జరుగుతున్నందున తనకు కోట్ల రూపాయల కమిషన్లు ఇచ్చిన తరువాతనే తన నియోజకవర్గం మీదుగా ఫ్లైయాష్ లారీలు



వెళ్ళాలని లారీ యజమానులను ఇబ్బంది పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి విషయాన్ని మంత్రి పున్నం ప్రభాకర్ తీవ్రంగా పరిగణించినందునే ఓర్వలేక పాడి కౌశిక్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ పై అవాస్తవాలతో కూడిన ఆరోపణలు చేస్తున్నాడన్నారు. ఎమ్మెల్యేగా గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరుగుతున్న ఇసుక దోపిడి వల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టంపై స్పందించిన ట్రిబ్యునల్ కోర్టు ఇసుక తరలింపు నిలిపివేయాలని తీర్పు ఇచ్చినప్పటికీ పట్టించుకోకుండా కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతూ లక్షల టన్నుల ఇసుక తరలించినప్పుడు నాటి రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయిన కౌశిక్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడపబడుతున్న ఎన్టిపిసి ఫ్లై యాష్ తరలింపులో వే బిల్స్ ఉండవని, సీఆర్పీఎఫ్ రక్షణ వలయం నుండి వస్తున్న ఫ్లై యాష్ లారీల ఓవర్ లోడ్ గురించి కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదన్నారు.కుటుంబ సభ్యులతో శవ రాజకీయాలు చేసి గెలిచిన పాడి కౌశిక్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ గ పై విమర్శలు చేయడం ద్వారా రోజు పత్రికల్లో నిలువడానికి, నియోజకవర్గ ప్రజలను ఆకర్శించడానికి అలాగే వారి పార్టీ అధినేత కేసీఆర్ ద్వారా మెప్పు పొందడానికి ఇలాంటి చౌకబారు ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి పొన్నం పై చేసిన ఆరోపణలు నిరూపించకపోతే కోర్టుకిడు ఇస్తామని మానకొండూరు శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

# బండికి శుభాకాంక్షల వెల్లువ



**కేంద్ర మంత్రి బండికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**



**కరీంనగర్‌బ్యూరో,(జనంసాక్షి):**బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు , కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా నియమితులైన నేపథ్యంలో మంగళవారం రోజున బిజెపి జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్ ఢిల్లీలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాపర్తి ప్రసాద్ మాట్లాడుతూ... కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ రాజకీయ ప్రస్థానం బిజెపి కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమన్నారు. పార్టీ సిద్ధాంతాన్ని కట్టుబడి సామాన్య కార్యకర్త నుండి కేంద్రమంత్రి స్థాయి వరకు బండి సంజయ్ కుమార్ రాణించగలిగారన్నారు.

**నియామకం పట్ల ఆర్యవైశ్యుల సంబరాలు**

బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి , పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా నియమితులైన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని కరీంనగర్ ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు వంగల పవన్ ఆధ్వర్యంలో టవర్ సర్కిల్లో , ప్రకాశం గంజ్ వద్ద సంబరాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులు టపాసులు పేల్చి , మిఠాయిలు పంపిణీ చేశారు. సామాన్య కార్యకర్త నుండి కేంద్ర మంత్రి స్థాయికి సంజయ్ కుమార్ రాణించడం సంతోషకరమన్నారు. ఆర్యవైశ్య సంఘం పక్షాన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్న కృష్ణ , రాష్ట్ర నాయకులు వంగల పవన్ , పట్టణ ఆర్యవైశ్య సంఘం కోశాధికారి సుద్దాల వెంకటేశ్ , అదనపు ప్రధాన కార్యదర్శి కొంజర్ల శ్రీకాంత్ , ఉపాధ్యక్షులు అల్లంకి సంతోష్ రాజు , సురేష్ , కైలాస నవీన్ లతోపాటు బిజెపి సీనియర్ నాయకులు హరికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**శుభాకాంక్షలు తెలిపిన జిల్లా మున్నూరుకాపు సంఘం నాయకులు**

మంగళవారం జిల్లా మున్నూరుకాపు సంఘం సమావేశం జిల్లా మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహములో జరిగినది. ఈ సమావేశములో నూతనంగా కేంద్రములో ఏర్పడిన ప్రభుత్వములో మున్నూరుకాపు ముద్దు బిడ్డ బండి సంజయ్ కుమార్ హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన సందర్భముగా వారికీ జిల్లా మున్నూరుకాపు యావత్ కుల బంధువుల తరపున శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి నియమానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోడి, అమిత్ షా లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ద్వారా దేశ , రాష్ట్ర ప్రజలకు మంచి జరుగాలని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు బొమ్మ రాధాక్రిష్ణ, ప్రధాన కార్యదర్శులు నలువాల రవీందర్, చల్ల హరిశంకర్, ఉపాధ్యక్షులు కర్ర రాజశేఖర్, పసుల మహిపాల్, హాస్టల్ ఇన్చార్జ్ ముప్పిడి బాలకృష్ణ , కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

**కేంద్రమంత్రి కి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకుడు సురేష్**

**సిరిసిల్ల పట్టణం (జనంసాక్షి):**కేంద్రహోమ్ వ్యవహారాల శాఖ మంత్రిగా బండి సంజయ్ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా సిరిసిల్ల బిజెపి నాయకులు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పత్తిపాక సురేష్ ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గా బిజెపి నుండి పోటీ చేసి గెలుపొందడం పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ సురేష్ ను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి ఉన్నారు.



# సాంకేతికత అందిపుచ్చుకోవాలి

**– టీఎస్ఎన్‌పీడీసీఎల్ జగిత్యాల ఎస్ఈ**

జగిత్యాల బ్యూరో(జనంసాక్షి):నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ జగిత్యాల సర్కిల్ పరిధిలో ఆన్ లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు రోజురోజుకు గణనీయంగా పెరుగుతుందని సూపెరింటెండింగ్ ఇంజనీర్ జగిత్యాల తెలిపారు .సాంకేతికతంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా వివిధ మాధ్యమాల ద్వారా ఆన్ లైన్ చెల్లింపులు సులభతరం చేసింది టీజీఎస్పీడీసీఎల్. ఇందులో భాగంగా మే నెలలో 43722 గృహ వినియోగదారులు ఆన్ లైన్ ద్వారా 4.43 కోట్ల రూపాయలు మొత్తాన్ని చెల్లించారన్నారు . ప్రతి నెల ఆన్ లైన్ ద్వారా చెల్లింపులు 20 % పెరుగుతుందని అన్నారు . టిజిఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ , వెబ్ సైట్ : లిలిలి.బిణనిజూటఇశ్రీ.ఇసీఏ, గూగుల్ పే , ఫోన్ పే , పే టియం ద్వారా మీ నెల వారి విద్యుత్ బిల్లులు చెల్లింపు చేయవచ్చు. అని గంటల తరబడి లైన్ లో నిలబడి విద్యుత్ బిల్లులు చెల్లించే దాని కంటే కేవలం రెండు నిమిషాల వ్యవధిలో మీ సర్వీస్ నెంబర్ ను నమోదు చేసి చిటికెలో మీ బిల్లులు చెల్లింపు చేసుకోవచ్చు అన్నారు . విద్యుత్ బిల్లుల కేంద్రాలకు వెళ్లకుండా కేవలం మీ ఆండ్రాయిడ్ ఫోన్ తో మీ విద్యుత్ బిల్లులు పైన తెలిపిన వివిధ యాప్ ల ద్వారా చెల్లించవచ్చు అని తెలిపారు . తద్వారా చెల్లింపు సులభతరం అవుతుంది, కట్టిన డబ్బుల పూర్వ వివరాలు కూడా తెలుసుకోవచ్చు , రసీదు కూడా పొందటం జరుగుతుందని అన్నారు. ఇప్పుడు కొత్తగా బిల్లు పైనే క్యూ ఆర్ కోడ్ ను ముద్రించడం జరుగుతుందని మొదట ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్ట్ ) గా వరంగల్



సర్కిల్ కేంద్రం లో మట్టెవాడ ఈఆర్ఓ పరిధిలో లో ప్రారంభించడం జరిగిందని ,త్వరలో జగిత్యాల సర్కిల్ లో కూడా ప్రారంభిస్తామని అన్నారు . మీకు అందించే బిల్లు పైనే క్యూ ఆర్ ముద్రించడం జరుగుతుందని ఆ క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా మీ బిల్లు తాలూకు సంబంధించిన వివరాలు , చెల్లించవలసిన మొత్తం కనపడుతుందని తద్వారా వినియోగదారులు అట్టి మొత్తాన్ని చెల్లించవచ్చు అని అన్నారు . జనగాం సర్కిల్ టౌన్ 2 సెక్షన్ పరిధిలో పూర్ణిమ కాలనిలోని వినియోగదారులకు (సెల్ఫ్ రీడింగ్) వారి కరెంట్ బిల్లులు వారే ఫోన్ లో తీసుకునే విధంగా అవగాహన కల్పించి వినియోగదారుల ఆదరణ పొందుతున్నారని , 100% సెల్ఫ్ రీడింగ్ కు వినియోగదారులే తీసుకుంటూ , అదే విధంగా బిల్లులు కూడా చెల్లిస్తున్నారని , వినియోగదారులకు కూడా 100 % సెల్ఫ్ రీడింగ్ పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు . భవిషత్తు మొత్తం డిజిటల్ పెమెంట్స్ ద్వారా నే అన్ని కార్యకలాపాలు సాగుతుంటాయని అన్నారు .

## ఋతుస్రావకప్‌లపై అవగాహన

**జమ్మికుంట(జనంసాక్షి):**పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళల ఆరోగ్య సంరక్షణకు అమెజాన్ సంస్థ సహకారంతో బాల వికాస స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఋతుస్రావం కప్ లపై మహిళలకు అవగాహన కల్పించి ఋతుస్రావం కప్ లను పంపిణీ చేశారు. ఋతుస్రావం కప్ ల ఉపయోగం వ్యక్తిగత పరిశుభ్రత పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి ప్రాజెక్టు కోఆర్డినేటర్ ధోవారి వసంత హాజరై మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణకు ఋతుస్రావం కప్ లను ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆమె మహిళలకు సూచించారు. మానవ మనుగడను శాసించే పవిత్రమైన ఓ సహజ ప్రక్రియ ఋతుస్రావం అని అన్నారు. మహిళలు బాగుంటేనే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందని ఆమె తెలిపారు. మహిళలు నెలసరి సమయంలో ప్యాడ్స్ ఉపయోగించడం వల్ల క్యాన్సర్ తో పాటు వివిధ రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంటుందన్నారు.ఇవి భూమిలో కరగడానికి అనేక సంవత్సరాలు పడుతుందని అలా కాకుండా వాటిని కాల్చితే పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. ఇవి మహిళల ఆరోగ్యానికి ఎంతో సురక్షితమని నెల నెల పాడ్స్ కొనవలసిన అవసరం ఉండదన్నారు. మహిళలకు ఋతుస్రావం కప్ లను పంపిణీ చేశారుబాల వికాస జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కెవికె శాస్త్రవేత్త ప్రశాంతి, బాల వికాస కోఆర్డినేటర్లు కే సుమలత, ఏ స్వాతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# మంచినీటి ఎద్దడి ఉండొద్దు

**మహమ్మద్ షబ్బీర్ అలీ**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 11 (జనంసాక్షి)** గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సి,ఎస్టీ, ఓబిసి, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో మంచినీటి సరఫరాపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, జిల్లా పంచాయతీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పైప్ లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి అరికడుతూ మంచినీటిని సరఫరా చేయాలన్నారు. కామారెడ్డి మునిసిపాలిటీల్లో 18,800 గృహ సముదాయాలకు ప్రతిరోజు 18.23 మిలియన్ లీటర్ల నీరు అవసరం కాగా మిషన్ భగీరథ, పెద్ద చెరువు, బోర్ వెల్స్ ద్వారా 10.59 మిలియన్ లీటర్ల నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నామన్నారు. తరచూ జిపిఆర్ పైప్ లైన్ లీకేజీలవల్ల నీరు సక్రమంగా రావడం లేదని, భవిష్యత్తు పట్టణ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇందల్వాయి నుండి మల్లన్నగుట్ట వరకు 24.7 కిలో మీటర్ల మేర రూ. 195 కోట్ల తో నూతన పైప్ లైన్ నిర్మాణం చేపట్టనున్నామని, టెండర్లు పూర్తయ్యాయని నిధుల మంజూరు కోసం మంత్రితో చర్చించి ఆరు మాసాలలో పనులు పూర్తి చేస్తామన్నారు.అమృత్ 2.0 క్రింద కామారెడ్డి మున్సిపాలిటీలో మంచినీటి సరఫరాకు రూ. 93 కోట్లతో రూపొందించిన కార్యక్రమం అగ్రిమెంట్ కావలసి ఉన్నదని, త్వరలో అగ్రిమెంట్ చేసుకొని పనులు ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం పెద్ద చెరువు తో పాటు టేక్రియాల్ చెరువు నుండి కామారెడ్డి పట్టణానికి మంచినీటి సరఫరాకు విడివిడిగా ప్రతిపాదనలు రూపొందించవలసినదిగా అధికారులకు సూచించారు. పనులు పూర్తి కావడానికి సమయం పడుతున్నందున తాత్కాలికంగా నీటి ఎద్దడి నివారణకు బోర్ వెల్స్ రీఛార్జ్ కు చర్యలు తీసుకోవలసిందిగా మునిసిపల్ కమిషనర్ కు సూచించారు. కాగా మునిసిపాలిటీలో రూ. 21 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయని, అందులో ఫిల్టర్ బెడ్ ల ద్వారా మంచినీటి సరఫరాకు రూ. 17 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయని ప్రభుత్వ సలహాదారుకు తెలుపగా సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని, నీటి పన్ను వసూలు పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టిఎఫ్ ఐడిసి పథకారం క్రింద కామారెడ్డి మునిసిపాలిటిటీ లో రూ. 24 కోట్లతో పలు పనులు చేపడుతున్నామని షబ్బీర్ అలీ తెలిపారు.గ్రామీణ ప్రాంతాలలో సరఫరా చేస్తున్న నీరు పసుపు రంగులో వస్తున్నదని, వాసన వేస్తున్నదని ఫిర్యాదులు వస్తున్నాయని, నాణ్యత గల నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. కాగా గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేకాధికారులు గత మే 7 నుండి 15 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లీకేజీలను అరికట్టడంతో పాటు బోర్ వేల్స్, రీ-ఛార్జి, మోటార్ల బిగింపు, నీటి సరఫరా కానీ ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా సరఫరా వంటి పనులు చేపట్టారని, ప్రస్తుతం నీటి ఎద్దడి లేదని కలెక్టర్ వివరించారు. రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించే కాళేశ్వరం 22 వ ప్యాకేజి పనుల ప్రగతిని సమీక్షిస్తూ ప్రస్తుత సంవత్సరంలో చేపట్టే పనులు, పెండింగ్ బిల్లుకు సంబంధించి రూ. 375 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ ఈ ఈ విద్యావతికి సూచించారు.మునిసిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ ఎస్ ఈ రాజేంద్ర కుమార్, ఈ ఈ లు స్వప్న, నరేష్ కుమార్, రమేష్, పబ్లిక్ హెల్త్ ఈ ఈ తిరుపతి కుమార్, డిపిఓ శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ఆదేశాలనూ పట్టించుకోరా!



- ‘ధరణి’ సమస్యల పరిష్కారంపై అధికారుల ఉదాసీనత
- ముఖ్యమంత్రి ఆదేశించిన లక్షకుపైగా ఆర్జీలు పెండింగ్‌లోనే..
- ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షుడు
- కొరివి వేణుగోపాల్

**కరీంనగర్ బ్యూరో, జూన్ 11 (జనం సాక్షి)** ధరణి సమస్యల పరిష్కారానికి 10 రోజుల డెడ్ లైన్ ను సీఎం రేవంత్ రెడ్డి పెట్టిన సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. కరీంనగర్ ప్రెస్ భవన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ధరణి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు ఆదేశించినప్పటికీ లక్షకు పైగా ఫైల్స్ ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయన్నారు. మార్చి ఒకటి నుంచి 17 వరకు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం ద్వారా ధరణి సమస్యల అర్జీలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు, ముఖ్యంగా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ వారు తగు చర్యలు తీసుకోలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా స్పెషల్ డ్రైవ్ ఆపి సామాన్య పద్ధతిలోని ఫైల్స్ పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ అవి కూడా జరగలేదన్నారు. మే 13 పోలింగ్ తర్వాత రెవిన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి జూన్ 4 లోపు ధరణి సమస్యలన్నీ పరిష్కరించాలని రెవిన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు కాని ఆ విషయం బయటకు రాకుండా రెవెన్యూ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. ఇవన్నీ సీఎం దృష్టికి వెళ్ల నందున 10 రోజుల్లో ధరణి సమస్యలను పరిష్కరించాలని డెడ్ లైన్ విధించి, ఆ లోపు ధరణి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారని రెవిన్యూ అధికారులు ఇలా ప్రభుత్వ ఆదేశాలను ఎందుకు పాటిస్తాలేరని ధరణి బాధితులు అడుగుతున్నారని తెలిపారు. ధరణి ప్రోగ్రాం ను గత బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద కుట్రతో ఏర్పాటు చేసిందని దాంతో మన రెవెన్యూ డిపార్ట్మెంట్ పెద్ద అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఉన్నవారు వేల ఎకరాల భూములను గుంజుకునే ప్రయత్నం చేశారని టిఆర్ఎస్ ప్రభుత్వం యాక్ట్ 2020 ద్వారా పాత ఆర్ఓఆర్ యాక్ట్ 1971 ని రద్దు చేసిందన్నారు. ధరణి అనే పోర్టల్ పద్ధతి ద్వారా లేనిపోని సమస్యలు సృష్టించి 22 లక్షల ఎకరాల భూములను సమస్యాత్మకంగా తయారు చేశారన్నారు. 2023 జూన్ 10 న కరీంనగర్ లో ధరణి ఒక చీడ పీడ అనే సదస్సును ఏర్పాటు చేసి టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రజలకు ఒక పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా అధికారులు ప్రభుత్వానికి సహకరించడం లేదన్నారు. కనుక పెద్ద ఎత్తున ప్రజలు ప్రజాసంఘాలు, రెవెన్యూ అధికారులపై, ముఖ్యంగా జిల్లా కలెక్టర్ ల పై తిరుగుబాటు చేస్తారని అన్నారు. ఇప్పటి అయిన ధరణి సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని ప్రజామిత్ర డిమాండ్ చేస్తుందన్నారు. రానున్న పరిణామాలకు రెవిన్యూ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ 4 సంవత్సరాల కాలంలో 100 ల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి ధరణి సమస్యలకు పరిష్కారం చూపించాలని కొరివి వేణుగోపాల్ కోరారు.

## బడ్జెట్‌పై రాష్ట్రప్రభుత్వం ముమ్మర కసరత్తు

వాటికి తగిన నిధులను, అనుమతులు తీసుకొని ప్రతిపాదించాలని సూచించింది. బడ్జెట్ అంచనాలకు తగిన హేతుబద్ధత ఉండాలని తెలిపింది.కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్ర అవసరాలను పరిగణనలోకి తీసుకొని వీలైనన్ని ఎక్కువ నిధులు పొందేలా స్పష్టమైన మార్గదర్శకాలకు లోబడి ప్రతిపాదనలు తయారు చేయాలని ప్రభుత్వం తెలిపింది. బడ్జెట్‌కసరత్తుపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కేవలం పథకాలకు సంబంధించిన వ్యయ ప్రతిపాదనలను మాత్రమే ఇవ్వాలని ఆర్థికశాఖ తెలిపింది. నిర్వహణా వ్యయానికి సంబంధించి గతంలో ఇచ్చిన ప్రతిపాదనల ఆధారంగా కేటాయింపులు చేయాలని పేర్కొంది.: పథకాలకు సంబంధించిన వ్యయ ప్రతిపాదనలను ఆయా శాఖలు ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆర్థికశాఖ పోర్టల్‌లో ఆన్‌లైన్ విధానంలో పొందుపర్చాలని వివరించింది. ఆయా శాఖల సచివాలయ పరిపాలనా విభాగాలు సదరు ప్రతిపాదనలను పరిశీలించి, అభిప్రాయాలతో 18వ తేదీ వరకు ఆర్థికశాఖకు పంపించాలని స్పష్టం చేసింది.

## అమ్మ ఆదర్శ పాఠశాలలతో ఉత్తమ విద్య

బీఆర్‌ఎస్ ప్రచారం చేస్తోంది. మేలైన ఒకే రకం విత్తనాలపై ప్రచారం చేసి కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ రైతులను బీఆర్‌ఎస్ నేతలు ఆందోళనకు గురి చేస్తున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్‌ఉండదంటూ దుష్ప్రచారాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పవర్ కట్ అనే సమస్యే లేదు. ప్రభుత్వ స్థలాలను ఏ స్థాయి వ్యక్తులు కబ్జా చేసినా.. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు మూ సుకొని ఉండదు’ అని హెచ్చరించారు.

# భారత గడ్డపై 'హాకీ వరల్డ్ కప్'..



భారత హాకీ అభిమానులకు గుడ్ న్యూస్. మన గడ్డపై త్వరలోనే మరో విశ్వ సమరం జరుగనుంది. ప్రతిష్ఠాత్మక ఎఫ్ఐహెచ్ హాకీ పురుషుల జూనియర్ వరల్డ్ కప్ టోర్నీకి ఇండియా ఆతిథ్యమివ్వనుంది. ఈ మెగా టోర్నీ నిర్వహణ హక్కులను అంతర్జాతీయ క్రికెట్ సమాఖ్య భారత్‌కు అప్పగించింది. ఈ విషయాన్ని మంగళవారం భారత హాకీ అధ్యక్షుడు దిలీప్ టర్కీ తెలిపాడు.

'ఎఫ్ఐహెచ్ పురుషుల జూనియర్ వరల్డ్ కప్ పోటీల ఆతిథ్య హక్కులను అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఈసారి భారత్‌కు అప్పగించింది. ఈ సందర్భంగా ఎఫ్ఐహెచ్, ఎఫ్ఐహెచ్ అధ్యక్షుడు డాటో టయ్యాబ్ ఇక్రమ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ప్రపంచ హాకీలో భారత పురోగతికి ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ కొలమానం కానుంది. అంతేకాదు హాకీ అభివృద్ధి కోసం మేము పడుతున్న తాపత్రయం భావి తరాలకు తెలియనుంది. సుదీర్ఘ హాకీ చరిత్ర కలిగిన భారత గడ్డపై యువ ఆటగాళ్ల ప్రతిభను వీక్షించేందుకు ఎదురుచూస్తున్నాం' అని టర్కీ వెల్లడించాడు.

**ఇది నాలుగోసారి..**

వచ్చే ఏడాది డిసెంబర్(2025)లో ఎఫ్ఐహెచ్ పురుషుల జూనియర్ వరల్డ్ కప్ టోర్నీ షురూ కానుంది. ఈసారి రికార్డు స్థాయిలో టైటిల్ కోసం ఏకంగా 24 జట్లు పోటీ పడుతుండడం విశేషం. నిరుడు మలేషియా ఈ ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చింది. ఆద్యంత ఆసక్తిగా జరిగిన ఆ టోర్నీలో జర్మనీ విజేతగా నిలిచింది. గతంలో మూడు సార్లు ఇండియాలో ఈ టోర్నీ జరిగింది. 2013, 2016, 2021లో భారత్ ఈ పోటీలకు ఆతిథ్యమిచ్చిం

# టీ20 ప్రపంచకప్ 2024లో వివాదం!



టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన థ్రిల్లింగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 4 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఓ డీఆర్ఎస్ నిర్ణయం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. 'డెడ్ బాల్ రూల్' కారణంగా బంగ్లా ఓ బౌండరీని కోల్పోగా.. ఆ నాలుగు పరుగుల తేడాతోనే దక్షిణాఫ్రికాకు విజయం దక్కింది. దాంతో డెడ్ బాల్ రూల్ దక్షిణాఫ్రికాకు వరంగా మారగా.. బంగ్లాకు శాపంగా మారింది. ఇంతకీ అసలేం జరిగిందంటే ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 113 పరుగులే చేసింది. అనంతరం ఛేదనకు దిగిన బంగ్లాదేశ్.. ఒక దశలో ఛేదించేలా కనిపించింది. చివరి నాలుగు ఓవర్లలో బంగ్లాకు 27 పరుగులు అవసరమయ్యాయి. 17వ ఓవర్‌లో ప్రొటీస్ పేసర్ బార్ట్‌మన్ వేసిన రెండో బంతి బంగ్లా ఆటగాడు మహ్మదుల్లా ప్యాడ్లను తాకి.. స్టంప్స్ వెనుక నుంచి బౌండరీ వెళ్లింది. వెంటనే దక్షిణాఫ్రికా జట్టు ఎల్బీకి అప్పీల్ చేయగా.. ఫీల్డ్ అంపైర్ ఔట్ ఇచ్చాడు. మహ్మదుల్లా ఎల్బీపై బంగ్లాదేశ్ డీఆర్ఎస్ కోరింది. రిప్లైలో మహ్మదుల్లా నాటౌట్ అని తేలింది. అంపైర్ తన నిర్ణయాన్ని మార్చుకున్నప్పటికీ.. అప్పటికే ఆ బంతిని డెడ్‌బాల్‌గా పరిగణించడడింది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. బంగ్లా స్కోరుకు ఆ బౌండరీ జత కాకుండా పోయింది. సరిగ్గా ఇదే నాలుగు పరుగుల తేడాతో బంగ్లా ఓడిపోవడంతో.. ఇప్పుడు ఈ డీఆర్ఎస్ నిర్ణయం నెట్టింట చర్చనీయాంశమైంది. తర్వాతి ఓవర్లో (రబాడ బౌలింగ్‌లో) తౌహిద్, మహ్మదుల్లా ఔటవ్వడం బంగ్లా కొంపముంచింది. మొత్తంగా బంగ్లా దురదృష్టవశాత్తు మ్యాచ్‌ను కోల్పోయింది.

## ప్రియురాలిని పెళ్లాడిన ఇంగ్లండ్ మహిళా క్రికెటర్



ఇంగ్లండ్ మహిళా క్రికెటర్ డాని వ్యాట్ పెళ్లి చేసుకున్నారు. తన ప్రియురాలు జార్జి హాడ్జ్‌ను సోమవారం (జూన్ 10) లండన్‌లోని చెల్సియా ఓల్డ్ టౌన్ హాల్‌లో వివాహం చేసుకున్నారు. పెళ్లికి సంబంధించిన ఫోటోలను డాని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. పెళ్లి దుస్తుల్లో డాని, జార్జిలు మెరిసిపోతున్నారు. నూతన జంటకు అందరూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. డాని వ్యాట్, జార్జి హాడ్జ్‌లు 2019 నుండి డేటింగ్ చేస్తున్నారు. 2023 ప్రారంభంలో దక్షిణాఫ్రికాలో నిశ్చితార్థం చేసుకున్న ఈ జంట.. తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇద్దరూ ప్రస్తుతం లండన్‌లో కలిసి ఉంటున్నారు. సీఏఏ బేస్‌కు చెందిన ఓ మహిళా ఫుట్‌బాల్ జట్టుకు జార్జి హెడ్‌గా ఉన్నారు. లండన్‌లో ఎఫ్ఏ లైసెన్స్‌డ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక 33 ఏళ్ల వ్యాట్ ఇంగ్లండ్ తరఫున ఇప్పటి వరకు 2 టెస్టులు, 110 వన్డేలు, 156 టీ20లు ఆడారు. వన్డే, టీ20ల్లో రెండేసి సెంచరీలు చేశారు.

# శివమ్ దూబే స్థానంలో సంజూ శాంసన్?



టీ20 ప్రపంచకప్ 2024లో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. బుధవారం న్యూయార్క్‌లోని నాసౌ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగే మ్యాచ్‌లో ఆతిథ్య అమెరికాతో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఇదే వేదికపై జరిగిన గత రెండు మ్యాచ్‌ల్లో టీమిండియా అద్భుత విజయాలను అందుకుంది. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌ను ఓడించిన టీమిండియా.. గత ఆదివారం పాకిస్థాన్‌పై థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేసింది. 120 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకొని అసాధారణ విజయాన్నందుకుంది. అయితే అమెరికాతో మ్యాచ్‌కు ముందు టీమిండియాకు మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కీలక సలహా ఇచ్చాడు. పేలవ ప్రదర్శనతో ఇబ్బంది పడుతున్న శివమ్ దూబేను తుది జట్టులో నుంచి తప్పించాలన్నాడు. అతని స్థానంలో సంజూ శాంసన్‌ను ఆడించడం ఉత్తమమని అభిప్రాయపడ్డాడు. స్టార్ స్పోర్ట్స్ షోలో రాయుడు ఈ వ్యాఖ్యలు చేశాడు. 'శివమ్ దూబే స్థానంలో సంజూ శాంసన్‌ను ఆడించాలి. ఇది నా మనసులో నుంచి చెబుతున్న మాట'అని రాయుడు పేర్కొన్నాడు. సహజంగా రాయుడు చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాళ్లను విమర్శించడు. కానీ శివమ్ దూబే దారుణంగా విఫలమవడంతో అతన్ని తప్పించాలని సూచించాడు. ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్న శివమ్ దూబే.. బౌలింగ్ కూడా వేయగలడని భావించిన టీమిండియా మేనేజ్‌మెంట్.. బిగ్ హిట్టర్ రింకూ సింగ్‌ను పక్కనపెట్టి మరీ జట్టులోకి తీసుకుంది. కానీ అతను మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. ఐర్లాండ్‌తో బ్యాటింగ్ చేసే అవకాశం రాకపోయినా.. పాకిస్థాన్‌తో వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోలేక పోయాడు. 9 బంతుల్లో 3 పరుగులే చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. హ్యారీస్ రౌఫ్ బౌలింగ్‌లో డిఫెండ్స్ చేయబోయి షార్ట్ కవర్ ఫీల్డర్ మహమ్మద్ అమీర్ చేతికి చిక్కాడు. అమెరికాతో జరిగే తదుపరి పోరులో శివమ్ దూబేపై వేటు పడే అవకాశం ఉంది. అతని స్థానంలో సంజూ శాంసన్ లేదా యశస్వి జైస్వాల్ బరిలోకి దిగే అవకాశం ఉంది.

# ఎలా బౌలింగ్ చేయాలన్నదే చూస్తా



**ఒక్క సంవత్సరం వ్యవధిలోనే తన పట్ల కొందరికి అభిప్రాయం మారిపోయిందని టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అన్నాడు. తన కెరీర్ ముగిసిందన్న వారే.. ఇప్పుడు బుమ్రా సూపర్ అని అంటున్నారన్నాడు. ఎప్పుడైనా తన ముందున్న సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తా అని బుమ్రా చెప్పుకొచ్చాడు. 2022లో వెన్నుకు శస్త్రచికిత్స చేయించుకున్న బుమ్రా.. ఆస్ట్రేలియాలో జరిగిన టీ20 ప్రపంచకప్‌కు దూరమయ్యాడు. సొంతగడ్డపై పునరాగమనానికి ముందు గాయం తిరగబెట్టడంతో.. 10 నెలలు ఆటకు దూరంగా ఉన్నాడు. కోలుకున్న బుమ్రా.. గతేడాది గొప్పగా రాణించాడు. వన్డే ప్రపంచకప్ 2023లో సత్తాచాటాడు. ఇప్పుడు టీ20 ప్రపంచకప్ 2024లో అంచనాలకు మించి రాణిస్తున్నాడు. టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో జస్ప్రీత్ బుమ్రా నిప్పులు చెరిగాడు. తన కోటా నాలుగు ఓవర్లలో 14 రన్స్ ఇచ్చి 3 వికెట్స్ పడగొట్టాడు. అంతకుముందు ఐర్లాండ్ మ్యాచ్‌లో 3 ఓవర్లలో 2 వికెట్స్ తీసాడు. పాకిస్థాన్ మ్యాచ్ అనంతరం బుమ్రా మాట్లాడుతూ.. 'ఇప్పుడు అందరూ నాపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పుడు మాట్లాడుతున్న వాళ్లే ఏడాది కిందట నేను మళ్లీ ఆడలేనని అన్నారు. నా కెరీర్ ముగిసిందన్నారు. ఇప్పుడు అది మారిపోయింది. ఎప్పుడైనా నా సామర్థ్యం మేరకు బౌలింగ్ చేస్తున్నానా? లేదా? అన్నది చూడను. నా ముందున్న సమస్యను పరిష్కరించడానికి మాత్రమే ప్రయత్నిస్తా. ఇలాంటి పిచ్‌పై అత్యుత్తమం ఏంటన్నదే ఆలోచిస్తా. ఎలా బౌలింగ్ చేయాలన్నదే చూస్తా' అని తెలిపాడు.**

# టీ20 ప్రపంచకప్‌లో చరిత్ర సృష్టించిన భారత్!

20 ప్రపంచకప్‌లో భారత్ చరిత్ర సృష్టించింది. మెగా టోర్నీలో ఒకే ప్రత్యర్థిపై అత్యధిక విజయాలు నమోదు చేసిన మొదటి జట్టుగా రికార్డు నెలకొల్పింది. టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ సేన 6 పరుగుల తేడాతో గెలుపొందింది. టీ20 ప్రపంచకప్‌లో పాక్‌పై భారత్‌కు ఇది 7వ విజయం. దాంతో భారత్ ఖాతాలో ఈ అరుదైన రికార్డు చేరింది. పొట్టి టోర్నీలో ఇండో-పాక్ టీమ్స్ ఇప్పటివరకు 8 సార్లు తలపడగా.. భారత్ ఏకంగా ఏడు విజయాలు అందుకుంది. టీ20 ప్రపంచకప్ 2007లో గ్రూప్ స్టేజ్‌లో భారత్, పాకిస్తాన్ మ్యాచ్ టై అవ్వగా.. బాల్ ఔట్ పద్ధతిలో టీమిండియా గెలిచింది. ప్రపంచకప్ 2007 ఫైనల్లో ఇరు జట్లు తలపడగా.. భారత్ విజయం సాధించింది. టీ20 ప్రపంచకప్ 2009లో ఇరు జట్లు వేర్వేరు గ్రూప్‌ల్లో ఉండటంతో తలపడలేదు. 2012, 2014, 2016 ప్రపంచకప్‌లో భారత్ గెలిచింది. టీ20 ప్రపంచకప్ 2021లో భారత్‌ను పాకిస్థాన్ ఓడించింది. 2022, 2024లో పాకిస్థాన్‌ను టీమిండియా ఓడించింది. టీమిండియాపై ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో పాకిస్థాన్ నిరాశే ఎదురైంది. ఏడు విజయాలు సాధించిన భారత్.. పాకిస్థాన్ పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. బంగ్లాదేశ్‌పై పాకిస్థాన్ ఆరు విజయాలు సాధించింది. వెస్టిండీస్‌పై శ్రీలంక కూడా 6 సార్లు గెలుపొందింది. ఇక టీమిండియాపై ఓటమితో పాకిస్థాన్ సూపర్ 8 చేరుకునే అవకాశాలు సన్నగిల్లాయి. గ్రూప్-ఏలో టీమిండియాతో పాటు అమెరికా రెండు విజయాలు సాధించి పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

# జగన్‌కు ఫోన్ చేసిన బాబు

- అందుబాటులోకి రాని జగన్
- సింగపూర్, కొరియా కాన్సులేట్ జనరల్స్ రాక

అమరావతి,జూన్ 11 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అరుదైన ఘటన చోటు చేసుకుంది. ముఖ్యమంత్రిగా తన ప్రమాణ స్వీకారానికి మాజీ సీఎం జగన్‌ను ఆహ్వానించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు స్వయంగా ప్రయత్నించారు. జగన్‌తో మాట్లాడేందుకు చంద్రబాబు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. కార్యక్రమానికి హాజరు కాకూడదని వైసీపీ పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. అందువల్లనే అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. ఫలితాల తర్వాత మీడియా ముందుకు వచ్చిన ఆయన 11సీట్లకు పరిమితం కావడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లనే చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్స వానికి దూరంగా ఉండాలని వైసీపీ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి సింగపూర్, కొరియా కాన్సులేట్ జనరల్స్, ఇతర ప్రతినిధులు గన్నవరం విమానాశ్రయా నికి చేరుకున్నారు. ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియా, నెదర్లాండ్స్ కాన్సులేట్ జనరల్స్‌కూ ఆహ్వానం పంపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ అధినేత చంద్రబాబు.. విదేశీ పెట్టుబడుల కోసం పావులు కదుపుతున్నారు. చంద్రబాబు సీఎం కానున్న నేపథ్యంలో అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు పలు విదేశీ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. దీనిలో భాగంగా పలు రాయబార కార్యాలయ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఆహ్వానం పంపింది. దీంతో వారు చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వస్తున్నారు. సింగపూర్, కొరియా కాన్సులేట్ జనరల్ ప్రతినిధులు చెన్నై నుంచి గన్నవరం విమానాశ్రయానికి ఇప్పటికే చేరుకున్నారు. రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులే లక్ష్యంగా చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు.

## వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టరాదు

**ఏలూరు:** వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించడాన్ని లెఫ్ట్ పార్టీల నేతలు తప్పుడుపడుతున్నారు. ఇది ఉచిత విద్యుత్ పథకం ఎత్తివేసే కుట్రలో భాగమని మండి పడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పంపు సెట్లకు విద్యుత్ మీటర్ల బిగింపును వెంటనే నిలుపుదల చేయాలని, విద్యుత్ మీటర్లు బిగించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. కొత్తగా ఏర్పడబోతున్న చంద్రబాబు ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలని అన్నారు. రైతులు దీర్ఘకాలం పోరాటాలు చేసి వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్‌ను సాధించు కోవడం జరిగింద న్నారు. ఉచిత విద్యుత్ పథకానికి వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించడం రైతుల మెడలో ఉరితాళ్ళు వేయ డమే అన్నారు. ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడేందుకే జగన్ ప్రభుత్వం జీవోను తెచ్చిందన్నారు.

# 18 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం



**శంషాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** నకిలీ నోట్లను పట్టుకుని నిందితున్ని అరెస్టు చేసిన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె. నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రంలోని కొప్పల్ తాలూకా హొసలింగాపుర గ్రామానికి చెందిన కొరచ మురుగేష (25) స్వగ్రామంలో జెకె కంప్యూటర్స్ అండ్ జిరాక్స్ షాప్ నిర్వహిస్తున్నారు. అతని తో పాటు అతని అన్న కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా లింగసుగుర్ మండలం జంతాపూర్ గ్రామానికి చెందిన కొరచ రవి చంద్ర (42 ) అన్న కొడుకు కొరచ యోగేశ్,( 22 ) నకిలీ నోట్లు తయారు చేయాలని నిర్ణయించుకుని ఒక ముఠాగా ఏర్పడ్డారు. ముగ్గరు కలిసి జెకె కంప్యూటర్స్ అండ్ జిరాక్స్ షాపులో 18 లక్షల విలువైన 500 నోట్లను జిరాక్స్ తీశారు . వాటిని అన్న రవిచంద్ర సూచన మేరకు మురుగేష్ నిన్న స్వగ్రామం నుంచి బ్యాగులో నోట్ల కట్టలను పెట్టుకొని నెంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ బయలుదేరాడు. అక్కడ ఒక వ్యక్తి మూడు లక్షల నకిలీ నోట్లు తీసుకుని లక్ష రూపాయల ఒరిజినల్ నోట్లు ఇస్తాడని అక్కడికి వెళ్లిన తర్వాత ఫోన్ చేయమని అన్న అతనికి సూచించాడు . ఒక వ్యక్తి నకిలీ నోట్లతో వస్తున్నాడు అన్న ముందస్తు సమాచారం మేరకు శంషాబాద్ మండల పరిధిలోని తొండుపల్లి గ్రామ జై భవాని టిఫిన్ సెంటర్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఉదయం 11:30 గంటల సమయంలో నెంబర్ ప్లేట్ లేని పల్సర్ బైక్ పై ముందుగా ఒక బ్యాగు పెట్టుకొని హెల్మెట్ లేకుండా వస్తూ తనిఖీలు చేసిన చేస్తున్న పోలీసులను చూసి భయపడి అక్కడినుండి తప్పించుకోవడాని ప్రయత్నించాడు.

అప్రమత్తమైన ఎస్సై భాస్కర్ రావు, సిబ్బంది తో కలిసి ఆ వ్యక్తిని పట్టుకున్నారు. ద్విచక్ర వాహనానికి సంబందించిన పేపర్లు చూపించ మని అడిగితే బైక్ పేపర్లు లేవన్నాడు. అనుమానం వచ్చి అతని దగ్గర ఉన్న బ్యాగ్ లో ఏమి ఉన్నాయని అడుగగా అట్టి వ్యక్తి తడబడుతూ సమాధానం చెప్పాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతని దగ్గర ఉన్న బ్యాగ్ ని తనిఖీ చేశారు . అందులో రూ. 500/- రూపాయల డబ్బు కట్టలు ఉన్నాయి. వెంటనే ఆ నోట్ల కట్టలను పరిశీలించి చూశారు.అవి నకిలీ నోట్లని అనిపించి అడిగితే నిజం ఒప్పుకున్నాడు. అతని వద్ద ఉన్న 18 లక్షల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. వెంటనే ఇద్దరు పంచుల సమక్షంలో కొరచ మురుగేష ఒప్పుకున్న విషయంపై పంచనామా నిర్వహించి, అతని దగ్గర ఉన్న నకిలీ డబ్బు నోట్ల కట్టలు ఉన్న గ్రీన్ అండ్ బ్లాక్ కలర్ బ్యాగ్ మరియు బ్యాగ్ లో ఉన్న .18 లక్షల విలువైన 50 నేల చొప్పున ఉన్న 36 నకిలీ నోట్ల కట్టలు , ఒక ఓపో స్మార్ట్ ఫోన్ ఒరిజినల్ నోట్లు రూ . 6,500/- ను, బ్లాక్ అండ్ వైట్ కలర్ పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పిచ్చుకపై బ్రహ్మాస్త్రం





- లంచాలకు సజీవ సాక్ష్యం అక్రమ నిర్మాణలు
- అధికారుల తీరుపై స్థానికుల మండిపాటు
- జోనల్ కమిషనర్ మెట్టికాయలు



**మల్కాజిగిరి,జూన్11(జనంసాక్షి) :** మల్కాజిగిరి సర్కిల్ లో పుట్టగొడుగుల్లా బహుళ అంతస్తుల భవనాలలో అదనపు అంతస్తుల అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అటువైపు కన్నెత్తి చూడని అధికారులు మౌలాలి డివిజన్‌లోని ఓ సామాన్యుడు 40 గజాల స్థలంలో ఇల్లు కట్టుకొని జీవనోపాధి కోసం షెటర్ వేశాడు. ఇంటి నిర్మాణానికి అనుమతి లేదని రెండు నోటీసులు జారీ చేసి మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీస్ బందోబస్తుతో కూల్చివేత మొదలుపెట్టారు. స్థానికులు విషయాన్ని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకు తీసుకు వెళ్లారు.వెంటనే స్పందించిన ఆయన సెక్షన్ ఆఫీసర్ కు మెట్టికాయలు వేసి పంపించాడని స్థానికులు చెబుతున్నారు. 40గజాల స్థలంలో ఇల్లు కట్టుకుంటే అనుమతులు అవసరమా విడ్డూ రంగా ఉందని టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణా లపై ఎన్నో ఫిర్యాదులు చేసిన పట్టించుకోని అధికారులు,40 గజాలలో నిర్మించు కున్న ఇంటికి ముడుపులు అందలేదని కూల్చడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నియమ నిబంధనలతో చేయవలసిన వారి విధులను ప్రభుత్వం ఇచ్చిన జీతాలు తీసుకుంటూ అవి సరిపోక లంచాలకు అలవాటు పడిన అధికారులు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ వారి జేబులు నింపుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. సర్కిల్లో జరుగుతున్న ఎన్నో అక్రమ నిర్మాణాలను వదిలేసి పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగించారనే విమర్శలు స్థానికుల నుండి వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు మల్కాజిగిరి సర్కిల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

**డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్**



40 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టి కమర్షియల్ సెట్టర్లు వేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఇంటి నిర్మాణానికి అనుమతులు లేవని నోటీసులు జారీ చేసి కూల్చివేశాము.టీఎస్ బిపాస్ కొత్త జీవో ప్రకారం అనుమతుతులు తీసుకోవాల్సిందే, నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# అక్రమ నిర్మాణాలపై అధికారుల కఠిన చర్యలు





- కమిషనర్ జి.రాజేంద్ర కుమార్
- తూతూమంత్రంగా కొన్నింటినే కూల్చివేత

కీసర, జూన్ 11 (జనంసాక్షి) : అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జి.రాజేంద్ర కుమార్ హెచ్చరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాల పై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. నాగారం మున్సిపాలిటీ లోని రాంపల్లి లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న మూడు షెడ్లు, రెండు సెల్లార్ లు, నాగారంలో ఒక షెడ్డు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ..ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఊపేక్షించబోమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంకా అనేక నిర్మాణాలు మిగిలే ఉన్నాయని, తూతూమంత్రంగా కొన్నింటినే కూల్చివేసి, అధికారులు పక్షపాతం వహించారని స్థానికులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ కావ్య, మున్సిపల్ సిబ్బంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
12 జూన్ 2024

# గడీల పాలన నుంచి విముక్తి

- తట్టుకోలేకపోతున్న పింక్ మీడియా
- దుష్ప్రచారం చేస్తే చట్టబద్ధంగా చర్యలు
- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరిక



**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** తెలంగాణలో పదేండ్లు గడీల పాలన సాగిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. సీఎం రేవంత్ వచ్చాకా గడీల పాలనకు స్వస్తి పలికారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రజా పాలన వచ్చిందన్నారు. ఏసీలకు అలవాటు పడ్డ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. పింక్ మీడియా అసత్యపు ప్రచారం చేస్తుందని విమర్శించారు. కొత్త యూట్యూబ్ ఛానల్స్ పెట్టి నెలకు మూడు లక్షలు ఇస్తున్నారని అన్నారు. గతంలో నే క్రిశాంక్ ఫేక్ జీవోలు తయారు చేసి జైల్లోకి పోయిండని గుర్తు చేశారు. టీఎస్ కు బదులు టీజీగా మార్చినందుకు వేలకోట్లు ఖర్చు అవుతున్నాయని ప్రచారం చేస్తున్నారని తప్పుడు పేపర్లు జీవో కాపీలు తయారు చేసి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు పిర్యాదు చేశామన్నారు. ఈ విషయంలో డీజీపీ వద్ద తేల్చుకుందాం రండని సవాల్ విసిరారు. ఏదైనా సమస్య ఉంటే ప్రజా దర్బార్ ఉంది చెప్పండని సూచించారు. బాధ్యత గల జర్నలిస్టులు కొందరు తప్పుగా వ్యవహరిస్తున్నారని బల్మూరి వెంకట్ అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు కొన్ని యూట్యూబ్ ఛానల్స్ పెట్టి దుమ్మెత్తి పోస్తున్నారని తప్పుడు పత్రాలు సృష్టించి బీఆర్ఎస్ అఫిషియల్ అకౌంట్స్ లలో పెట్టి నిజమని నమ్మిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం తప్పు చేస్తే విమర్శించండి. తప్పుడు ప్రచారాలు చేయకండని సూచించారు. గురుకుల, ఏఈఈ అభ్యర్థులు ఆందోళన పడకండని కొందరు రాజకీయ లబ్ది కోసం విద్యార్థులను, నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు ఒక్కొక్కటి సరి చేస్తున్నామని తెలిపారు. ఒక్క ఇబ్బంది కలగకుండా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించామని బల్మూరి వెంకట్ చెప్పారు.

# ప్రజల గోడు విన్న సీతక్క

- ప్రజాభవన్‌లో ప్రజావాణికి 702 అర్జీలు



**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం ప్రజల నుంచి ప్రజావాణి ఇంచార్జీ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అర్జీలు స్వీకరించారు. వారితోపాటు నోడల్ అధికారి దివ్య కూడా ఉన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను ప్రజాప్రతినిధులకు, అధికారులకు వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ డ్రైవర్ కమ్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలల్లో పెరిగినందున ప్యాకేజీ పెంచాలని కోరారు. అన్ని విభాగాలకు సంబంధించి మొత్తం 702 దరఖాస్తులు నమోదయ్యాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 219 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 54, హోం శాఖకు సంబంధించి 52, హౌసింగ్ శాఖకు సంబంధించి 44, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 46, ఇతర శాఖలకు సంబంధించి 287 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు శ్రీమతి దివ్య, ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు స్వీకరించడం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



# కమిట్మెంట్‌తో పని చేయండి

- ప్రజల మన్ననలను పొందండి
- ట్రైనీ ఐఏఎస్ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** కమిట్మెంట్ తో పనిచేసి ప్రజల మన్ననలను పొందాలని శిక్షణలో ఉన్న 2023 బ్యాచ్ కి చెందిన ఐఏఎస్ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు హిత బోధ చేశారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారిని మర్యాద పూర్వకంగా 2023 బ్యాచ్ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు కలిశారు. డైరెక్టర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టు స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ శశాంక్ గోయల్ ఐఏఎస్, ట్రైనీ ఐఏఎస్ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి కి పరిచయం చేశారు. శిక్షణలో ఉన్న అధికారులకు కేటాయించిన జిల్లాలు, గత ఎన్నికల్లో వారు నిర్వహించిన విధుల గురించి డిప్యూటీ సీఎంకు ఆయన వివరించారు. భగవంతుడు ప్రజలకు చేసేందుకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవడం వల్లనే చేసే ఉద్యోగానికి సంతృప్తి దొరుకుతుందని డిప్యూటీ సీఎం వారితో అన్నారు. శిక్షణలో ఉన్న సమయంలో క్షేత్రస్థాయిలోకి వెళ్లి లోతుగా అధ్యయనం చేయడం వల్ల ప్రజల సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం తెలుసుకున్న అంశాలను పరిగణలోకి తీసుకొని పరిపాలనలో తీసుకునే నిర్ణయాల వల్ల ప్రజా సమస్యలు పరిష్కరించడం సులువు అవుతుందన్నారు. భౌగోళికంగా, వాతావరణం విషయంలో తెలంగాణ రాష్ట్రం చాలా బాగుంటుంది అని, ప్రజల సహకారం కూడా మంచిగా లభిస్తుందన్నారు. శిక్షణ కాలంలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు నిర్వహించిన విధులు, వారు చేసిన అధ్యయనం గురించి డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్ ఐఏఎస్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి, నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ పెద్ద బోయిన, తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో ఎంతో సాధించాం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల, జూన్11 (జనంసాక్షి) :** దేశంలో 75 ఏళ్లలో ఏ రాష్ట్రం సాధించని విజయాలను తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం సాధించిందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కఠినమైన, పటిష్టమైన ఆర్థిక క్రమశిక్షణతో ఆదాయ వనరులను పెంచుకుంటూ 2014 నుంచి 2023 వరకు దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జలవిప్లవం, హరిత విప్లవం, క్షీర విప్లవం, నీలి విప్లవం, గులాబీ విప్లవాలతో దేశానికి ఆదర్శంగా నిలిచామని చెప్పారు. పల్లె ప్రగతికి నేరుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

# సింగరేణి వారసుల జీవితాలకు కొత్త ఉషోదయం

- డిపెండెంట్ల గరిష్ట వయో పరిమితి 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంపు
- అమలైన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ల హామీ!
- తక్షణమే లబ్ధి 300 మంది కి లబ్ధి!
- 2018 మార్చి నుండి వర్తింపు: సింగరేణి సిఎండి ఎన్.బలరామ్

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)



సింగరేణిలో కారుణ్య ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితి 35 సంవత్సరాలు దాటి ఉద్యోగ అవకాశాన్ని కోల్పోతున్న వారికి యాజమాన్యం తీపి కబురు అందించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి కార్మికులకు ఇటీవల ఇచ్చిన హామీ మేరకు కారుణ్య నియామకాల్లో గరిష్ట వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసినట్లు సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దాదాపు దశాబ్ద కాలంగా వయో పరిమితి నిబంధన వల్ల వందలాది మంది అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను అందుకోలేకపోయారని, సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఇటీవల హైదరాబాద్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో బదిలీ వర్కర్లకు అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇస్తున్న సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సూచించారన్నారు. ఈ విషయంపై కూలంకశంగా చర్చించి సింగరేణి బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఒప్పించి సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2018 మార్చి 9వ తేదీ నుండి ఈ గరిష్ట వయోపరిమితి సడలింపు స్కీంను వర్తింపజేస్తున్నామని తెలియజేశారు. దీనివల్ల 2018 నుంచి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న దాదాపు 300 మందికి తక్షణమే ప్రయోజనం చేకూరనుందన్నారు. రానున్న రోజుల్లోనూ మరింత మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. గరిష్ట వయో పరిమితి దాటిన వాళ్లు సింగరేణిలో ఉద్యోగం పొందడం కోసం దొంగ ధ్రువీకరణ పత్రాలతో తప్పుడు మార్గాలను ఆశ్రయించడం జరుగుతోందని.. దాని వల్ల విజిలెన్స్ కేసులను ఎదుర్కోవడంతోపాటు వారికి వచ్చే అన్ని బెనిఫిట్స్ను కోల్పోతున్నారని. వయో పరిమితి పెంపు వల్ల తప్పుడు మార్గాలను ఆశ్రయించబోరని పేర్కొన్నారు.

సింగరేణి సంస్థలో పనిచేస్తూ ఎవరైనా కార్మికుడు లేదా ఉద్యోగి మృతి చెందినట్లయితే ఆయన స్థానంలో అతని వారసుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తుంటారు. అలాగే అనారోగ్య కారణాల రీత్యా ఉద్యోగానికి అనర్హులుగా మెడికల్ బోర్డు ప్రకటించిన కార్మికుల వారసులకు కూడా సింగరేణి సంస్థ బదిలీ వర్కర్‌గా ఉద్యోగాల్లోకి తీసుకుంటుంది. ఈ రెండు విభాగాల్లోనూ వారసుల కనిష్ట వయసు 18 సంవత్సరాలుగాను గరిష్ట వయసు 35 సంవత్సరాలుగా పేర్కొనడం జరిగింది. కరోనా సమయంలో దాదాపు రెండేళ్లపాటు మెడికల్ బోర్డు నిర్వహించని కారణంగా కొంతమంది వారసులు గరిష్ట వయోపరిమితిని దాటిపోయింది. ఈ నేపథ్యంలో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు డిపెడెంట్ ఉద్యోగాలకు గరిష్ట వయోపరిమితిని 35 ఏళ్ల నుండి 40 ఏళ్లకు పెంచాలని ఎంతోకాలంగా యాజమాన్యానికి మొరపెట్టుకున్నారు. కొంతమంది కార్మికులు మెడికల్ బోర్డులో అన్ ఫిట్ అయినప్పటికీ వారి వారసుల వయసు 35 సంవత్సరాలు దాటడంతో ఉద్యోగం పొందే అవకాశం దక్కలేదు. ఈ పరిస్థితి కొన్ని కుటుంబాలలో చోటుచేసుకోవడంతో, ఆ కుటుంబాల వారసులకు ఉద్యోగం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల హైదరాబాదులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆధ్వర్యంలో 441 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. సభా కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ గరిష్ట వయోపరిమితి 40 ఏళ్లకు పెంచాలని, కార్మికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను తప్పనిసరిగా పరిశీలిస్తామని హామీఇచ్చారు. అనంతరం సింగరేణి యాజమాన్యంతో జరిగిన సమీక్ష సమావేశాల్లో ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్. బలరామ్ ను ఆదేశించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సింగరేణి యాజమాన్యం గరిష్ట వయోపరిమితిని 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఉత్తర్వులు సోమవారం సాయంత్రం విడుదల చేశారు.

## అర్హులకు వెంటనే ఉద్యోగాలు

**సిఅండ్ ఎండీ ఎన్.బలరామ్**

40 ఏళ్లకు సవరించబడిన ఉత్తర్వుల ప్రకారం అర్హులైన వారికి వెంటనే ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని సంస్థ ఛైర్మన్ ఎన్. బలరామ్ పేర్కొన్నారు. 2018 , మార్చి 9వ తేదీ నుండి ఈ స్కీం అమల్లోకి వస్తుందన్నారు. దీనికోసం సంబంధిత ఏరియాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అయితే ఇప్పటికే ఉద్యోగానికి బదులు ఏక మొత్తం సొమ్ము తీసుకున్న వారికి కానీ, అర్హులైన వేరే వారసునికి ఉద్యోగం పొందినవారు కానీ ఈ కొత్త సవరణ ప్రకారం తిరిగి ఉద్యోగం పొందే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు పాత గరిష్ట వయోపరిమితి నిబంధన ప్రకారం ఉద్యోగం పొందలేని, ఎటువంటి సెటిల్మెంట్ జరగని కేసులకు మాత్రమే ఈ కొత్త స్కీం అమలవుతుందని పేర్కొన్నారు.

## కార్మిక సంఘాల హర్షం

తాము ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న గరిష్ట వయోపరిమితి పెంపునకు రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సింగరేణి యాజమాన్యం ద్వారా ఉత్తర్వులు జారీ చేయించినందుకు సింగరేణి కార్మికులు తమ హర్షం ప్రకటిస్తున్నారు. ప్రజా పాలనలో కూడా అనేకమంది ఈ విషయంపై దరఖాస్తు పెట్టుకున్నామని, తమ విజ్ఞప్తులను మన్నించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు కూడా దీనిపై తమ హర్షం ప్రకటించారు.

# విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేయాలి

- అసమానతలు వ్యతిరేకంగా పోరాడాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి విద్య,వైజ్ఞానిక శిక్షణా తరగతుల ప్రారంభించిన ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్




**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** విద్యార్థులు తమ చదువులతో పాటు సమాజంలో అసమానతలు ,ఆర్థిక అంతరాలు రూపుమాపేందుకు సమాజాన్ని మార్చేందుకు అధ్యయనం చేయాలని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతుల ప్రారంభ సభ జరిగింది. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లడుతూ సమాజంలో ఆధిపత్య వర్గాల భావాజాలం అధికార భావాజాలంగా ఉందని,బలహీన వర్గాలు, పేదలు వారికి అందాల్సిన సౌకర్యాలు దేశంలో అందడం లేదని ఆయన అన్నారు. ఒక వర్గం పై పని గట్టుకుని మరి విషప్రచారం దేశంలో చేస్తున్నారనిఅన్నారు. ప్రశ్నించడం అనేది కీలకమని ప్రశ్నతోనే సమాజం ముందుకు వెళ్తుందని అన్నారు. భారతదేశంలో పాలిస్తున్న పాలకులు తమ భావాజాలం వ్యాప్తి చేసేందుకు, విద్య, చరిత్ర, అన్ని అంశాలను వాడుకుంటున్నారని ఆయన తెలిపారు. అందుకే సమసమాజం రావడానికి విద్యార్థులు తమ అకడమిక్ చదువులుతో పాటు సమాజంలో జరిగే దోపిడీ, అసమానతలు, ఆధిపత్య ధోరణలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లడుతూ దేశంలో సమసమాజ స్థాపనకు పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ,రానున్న కాలంలో బలమైన పోరాటాలు నిర్వహణకు ఈ తరగతులలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ రాష్ట్ర తరగతులలో రాష్ట్ర ఉపాధ్యాక్షులు రజనీకాంత్, శ్రీకాంత్ వర్మ, ప్రశాంత్,శంకర్,రాష్ట్ర సహాయ కార్యదర్శులు మమత, డి.కిరణ్, అశోక్ రెడ్డి, డి.ప్రశాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోత

**నిజామాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** జూన్ అంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ నెలలోనే విద్యాసంస్థలు, వ్యవసాయపనులు ప్రారంభమవుతాయి.ఈ నెల 12 నుంచి కొత్తవిద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లల చదువుకు పెట్టే ఖర్చులపై తల్లిదండ్రులు బేరీజు వేసుకుంటున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకునేవారు ప్రైవేటు విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అడ్మిషన్, డొనేషన్ ఫీజులు చూసి జంకుతున్నారు. ఇదివరకే చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం తదితర వస్తువుల కొనుగోలుతో తల్లిదండ్రులకు జేబులకు చిల్లుపడనుంది. దీంతో 'వామ్మో జూన్' అంటూ తలపట్టు కుంటున్నారు. ఒక వైపు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలి, ఏయే స్కూల్‌లో ఏ స్థాయి ఫలితాలు వచ్చాయి, తదితర అంశాలపై తల్లిదండ్రులు విశ్లేషించుకుంటున్నారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఫీజులు చుక్కలనంటుతున్నాయి. బుక్స్, యూనిఫాం, పెన్నులు, పెన్సిల్ ఇతరాత్ర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. మరోవైపు వానాకాలం సీజన్ మొదలవ్వడంతో రైతులు పెట్టుబడుల కోసం తిప్పలు పడుతున్నారు. విత్తనాలు, ఇతర ఖర్చులకు డబ్బుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూనే బ్యాంకర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో ఈనెల ఎలా గట్టేక్కుతుందా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పేద, మధ్య తరగతి కుటంబీకుల జేబులకు చిల్లుపడే మాసం వచ్చేసింది. జిల్లావ్యాప్తంగా సుమారు 600 పైగా ప్రైవేట్ పాఠశాలల్లో వాటి విద్యాప్రమాణాలు, ఇతర అంశాలతో కూడిన స్థాయిని బట్టి ఏడాదికి రూ.10 వేల నుంచి మొదలుకొని రూ.లక్షకు పైగా ఫీజులున్నాయి. అందులోనూ ఐఐటీ, ట్యూషన్, సాంస్కృతిక, కరాటే తదితర అంశాలు నేర్పించేందుకు అదనంగా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ప్రైవేట్ స్కూళ్లు వసూలు చేస్తున్నాయి.

# కలచి వేసిన మనస్సు.. కదిలొచ్చిన గ్రామస్తులు..

- స్థిరాస్థులు లేక రోడ్డుపైనే శవం..
- చందాలు వేసుకుని.. అంత్యక్రియలు జరిపించిన పెద్దలు..
- మానవత్వాన్ని చాటిన రాఘవరెడ్డిపేట వాసులు..



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** వారికి ఎలాంటి స్థిరాస్తులు లేవు.. కడు నిరుపేద కుటుంబం.. దంపతులిద్దరూ కూలీనాలి చేసుకుంటూ ఒకరికొకరు ధైర్యంగా ఉంటూ, జీవనం కొనసాగిస్తున్నారు.. ఈ క్రమంలోమాచర్ల రాజేశ్వరి(47) అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది.. కాగా వారికి కనీసం ఇల్లు కూడా లేకపోవడంతో శవాన్ని రోడ్డుపైనే వేశారు.. వీరి కుటుంబ ధీన పరిస్థితిని చూసి చూపరుల మనసు కలచివేసింది.. వారి కుటుంబ పరిస్థితి చూసి చలించిన గ్రామస్తులు స్పందించారు.. ఒకరికొకరు స్వచ్ఛంధంగా కదిలొచ్చి చందాలు వేసుకొని అంత్యక్రియలు జరిపించారు.. హృదయవిదారకమైన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన మాచర్ల రాజయ్య, రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం కాగా కుమారుడు చిన్నతనంలోనే చనిపోయాడు. ఉన్నంతలో కుమార్తెల వివాహం కూడా జరిపించారు. అయితే గత కొన్ని ఏళ్లుగా ఇద్దరు కూలి పని చేసుకుంటూ పొట్ట గడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా ఇటీవలే మాచర్ల రాజయ్య భార్య రాజేశ్వరి ఆరోగ్యం క్షీణించడంతో ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇంటి వద్దనే ఉండడంతో పరిస్థితి విషమించి మృతి చెందింది. వారికి కనీసం ఉండడానికి ఇల్లు కూడా లేకపోవడంతో మృతదేహాన్ని రోడ్డుపైనే వేసి విలపిస్తుండడం చూపరులను కంటతడి పెట్టించింది. కనీసం అంత్యక్రియలు జరిపించే అంత కూడా ఆర్థిక స్తోమత లేక, దిక్కుతోచని స్థితిలో ఉండగా, వారి పరిస్థితిని చూసి చలించి పోయిన గ్రామస్తులు స్పందించారు. గ్రామంలో చందాలు వేసుకొని 25 వేల రూపాయలు పోగు చేసి, దహన సంస్కారాల కార్యక్రమాలు జరిపించారు. 11వ రోజు కార్యక్రమం వరకు కార్యక్రమాలన్నీ చూసుకొనేలా గ్రామ ప్రజలు ముందుకు వచ్చి ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370